తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

సచిత్రమాసపత్రిక

ఫిబ్రవరి 2020. వెల రూ.5/-

## శ్రీనివాసమంగాపురం
## శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామి వారి
## వార్షిక బ్రహ్మోత్సవం

14-02-2020 నుండి
22-02-2020 వరకు



# శ్రీనివాసమంగాపురం
# శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామి వారి
# వార్షిక బ్రహ్మోత్సవం

**14-02-2020 నుండి**
**22-02-2020 వరకు**





18-02-2020 మంగళవారం
పగలు:
పల్లకీలో మోహినీ అవతారోత్సవం
రాత్రి: గరుడవాహనం

14-02-2020 శుక్రవారం
పగలు: ధ్వజారోహణం
రాత్రి: పెద్దశేషవాహనం

19-02-2020 బుధవారం
పగలు: హనుమద్వాహనం
సాయంత్రం: వసంతోత్సవం
రాత్రి: గజవాహనం

15-02-2020 శనివారం
సోమవారం
పగలు: చిన్నశేషవాహనం
రాత్రి: హంసవాహనం

20-02-2020 గురువారం
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

16-02-2020 ఆదివారం
పగలు: సింహవాహనం
రాత్రి: ముత్యపుపందిరివాహనం

21-02-2020 శుక్రవారం
పగలు: రథోత్సవం
రాత్రి: అశ్వవాహనం

17-02-2020 సోమవారం
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: సర్వభూపాలవాహనం

22-02-2020 శనివారం
పగలు: చక్రస్నానం
రాత్రి: ధ్వజావరోహణం



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ ।**
**నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్ బ్రవీమి తే ॥**

(శ్రీమద్భగవద్గీత 01వ అధ్యాయం-07వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** ద్విజోత్తమ!= ఓ బ్రాహ్మణశ్రేష్ఠా!; అస్మాకం తు= ఇక మన పక్షంలో; యే= ఎవరు; విశిష్టాః= ప్రముఖులో; మమ= నా యొక్క; సైన్యస్య= సైన్యమునకు; నాయకాః= నాయకులలో; తాన్= వారిని; తే= నీకు; సంజ్ఞార్థం= జ్ఞాపకము కొరకు; బ్రవీమి= చెప్పుచున్నాను.

**భావం:** ఓ బ్రాహ్మణోత్తమా! ఇక మన సైన్యంలో ప్రముఖులు, సేనానాయకులు ఎవరు కలరో వారలను జ్ఞాపకం కొరకు మీకు చెప్పుచున్నాను. (వినుడు)

## శ్రీవేంకటేశ్వరుడా... చిక్కితి మిందు...

పెఱుగఁగఁ బెఱుగఁగఁ - బెద్దలమైతిమి నేము
కఱకఱలే కాని - కడగంట లేదు

సరి నిన్న భుజియించి - చాలునన్న యన్న మే
అరిది నేఁ డప్పటిని - నాస రేఁచీని,
ధరలో రాతిరి గూడి - తనిసిన సతులే
పరగ నప్పటిని వి - భ్రాంతి రేఁచీని

మాయఁ గట్టివిడిచిన - మలినపుఁ గోకలు
యీయెడ నుదికితేనే - యిచ్చ రేఁచీని,
కాయముపై మోఁచి పెట్టెఁ - గట్టివేసిన సొమ్ములు
మాయలై దినదినము - మమత రేఁచీని

నీవు వట్టిన చలమో - నేము సేసినట్టి తపో్ప
శ్రీ వేంకటేశ్వరుఁడ - చిక్కితి మిందు,
మోవరాని మోపయి - ములుగ నియ్యదు మమ్ము
చేవ సంసారముపైఁ - జిమ్మి రేఁచీని

(అన్నమాచార్య సంకీర్తనలు సంపుటం-03, సంకీర్తనం-352)

దేవా! మేమీ సంసారంలో పుట్టి నానాటికి పెరిగి పెరిగి పెద్దలమయ్యాం. ఎన్నోపనులు చేశాం. ఎన్నో భోగాలనుభవించాం. ఎంతచేసినా, ఏమి అనుభవించినా తుదకు ప్రయాసలపాలౌతున్నామే కాని సంసార సాగరాన్ని ఈదటం దరిద్రొక్కటం మాత్రం మానటం లేదు.

నిన్న తృప్తిదీర తిని త్రేపి ఇక చాలునన్న అన్నమే నేడు మరల నిన్నటిలాగే ఆశగొల్పుతోంది. గతరాత్రి సురత కేళిలో సుఖింపజేసి తనవిదీర్చిన వనితలే నేడు మరల అప్పటిలాగే మరులు గొల్పుతున్నారు.

పూర్తిగా మాసిపోయినట్లు కట్టి విడిచిన మలినవస్త్రాల్నే ఉతికి మరల కట్టుకోవాలనిపిస్తోంది. ఒడలిపై అలంకరించి పిమ్మట పెట్టెలో కట్టిపడవేసిన సొమ్ములే మాయాప్రభావితాలై ప్రతిదినం మాలో మమకారం రేపుతూన్నాయి.

ఇది దేవుడవైన నీవు జీవులమైన మాపై బట్టిన పంతమో? లేక మాకై మేము జన్మాంతరాల్లో చేసికొన్న పాపఫలమో! భరింపరాని భారమై మమ్మిల్ని ఇది నోరు ఎత్తనీకుండా చేస్తోంది. బలమైనసంసారంపై మాకు భ్రాంతి మిక్కిలి విజృంభిస్తోంది అంటూ అన్నమయ్య మోహావేశాలపై భ్రాంతి వదలి భగవంతుడిపైనే ధ్యాస నిల్పాలని ఉద్బోధిస్తున్నాడు.



– డా॥ సముద్రాల లక్ష్మణయ్య




తిరుమళిశైఆళ్వారు సిద్ధార్థినామసంవత్సరం, మకర మాసం, మఘానక్షత్రం, ఆదివారం, మహీసారపురంలో 'సుదర్శనం' (చక్రం) అంశతో జన్మించారు. వీరికి భక్తిసార యోగి, భక్తిసారముని, చక్రాంశయోగి, యధోక్తకారి అనే బిరుదులున్నాయి. వీరు 120పాశురాలున్న తిరుశ్చంద విరుత్తం, 96 పాశురాలున్న నాన్ముగన్‌తిరువందాది అనే గ్రంథాలను రచించారు. ఇందు 96పాశురాలున్న 'నాన్ ముగన్‌తిరువందాది' గ్రంథంలోని 96పాశురాలు తిరుమల శ్రీవారికల్పవృక్షవాహనం, సర్వభూపాలవాహనసేవల్లో పారా యణం గావించబడుతాయి.

తిరుమళిశై బాల్యంనుండే మంచివిద్వాంసుడిగా పేరుపొందాడు. కాలక్రమమున పెరిగి పెద్దవాడైన అతడు భగవద్భక్తి కలవాడై, సర్వజ్ఞుడై, గొప్పకవి అయ్యాడు.

పూర్వం ఆయన బాల్యంలో మిగిల్చినపాలను త్రాగడంవల్ల జన్మించిన 'కనిక్కణ్ణన్' ఆయన శిష్యునిగా చేరాడు. ఈయన ఒకముసలిస్త్రీని పదహారేళ్లపడుచుగా మార్చాడు. ఆమెను ఒక రాజు వివాహం చేసుకొన్నాడు. తిరుమళిశై ఆళ్వారు వరప్రభావంవల్ల ఆ యువతి నిత్య యవ్వనవతిగానే ఉండిపోయింది. రాజు తనభార్య అలానే ఉండడానికి గలకారణం తెలుసుకున్నాడు. కణిక్కణ్ణన్‌ను పిలిపించాడు. తనమీద పద్యం చెప్పమంటే ఎక్కడో దేవాలయంలో నిద్ర పోతున్న విష్ణువును గూర్చి పద్యం చెప్పాడని తలంచి కణిక్కణ్ణన్‌కు దేశబహిష్కరణ శిక్ష విధించాడు. ఈ విషయం తెలుసుకున్న తిరుమళిశైఆళ్వారు 'నా నిజమైన శిష్యుడు కణిక్కణ్ణన్ ఊరువిడచి వెళ్లిపోతున్నాడు. కవి అయిన ఆళ్వారును నేను చెప్తున్నాను. నీవు ఆ పాముచాపను చుట్టుకొని నా వెంటరా!' అని తిరువెఫ్కా దేవాలయంలోని శ్రీమహా విష్ణువును పిలిచాడు. ఆ మాటలు విన్న విష్ణువు దేవాలయంనుండి అదృశ్య మయ్యాడు. నగరంలోని అన్ని దేవాలయా ల్లోనూ ఉన్న మహావిష్ణువు విగ్రహాలు మాయ మయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న పల్లవరాజు పశ్చాత్తాపంతో ఆ గురుశిష్యుల పాదాలపైపడి తిరిగి రమ్మని ప్రార్థించాడు. వారు అంగీకరిం చారు. వెంటనే అన్ని స్థలాల్లో ఉన్న మహావిష్ణువువిగ్రహాలు యథాప్రకారం దర్శనమిచ్చాయి. గురుశిష్యులిద్దరూ తిరు వెఫ్కాప్రాంతానికి వచ్చారు. వీరు తమ ప్రబంధాల్లో పలుదివ్యదేశాలను కీర్తించారు. వానిలో శ్రీ వేంకటాచలము నకు ప్రత్యేకస్థానముంది. వేంకటాద్రిని, అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని, అక్కడ వేంచేసి ఉన్న స్వామిని కీర్తించారు.

**10-02-2020న**
**తిరుమళిశై ఆళ్వార్ వర్షతిరునక్షత్రం**
**సందర్భంగా...**

వీరి మహిమలు అనేకములు. భగవానునకు వీరి పట్ల అనుగ్రహమెంతంటే, కుంభకోణంలో వెలసి ఉన్న శార్‌ఙ్గపాణిస్వామి భక్తిసారులకు ఆరగింపుకానిదే తాను ప్రసాదాన్ని స్వీకరించనన్నాడట. అందుకు ముందుగా భక్తిసారులవారికిచ్చిన తర్వాత స్వామికివ్వగా ప్రీతితో స్వీక రించాడట. అప్పటినుండే వీరికి "తిరుమళిశైప్పిరాన్" అని ప్రసిద్ధికల్గిందని, ఇది అర్చామూర్తికి సంబంధించినదని పెద్దల మాట.

తిరుమల తిరుపతి దేవస్థానముల సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 50 ఫిబ్రవరి, 2020 సంచిక : 09



వేంకటాద్రి సమం స్థానం
బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో
న భూతో న భవిష్యతి॥

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| పాముచాపను చుట్టుకొని వచ్చెయ్యి!! | శ్రీ ఎమ్.ఎమ్.క్రిష్ణయ్య | 04 |
| వందే కశ్యపాత్మజమ్.... | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 07 |
| శ్రీకృష్ణభగవద్విజయం | డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు | 11 |
| అజామిళోపాఖ్యానము | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 13 |
| సందేహాలు - సమాధానాలు | డా॥ పల్లం పద్మావతి | 15 |
| జన్మకోశివరాత్రి | శ్రీమతి ఎమ్.విజయలక్ష్మి | 16 |
| శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, శ్రీనివాసమంగాపురం | | 18 |
| చిరాయుష్మాన్‌భవ!! | శ్రీమతి ఎమ్.పద్మావతి | 22 |
| శరణన్నవారిని కరుణించే శ్రీవారు | శ్రీమతి ఎం.జయశ్రీ | 24 |
| మృత్యుంజయ మహామంత్ర జపఫలం | శ్రీ ఎం.అంజనీప్రసాద్ | 25 |
| పుట్టలో తపస్సు!! | శ్రీ ఎమ్వీ రమణ | 26 |
| దివ్యక్షేత్రం... తిరుమల | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 31 |
| కైంకర్యమే తనువు దాల్చితే... | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 34 |
| త్యాగైకధనుడు భీష్ముడు | ఆచార్య శలాక రఘునాథశర్మ | 35 |
| అందరిలోనూ దేవుడున్నాడు!! | మాస్టర్ వి.జి.ఎల్.అమార్త్య | 37 |
| దైవీగుణాలతో దుఃఖరాహిత్యము | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 38 |
| బోళాశంకరుడు | శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి | 40 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్ | 44 |
| మాంగల్యం తంతునానేన.... | శ్రీమతి టి.విజయరాణి | 45 |
| ఇంద్రుని గర్వభంగం | డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాస్ | 46 |
| ఆరోగ్యానికి మెంతులు | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 48 |
| భువనేశ్వరం - భాస్కరతేజం (గేయం) | శ్రీమతి దొడ్డపనేని ఉదయతేజ | 49 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ టి.వి.కె.పూర్ణప్రసాద సిద్ధాంతి | 51 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 52 |


ముఖచిత్రం : శ్రీదేవిభూదేవి సమేత శ్రీకల్యాణవేంకటేశ్వరస్వామివారు (శ్రీనివాసమంగాపురం)
వెనుక చిత్రం : శ్రీకపిలేశ్వరస్వామివారి నందివాహనసేవ (కపిలతీర్థం, తిరుపతి)

గౌరవ సంపాదకుడు
శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకుడు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

సంపాదకుడు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
ఎం.ఏ., ఎం.ఇడి., ఎం.సి.జె., ఎల్.పి.టి.,

ముద్రాపకుడు
శ్రీ ఆర్.వి.విజయకుమార్, బి.ఏ., బి.ఇడి.,
ఉపకార్యనిర్వహణాధికారి (ప్రచురణలు & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, సహాయఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

సప్తగిరి మాస పత్రిక

ఇతర వివరాలకు
ఫోన్ నెంబర్లు
0877-2264543
0877-2264359
0877-2264360

విడి ప్రతి : రూ. 5/-
సం॥ చందా : రూ. 60/-
జీవిత చందా : రూ. 500/-
విదేశాలకు సం॥చందా : రూ. 850/-

ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

24 గంటలూ పనిచేసే
తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్ నెం.
0877 2277777 / 2233333

వెబ్‌సైట్- www.tirumala.org, www.tirupati.org; ఆన్‌లైన్ సేవలు/వసతిసౌకర్యం కొరకు- www.ttdsevaonline.com
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri_helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.

సంపాదకీయం

# అందరికి ఆరోగ్యప్రదాత ఆదిత్యుడు!

**ఆదిత్యానా మహం విష్ణుః, జ్యోతిషాం రవిరంశమాన్ –** "అదితి పుత్రుల్లో విష్ణువును నేనే! ప్రకాశంతో వెలిగుతున్న జ్యోతుల్లో సూర్యుణ్ణీ నేనే!" – అంటూ భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు చెప్పాడు.

అపూర్వమైన వెలుగును, కాంతిని గురించి చెప్పాలనుకొన్నప్పుడు సూర్యదేవుడే మనకు పరమోన్నత మైన ప్రమాణం. అందువల్లే అనంతమైన వాఙ్మయప్రపంచంలో కోటిసూర్యప్రభాభాసితుడని, సహస్రసూర్య కిరణతేజోవిరాజితుడని... శ్రీమన్నారాయణుని తేజస్సుకు విశేషణాలుగా ఏర్పడ్డాయి.

'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం" అన్నట్లు లోకాలకన్నింటికి సూర్యుడు నేత్రం వంటివాడు. ప్రపంచమంతా సహస్రకిరణుడైన భాస్కరునివల్లే ప్రకాశిస్తోంది. చూడగల్గిన కన్నులున్నా చూపించగల వెలుగు ఉంటేనే కదా సార్థకత! కనుకనే, ప్రపంచానికంతా వెలుగును ప్రసాదించి అనంతమైన ప్రకృతిని, అద్భుతమైన భగవత్సృష్టిని సర్వత్రా దర్శిస్తున్న సూర్యుడు జగత్చక్షువుగా, విరాట్పురుషుడైన భగవంతుని నేత్రంగా వినుతింప బడ్డాడు.

విశ్వాంతరాళంలో అనంతజ్యోతిశ్చక్రంగా పరిభ్రమిస్తూ, సమస్తగ్రహాల్ని తనచుట్టూ పరిభ్రమింప చేసుకుంటూ రాత్రులూ, పగళ్లూ, పక్షాలూ, నెలలూ, ఋతువులూ, అయనాలూ, సంవత్సరాలూ... ఇలా మహత్తరమైన కాలగమనాన్ని దర్శింపజేస్తోన్న ప్రత్యక్షదైవం శ్రీసూర్యభగవానుడు.

ఆరోగ్యం ఉంటే అన్నీ ఉన్నట్లే! 'ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్' అన్నట్లు ఆరోగ్యంతో పాటు అన్నింటిని ప్రసాదించే సర్వసిద్ధిప్రదాత శ్రీప్రభాకరుడు. ప్రత్యక్ష భగవానిడిగా ప్రతినిత్యం ఉపాసింపబడుతూ, బ్రాహ్మ ముహూర్తంలో తన ఉదయం ద్వారా, సమస్త చరాచర వస్తువుల్నంతటినీ మేల్కొల్పుతూ, నిత్యజాగృతం చేస్తూ, తన చలనంద్వారా, ప్రకృతిలో సమతుల్యతను పరిరక్షిస్తూ లోకానికంతటికీ కన్నుగా, కర్మసాక్షిగా తన విధిని తాను నిర్వర్తిస్తూ "కాలాన్ని అతిక్రమించడం ఎవరికీ సాధ్యం కాదు" అంటూ కాలగమనాన్నీ, కాలతత్త్వాన్నీ ప్రత్యక్షంగా దర్శింపజేస్తున్న లోకబాంధవుడు శ్రీసూర్యనారాయణస్వామి.

అనంత తేజోవిరాజితుడై, సకలదేవతాస్వరూపునిగా ప్రత్యక్షంగా కనిపించే శ్రీసూర్యభగవానుణ్ణి ఎందరెందరో ఎన్నోవిధాల అర్చించి ఇష్టార్థసిద్ధిని పొందారు.

కలియుగభూలోకవైకుంఠవాసుడైన శ్రీవేంకటేశ్వరస్వామివారు భాస్కరుణ్ణి అర్చించి శ్రీఅలమేలుమంగను (మహాలక్ష్మిని) పొందాడు. కుంతీదేవి సహజకవచకుండల ధారి కర్ణుణ్ణి పుత్రునిగా పొందింది. ధర్మరాజుకు అరణ్యవాససమయంలో ఆహారసమస్యను తీర్చే అక్షయపాత్రను ప్రసాదించాడు. రామభక్తాగ్రేసరుడు, భవిష్య ద్బ్రహ్మ, చిరంజీవి అయిన ఆంజనేయస్వామి సూర్యునివద్దే విద్యనభ్యసించాడు. శ్రీరాముడు సూర్యుణ్ణి ఆరాధించి యుద్ధంలో విజయలక్ష్మిని చేపట్టాడు. సత్రాజిత్తు సూర్యోపాసనద్వారా బారువులకొద్దీ బంగారం కురిపించే శమంతకమణిని పొందాడు. యాజ్ఞవల్క్యమహాముని సూర్యునివద్ద శుక్లయజుర్వేదాన్ని అధ్యయనం చేశాడు.

సూర్యజయంతిగా పరిగణింపబడే రథసప్తమినాటి నుండి ఉత్తరదిశగా తన రథాన్ని మరలిస్తూ అందరికీ ఉత్తరోత్తర ఉత్తమోత్తమమైన ఆరోగ్యభాగ్యాలను ప్రసాదించాలనీ, రథసప్తమినాటి ఉషోదయవేళలో సూర్యప్రభవాహనంతో పాటు రాత్రివరకు జరిగే ఏడువాహనాలపై దర్శనమిచ్చే వేంకటాద్రి నారాయణుణ్ణి కన్నులారా దర్శించుదాం! కొండంతవరాలను గుప్పించుమని వేడుకుందాం!

*ఓం నమో వేంకటేశాయ*



# వందే కశ్యపాత్మజమ్...

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

సప్తాశ్వరథమారూఢం ప్రచండం కశ్యపాత్మజమ్।
శ్వేతపద్మధరం దేవం తం సూర్యం ప్రణమామ్యహమ్ ॥

భారతీయ సంస్కృతి సూర్యారాధనకు ప్రాధాన్యమిచ్చింది.

సూర్యునిలోని భౌతికశక్తులను విజ్ఞానశాస్త్రం పరిశీలించే ప్రయత్నం చేస్తుండగా, ఆ మహాజ్యోతిలోని దివ్యశక్తులను మన వేదసంస్కృతి యుగాలక్రితం ఆవిష్కరించింది.

మన వైదికవిజ్ఞానం నాలుగురకాల కోణాలను చూపిస్తోంది. భానుని నామార్థాలే ఈ విషయాన్ని స్పష్టం చేస్తాయి. మన ప్రాచీన శాస్త్రాలపట్ల గౌరవదృష్టి కలిగి, నిర్మలాంతఃకరణతో గమనించితే ఈ విశేషాలను తెలుసుకోగలం. సూర్యుని 'సప్తాశ్వ రథ మారూఢం' అనే నామంతో స్తోత్రం చేయడం ఆనవాయితీ. ఏడుగుర్రాలరథంపై సూర్యభగవానుడు అధిరోహిస్తాడని వర్ణన.

## దీనిలోని వైనాలను గమనించుదాం...

రంహణశీలత్వాత్ రథః- కదిలే లక్షణం కలది రథం. గమనం చేయడం ప్రసరించడం కాంతి లక్షణం. ఈ కాంతికి మూలమైనవాడు ప్రభాకరుడు. 'అశ్వం' అంటే 'కాంతికిరణం' అని అర్థం. 'అశూ వ్యాప్తౌ..' శీఘ్రంగా వ్యాపించే లక్షణం కలది అశ్వం. ఇది కాంతి స్వభావమే. అందుకే సూర్యకిరణాలనే అశ్వాలన్నారు.

'ఏకో అశ్వో వహతి సప్తనామా...' ఒకే అశ్వమది. 'సప్త' అని వ్యవహరించబడుతోంది- అంటూ వేదమంత్రం విశద పరచింది. దీనిని మనం గమనించినట్లయితే, మన శాస్త్రాల ఆధారంగా అనేక భావాలను స్వీకరించవచ్చు.

- ఒకే సూర్యకాంతి... ఏ వర్ణవికారమూ లేని శుద్ధవర్ణంలో ఉంటుందని, అదే వివిధ పరిణామాలవల్ల సప్తవర్ణాలుగా విభజింపబడుతున్నది సర్వజనవిదితమే. ఈ సప్తవర్ణాలే సప్తాశ్వాలు. ఇది వర్ణరూపకాంతిస్వరూపం.
- సూర్యోదయాన్ననుసరించి దినగణన చేస్తాం. పగటికి కారకుడు దివాకరుడే. ఇలాంటి ఉదయాలతోనే వారాలు ఏర్పడతాయి. ఈ వారాలు ఏడు. కాలస్వరూపుడైన ఆదిత్యుడు ఏడురోజులనే అశ్వాలుగా చేసుకుని విహరించే దైవం.
- పురాణప్రకారంగా సూర్యుని సప్తాశ్వాల పేర్లు: జయ, అజయ, విజయ, జితప్రాణ, జితశ్రమ, మనోజవ, జితక్రోధ (ఆధారం- భవిష్యపురాణం). కాంతి ప్రసరణలోని వివిధ దశలు. శక్తివిశేషాలే ఈ పేర్లు.
- వేదస్వరూపునిగా (ఋగ్యజుస్సామపారగః) భానుని భావిస్తుంది. మన ధర్మం. హనుమంతుడు, యాజ్ఞవల్క్యుడు సూర్యోపాసనవల్లనే వేదవిజ్ఞానవేత్తలయ్యారు. ఈ వేదంలోని ముఖ్య ఛందస్సులు ఏడు: గాయత్రి, త్రిష్టుప్, అనుష్టుప్, జగతీ, ఉష్ణిక్, పంక్తి, బృహతీ.
- మన శరీరంలో చర్మం, అస్థి, మాంసం, మజ్జ, రక్తం, మేదస్సు, శుక్రం అనే సప్తధాతువులున్నాయి.

**2020, ఫిబ్రవరి 01వ తేదీన రథసప్తమి సందర్భంగా...**

భార్యలు. ఇలా ఎన్నో విశేషాలు కలిగిన సప్తా శ్వరథస్థితుడు మనలను అనుగ్రహించుగాక!

## సర్వదేవాత్మకుడు

ప్రాతఃకాలాన్నే స్నానం చేసి, శుచిగా సూర్యుని నమస్కరిస్తే చాలు- పాప నిర్మూలనం జరిగి, పవిత్రులమవుతా మని మహాభారతంలో శ్రీకృష్ణుడు బోధించాడు.



సౌమ్యత, తీక్షత, ప్రశాంతం, ప్రచండం... అన్నీ సూర్యునిలోనే మనం చూడవచ్చు. ఘోరం, అఘోరం.... ఈ రెండింటితోనూ ప్రపంచాన్ని ప్రభావితం చేసే వాడీతడే కనుక రుద్రుడనీ, శివుడనీ, దిక్కులకు పతి అనీ వేదం పేర్కొంది.

వీటితో సంచరించే రథం ఈ దేహం. వీటిని నిర్వహించే అంతర్యామి రూపచైతన్యమే ఆదిత్యుడైన పరమాత్మ. మన ముఖంలోని నేత్రాలు (రెండు) నాసికలు (రెండు), చెవులు (రెండు), ముఖం (ఒకటి).. ఈ ఏడు జ్ఞానేంద్రియాలను నడిపే- బుద్ధిస్వరూప చైతన్యమితడే.

- ఈ ఏడు అశ్వాలతోసాగే సూర్యకాంతి విస్తరణనే సప్తాశ్వ రథచలనంగా పేర్కొన్నాయి వేదశాస్త్రాలు. ప్రతి భగవ ద్రూపమూ ఒక తత్త్వప్రతీక. వేదాలలోని సౌరశక్తికి సాకారమే సప్తాశ్వరథారూఢుని హిరణ్మయస్వరూపం.

జగతిని వికసింపజేసి, మేల్కొలిపి చలనం చేసే శక్తియే 'పద్మినీ'. రోగహరణమైన ప్రభాతకాలశక్తియే సుమంగళకారిణి 'ఉషాదేవి'. సూర్యజ్యోతివల్లనే వస్తువులను పోల్చుకోగలం. ఇది 'సంజ్ఞాశక్తి'. వెలుగుంటేనే నీడ ఉనికి. నీడనిచ్చే వెలుగే 'ఛాయాదేవి'.

ఈ నాలుగు ఒక సూర్యుని ఒకే కాంతియొక్క భిన్నరూపాలు. వీడని శక్తులు. వీటికి సంకేతాలే సూర్య

సూర్యునినుంచే దిక్కులు ఏర్పడుతున్నాయి. సూర్యోదయ దిశను తూర్పుగా తెలుసుకున్నాకనే, మిగిలిన దిశలను నిర్ణయిస్తున్నాం. కనుక 'దిశాంచ పతయే నమః' అని శ్రుతి మంత్రం వినుతించింది. ఆ కిరణాలే ఆయనకు సహస్ర కరాలు.

ఇవ్వడం, లాలించడం, పాలించడం, కర్మచేయడం చేతుల లక్షణం. సూర్యకిరణాలు ఈ నాలుగుపనులతో విశ్వానికి హితాన్నీ, రమ్యతనీ అందిస్తాయి. కనుక 'హిరణ్య బాహువు' అని కీర్తించారు.

ఈ కిరణాలను ప్రపంచమంతా పరచి వాటిద్వారా సకలచరాచరాలకు ప్రాణశక్తిని అందిస్తున్న వ్యాపకత్వంచేత ఈయననే 'విష్ణువు' అన్నారు.

కిరణాలకున్న గమనలక్షణం బట్టి 'గరుత్మంతుడ'ని పేర్కొన్నారు. కిరణాలనధిష్ఠించిన ఆదిత్యుడు గరుడవాహనారూఢుడు.

సూర్యుని చైతన్యశక్తే జగతికి ఐశ్వర్యాలను ప్రసాదిస్తోంది. అందుకే లక్ష్మిగా, పరాశక్తిగా జగదంబగా సౌర

శక్తిని ఆరాధిస్తున్నాం. (భానుమండల మధ్యస్థా.... లలితా సహస్రనామాల్లోని ఒక నామం.)

సూర్యకిరణాలు తీక్షణంగా ఉన్నా, సౌమ్యంగా ఉన్నా పరిణామంలో మనకు మంగళకరాలు.

మంగళమే ఆయన స్వభావం. అందుకే 'శివుడు' (మంగళమయుడు) అని ఆయనను నుతించారు (ఆదిత్యంచ శివం విద్యాతే... శాస్రోక్తి).

ప్రాణశక్తిప్రదానంతో సృష్టిని నిర్వహిస్తాడు– కనుక బ్రహ్మ, స్థితి, పోషణ కలిగించే శ్రీహరి. 'నారం' అంటే సర్వ జీవసమూహం. వారికి శక్తినిచ్చే ఆశ్రయశక్తి (ఆయనం) ఈతడే కనుక సూర్యనారాయణుడు.

**'ఇంధీ దీప్తౌ' 'ఇది ఐశ్వర్యే'**– అనే సంస్కృత ధాతువులననుసరించి ప్రకాశ, ఐశ్వర్య లక్షణాలచేత సూర్యుని 'ఇంద్రుడు' అన్నారు.

కిరణాల్లోని జిడ్డుశక్తి 'మిత్ర', పోషణశక్తి 'పూష', ఆర్ద్రత 'వరుణ', ఇలా సర్వదేవతలు సౌరశక్తి విశేషాలే. అందుకే వేదం ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి అనే మంత్రాన్ని సూర్యపరంగానే చెప్పింది.

ఉత్తరాయణ పుణ్యవేళ, దైవీయమైన సూర్యకాంతులు మన ప్రాంతాలకు సముజ్జ్వలంగా లభిస్తాయి.

ఈ కాంతిగమన పరిణామాన్నే 'రథం మారడం'గా చెప్పి, సప్తసంఖ్యా ప్రధానత చేత 'సప్తమి' తిథిని 'రథ సప్తమి'గా సూర్యారాధనకు వినియోగించడం మన సంప్రదాయం.

వారాలలో తొలిదినమైన ఆదివారం, తిథుల్లో సప్తమి – సూర్యారాధనకు ప్రశస్తం.

సూర్యనమస్కారం, ఆరాధన వైజ్ఞానికంగా, ఆధ్యాత్మికంగా కూడా సాఫల్యమైన భవ్యసంస్కృతి.

## ప్రత్యక్షదైవానికి ప్రణామాలు

కంటికి కనిపిస్తున్న మహాజలాలనుంచి పంటను ఎలా పండించడమో తెలుసుకొనడం, ఒక చిన్న వృక్షమూలం నుంచి ఔషధాన్ని ఎలా ఉత్పత్తి చేయడమో గ్రహించడం... విజ్ఞానం.

ఆ జ్ఞానం వర్ధిల్లిన ప్రాచీన భారతీయ మహర్షులు సౌరశక్తిలో దాగిన దైవీచైతన్యాన్ని ఎలా గ్రహించాలో వివిధ పద్ధతుల్లో బోధించారు.

సూర్యునినుంచి ప్రాణశక్తినీ, పంచభూతప్రకృతినీ ఈ భూమిపై నున్న ప్రతి అణువూ పొందుతోంది. భారతీయ వేద–పురాణాలన్నీ ఈ సూర్యశక్తిలోని పలు విధాలను పలు దేవతలుగా సంభావించాయి. సూర్యుడు వర్ణ (రంగుల) కారకుడనీ, శబ్దకారకుడనీ పలు మంత్రాలు చెబుతున్నాయి. ఒకే సూర్యకాంతి ఏడురంగులుగా విశ్లేషితమవుతుందని వేదం స్పష్టంగా చెబుతోంది.

ఉష్ణత, దీప్తి, వర్షం, జిడ్డుతనం– ఇవన్నీ సూర్యకిరణాలలోని శక్తులు. వీటికి పలురకాల పేర్లు ఉన్నాయి. జిడ్డు కలిగించే లక్షణం సూర్యునిలో ఉంది కనుకనే 'మిత్ర' అనీ, వర్షకారక లక్షణం 'వరుణ' అనీ, పోషించే లక్షణాన్ని 'పూషా' అనీ, ప్రకాశ లక్షణాన్ని 'భగ' అనీ పలు పేర్లు.

ఏడుకిరణాలకాంతులలో ఇంకా లెక్కలేనన్ని వర్ణాలు ఉద్భవిస్తాయని 'చిత్రం దేవానాం' అంటూ వేదం వర్ణించింది.

ఆదిత్యహృదయం సూర్యుని 'సర్వదేవతాత్మకుడు' అని వర్ణించింది. కాలకర్త, ఋతుకర్త, కర్మసాక్షి, శబ్దమయుడు– వంటి విశేషణాలను పరిశీలిస్తే ప్రాచీన ఋషులు సూర్యుని ఎంత అధ్యయనం చేశారో తెలుస్తుంది. భావించే సూర్యుడే అన్నప్రదాత. కాస్త ఆలోచిస్తే ఈ విషయం బ్రహ్మ విష్ణు శివాత్మకునిగా స్పష్టమవుతుంది.

చీకటికి సంకేతమైన అజ్ఞానాన్ని, అసత్యాదుల్నీ రాక్షసులుగా పేర్కొని వాటిని ఛేదించే 'ఆదిత్యులు' (దేవతలు) కాంతిశక్తులుగా వర్ణితమయ్యారు.

జగత్తును మేల్కొలిపే సూర్యుడు మనల్ని గమనిస్తున్నాడనీ, ఆయన పరమాత్మ అనీ నమ్మకమున్నవాడు

తప్పు చేయలేదు. సూర్యశక్తిని ఋతువుల గమనాలకు అను గుణంగా గ్రహించే పద్ధతులే ఈ దేశంలో వివిధ పండు గలుగా ఏర్పడ్డాయి.

సూర్యోదయాత్పూర్వమే నిద్రలేచి ఇల్లూ, ఒళ్లూ శుభ్రపరచి ఉదయభానుని స్వాగతించే సంస్కృతి మనది. బాలభానునికి అంజలించి, అర్ఘ్యమిచ్చే సంధ్యోపాసనను కాస్త పరిశీలించినా– కాంతిని ఆరాధించే 'భా'రతుల భవ్య వ్యక్తిత్వానికి జోహారులర్పిస్తాం.

సూర్యుని నారాయణునిగా ఆరాధిస్తూ– **"ధ్యేయః సదా సవితృ మండల మధ్యవర్తీ"** అని నమస్కరిస్తాం. ఆ సూర్యుని 'అరుణ' కాంతులలో 'కరుణ'ను దర్శించి అరుణాంబిక 'లలిత'గా ఉపాసిస్తాం.

బాగా పరిశీలిస్తే మన దేవతలందరూ సూర్య స్వరూపాలు.

ప్రత్యక్షదైవంగా గుర్తించి భౌతిక ఆధ్యాత్మిక సంకేతాలను సూర్యశక్తిలో సంభావించిన ఆర్షవిజ్ఞానం ప్రపంచానికి పాఠాలు నేర్పుతోంది. సృష్టి స్థితి లయ కారక మైన పరమాత్మ చైతన్యాన్ని 'పరంజ్యోతి' అని శాస్త్రాలు పేర్కొన్నాయి.

ఈ పరమ ప్రకాశం విశ్వమంతటా వ్యాపించినప్ప టికీ, దానిని స్వానుభవంతో గ్రహించగలగడం యోగులకే సాధ్యం. ఆ జ్యోతిని వివిధ ప్రతీకలద్వారా ఉపాసించడమే వివిధ మతధర్మాలలో గోచరించే సంప్రదాయాలు. అందులో ప్రధానంగా సూర్యునియందు పరంజ్యోతిని సంభావించి, సమారాధించడం భారతీయసంస్కృతిలో సనాతనమైన ఉపాసన.

సూర్యునియందు పరమేశ్వరుని ఆరాధించే వారు ఆత్మజ్ఞానాన్ని, మోక్షాన్ని పొందుతారు – అని ఉపనిషత్తులే సెలవిస్తున్నాయి. శైవ, వైష్ణవాదులవలెనే సౌరమతం కూడా విశిష్ట సంప్రదాయం. వైష్ణవులు 'సూర్యనారాయణ' అని పిలిస్తే, శివుణ్ణే ఆదిత్యునిగా శైవులు ఆరాధిస్తున్నారు. సూర్యజ్యోతినే గాయత్రిగా వైదిక సంప్రదాయం పేర్కొంటే, భానుమండల మధ్యస్థా అని శాక్తేయులు కొలుచుకుంటు న్నారు.

తమ తమ ఇష్టదైవాలను సూర్యునియందు ధ్యానించడం సంప్రదాయం; 'సూర్యనమస్కారాలు' హిందూ మత సదాచారంలో ప్రధానభాగం. మొదటివారాన్ని 'భానువారం' అని పిలిచే భారతీయ జ్యోతిర్విజ్ఞానం ప్రపంచంలో అన్నిప్రాంతాల కాలగణనంలోనూ స్వీకరించ బడింది.

హృదయా (దహరా)కాశంలోని అఖండమైన శాశ్వత జ్యోతి – ఆత్మ. బహిరాకాశంలో పరమదీప్తి ఆదిత్యుడు. ఈ ఆదిత్యుని మన కంటిలో వెలుగుగా హృదయంలో ఆత్మగా సమన్వయించి చేసే ఉపాసన **"అంతరాదిత్యోపాసన".**

సూర్యుని వేదమయునిగా భావించిన వేదసంస్కృతి 'త్రయీమయాయ త్రిగుణాత్మ ధారిణే' అని కీర్తించింది. సూర్యుని ఆరాధించి యాజ్ఞవల్క్యుడు వేదవిజ్ఞానాన్ని వరంగా పొందాడు. పరమ బుద్ధిమంతుడైన ఆంజనేయస్వామి సూర్యుని ఉపాసించి, ఆయననే గురువుగా స్వీకరించి సర్వ విద్యలలో ప్రవీణుడైనాడని రామాయణం, పురాణాలు చెబుతున్నాయి. ఆ విద్యవలన లభించిన దివ్య 'వర్చస్సు' సూర్యునినుండి వరప్రసాదంగా పొందిన కారణంగా 'సువర్చలాపతి'గా హనుమను సంకేతించారు.

దివోదాసుడనే రాజు సూర్యకిరణాల వలన అన్నాన్ని వండుకోగలిగాడని స్కాందపురాణం చెబుతోంది. ధర్మరాజు సూర్యోపాసన వలన అక్షయపాత్రను పొంది తన గృహస్థ ధర్మాన్ని నెరవేర్చుతూ ఆశ్రయించిన అతిథులకు ఆహారాన్ని సమకూర్చగలిగాడు. సాంబుడు (శ్రీకృష్ణుని పుత్రుడు) భాస్కరా రాధనవలన రోగంనుండి విముక్తుడయ్యాడు.

తేజఃస్వరూపులైన దేవతలందరూ సర్వతేజోమయు డైన ప్రభాకరునిలో అర్చనలందుకోవడంలో ఆశ్చర్యమే ముంది.



నమ్రతలేని సేవ స్వార్థము, అహంకారము

గత
సంచిక
తరువాయి
భాగం..

ధారావాహిక-10

# శ్రీకృష్ణభగవద్విజయం

- డా॥ వుయ్యూరు లక్ష్మీనరసింహారావు, 89198 32285

**చిన్నరాణి :** నిజం నిజం. మీ మాటలు మీ హృదయ సంస్కారాన్ని ప్రకటిస్తున్నాయి. మీ దంపతులు మాకు తోడుగా ఉండటం, మీపుత్రుడు మా పుత్రులకు తోడుగా ఉండటం మా పూర్వజన్మసుకృతంగా భావిస్తున్నాం. పరమశివుని కృప ఉంటేనే సజ్జనసాంగత్యం లభిస్తుందని పెద్దలు చెబుతుంటారు. మీదంపతుల చెలిమికి నోచుకున్న మేము అయిందుమౌళి (శివుని) యొక్క చల్లనిచూపులకు పాత్రులమయ్యామని విశ్వసిస్తున్నాం.

**బ్రహ్మదత్తుడు :** మిత్రమా! మిత్రసహా! ఈనాడు మీహిత వచనాలవల్ల మామనస్సులు తెప్పరిల్లాయి. ఈ సందర్భంగా ఒక ముఖ్యవిషయాన్ని మీ దంపతులు గుర్తుంచుకోవాలి. అదేమిటంటే - తపోభూమినుంచి మా పుత్రులు తిరిగివచ్చిన తరువాత కూడా మీరు వీలయినప్పుడల్లా మామందిరానికి వచ్చిపోతుండాలి. మనమైత్రీలత జీవితాంతమిలాగే సాగాలి సుమా!

అని చెయ్యి చాపాడు. మిత్రసహుడు నవ్వుతూ “అలాగే మహారాజా!” అంటూ రాజుచేతిలో చెయ్యి వేశాడు. వారిభార్యలు ఆనందంతో పరస్పరం చూచుకుంటూ మందహాసాలు చిందించారు.

- - - - - - - -

జనార్దనుడు అతని ఇల్లాలు పద్మావతి తమ ఇంటిలోని పూజగదిలో శ్రీకృష్ణుని విగ్రహానికి భక్తిశ్రద్ధలతో అర్చన చేశారు. అర్చనానంతరం దంపతులు మనస్సులోనే “ఓం నమో భగవతే వాసుదేవాయ” అనే ద్వాదశాక్షరీమంత్రాన్ని మననం చేస్తున్నారు. కొంతసేపటికి విగ్రహస్థానంలో శ్రీకృష్ణ పరమాత్మ ప్రత్యక్షమై “భక్తవరేణ్యా! జనార్దనా! భక్తిమతీ! పద్మావతీ!” అంటూ మృదుమధురంగా పిలిచాడు. భగవంతుని పిలుపు విన్న ఆ దంపతులు కన్నులు తెరిచి కళ్ల ముందున్న కమలాక్షుణ్ని చూచి ఆశ్చర్య రసాంభోధిలో మునిగిపోయారు. మధుసూదనుడు మందహాసం చేశాడు. దంపతులు కొద్దిక్షణాలలో తేరుకున్నారు. పులకరింతలతో ఉక్కిరిబిక్కిరయ్యారు.

**జనార్దనుడు :** భక్తవత్సలా! వాసుదేవా! నేటికి కరుణించావా స్వామీ!

**పద్మావతి :** రుక్మిణీనాథ! నమోనమః!!

అంటూ పద్మావతీజనార్దనులు జనార్దనుని పాదాలమీద వ్రాలారు. స్వామి వాత్సల్యంతో వారిని పైకి లేపాడు. వారినయనారవిందాలనుండి ఆనందబాష్పమకరందబిందువులు చిందుతున్నాయి.

**శ్రీకృష్ణుడు :** ఏమయ్యా జనార్దనా! నాదర్శనంకోసం మీరింతగా ధ్యానం చేయాలా? ఒకసారి మాద్వారకకే వస్తే సరిపోయేదిగా! ఏమమ్మా! పద్మావతీ! ఈ ఛాందసునికి నీవైనా ఉపదేశించవచ్చును గదా!

**పద్మావతి :** నానాథునిమార్గమే నామార్గం ప్రభూ!

**శ్రీకృష్ణుడు :** ఇతనికి తగినయిల్లాలివే సుమా!

**జనార్దనుడు :** శ్రీకృష్ణా! నేను నీనగరానికివస్తే నా భక్తి మాత్రమే వెల్లడవుతుంది. నీవే మా ఇంటికి వస్తే నీవు భక్తసులభుడవన్న సత్యం కూడా సర్వులకూ తెలుస్తుంది. అందుకే ధ్యానాదులతో నిన్ను ఆరాధిస్తున్నాం మాధవా!

**శ్రీకృష్ణుడు :** మీ ఆరాధనాబలంతోనే నన్ను ద్వారకనుండి రప్పించారు.

**పద్మావతి :** నీవు మా ఇంటికి వచ్చినా మేము నీసన్నిధికి వచ్చినా వ్యక్తమయ్యేది నీదయామయహృదయమే కదా జగన్నాథా!

**శ్రీకృష్ణుడు :** ఔరా! మీ దంపతులకు భగవంతుణ్ణి బంధించటం బాగా తెలిసిన విద్య. మీ భక్తికి పరవశించి మీ ఇంటిలోకే వచ్చాను గదా! వచ్చినందుకు ఏదో ఇచ్చి వెళ్లటం నా కర్తవ్యం. మీ కేమి కావాలో కోరుకోండి!

మాధవస్వామి మధురవచనాలకు ఆనందతుందిల హృదయులయిన ఆ దంపతులు చేతులు జోడించి–

కII నీ పదపద్మారాధన,
నీపదపూజకులతోడినెయ్యమ్ము, సదా
నీ పరమగుణస్మరణము,
తాపసమందార! మాకు దయసేయు మయా!

అని ప్రార్థించారు. సారసాక్షుడు సాలోచనగా నవ్వాడు.

**శ్రీకృష్ణుడు :** ఇవన్నీ మీలో ఇప్పుడున్న సుగుణాలే. క్రొత్తగా కోరిందేమీ లేదు. అయినా కోరారు గనుక ఈ సద్గుణాలు మీలో సర్వదా సర్వథా వర్ధిల్లుతాయి. ఇక మీరు కోరకపోయినా ఒకవర మనుగ్రహిస్తున్నాను. త్వరలోనే మీ దంపతులు నా సన్నిధిలో నివసించే శుభఘడియలు వస్తాయి. చిన్తితవిషయ సిద్ధిరస్తు!

అని దీవించి అంభోజాక్షుడు అదృశ్యమయ్యాడు.

**జనార్దనుడు :** ధన్యోస్మి శ్రీకృష్ణ ధన్యోస్మి!

**పద్మావతి :** ధన్యోస్మి శ్రీకృష్ణ ధన్యోస్మి!

అంటూ ఆభక్తదంపతులు ఆనందాశ్రువులు చిందిస్తుండగా రాజమందిరంనుండి తిరిగి వచ్చిన జనార్దనుని జననీజనకులు ఇంటిలోకి ప్రవేశించారు. వారి రాకను గమనించిన పద్మావతీ జనార్దనులు పూజగదినుండి బయటికి వచ్చి నట్టింటిలో తమ పెద్దలను కలుసుకున్నారు.

**జనార్దనుడు :** అమ్మా! నాన్నా! ద్వారకానేత శ్రీకృష్ణపరమాత్మ మాకు దర్శనమిచ్చాడు.

**పద్మావతి :** అవునత్తయ్యా!

వృద్ధదంపతులు విస్మయానికి లోనయ్యారు.

**మిత్రసహుడు :** ఏడి కుమారా ఆక్రీడామానవుడు?

**జనార్దనుడు :** ఇప్పటిదాకా మాతో ముచ్చటించాడు. త్వరలోనే ఆస్వామిసన్నిధిలో నివసించే అదృష్టం పట్టబోతుందని వరమనుగ్రహించి అదృశ్యమయ్యాడు.

**మిత్రసహుడు :** అయ్యో! మనమెంత దురదృష్టవంతులం! రాజమందిరంనుంచి క్షణకాలం ముందు వచ్చి ఉంటే ఆ పరమాత్ముణ్ణి దర్శించి ఉండేవాళ్లం. మనకా యోగం లేకపోయె.

**మిత్రసహుని భార్య:** ఆ పరమాత్మను దర్శించిన ఈ పుత్రునికి తల్లిదండ్రులమైనందుకు, ఈ ఇల్లాలికి అత్తమామలమైనందుకు మనం కూడా అదృష్టవంతులమే. మనది కూడా మంచి యోగమే.

**మిత్రసహుడు :** నువ్వన్నదే నిజం.

**పద్మావతి :** మీ పుత్రుని ఇల్లాలినైనందుకు ఆ పురుషోత్తముణ్ణి దర్శించి ధన్యురాలినయ్యా నత్తయ్యా!

**మిత్రసహుడు :** నేరుగా ఆనీరజాక్షుణ్ణి చేరుకోలేకపోయినా ఆ స్వామిని దర్శించి భాషించిన పుత్రుణ్ణి కన్నందుకు మాజన్మలు ధన్యమయ్యాయి. నాయనా! జనార్దనా! ఈ కన్నులే కదా ఆజగన్నాథుణ్ణి దర్శించింది!

అని పుత్రుని కందోయిని తన చేతులతో తాకి కన్నుల కద్దుకున్నాడు.

**మిత్రసహునిభార్య:** అమ్మా! పద్మావతీ! ఈ చేతులే కదా ఆదేవదేవుణ్ణి అర్చించింది!

అని కోడలిచేతులు తనచేతుల్లోకి తీసుకుని కళ్ల కద్దుకుంది. నలుగురి నయనాలనుండి ఆనందాశ్రువులు చింది హృదయాలమీద రాలాయి. *(ఇంకా ఉంది)*



ప్రతి సంస్కృతికి అడ్డుకోబడిన అనుభవం ఉంది

భాగవత కథాసాగరం

# అజామిళోపాఖ్యానము

- డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్,
98219 14642

అద్భుతమైన భగవన్నామమహిమను హృదయానికి హత్తుకునేటట్లు వివరించేదే అజామిళ చరితం. ఈ అజామిళచరితం శ్రీమద్భాగవతంలోని షష్ఠస్కంధంలో వస్తుంది. ఘోరమైన నరకలోకాలను గురించి వినగానే పరీక్షిన్మహారాజు ఉద్విగ్నచిత్తుడయ్యాడు. అయితే అటువంటి నరకయాతనలను పొందే పరిస్థితి కలుగకుండా ఉండాలంటే ఏం చేయాలో తెలుపుమని అతడు శ్రీశుకమహర్షిని అడిగాడు. దానికి సమాధానంగా శ్రీశుకమహర్షి అజామిళుని వృత్తాంతాన్ని తెలియజేశారు.

కన్యాకుబ్జలో అజామిళుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడు వేదాధ్యయనపరుడు, సచ్ఛీలుడు, సదాచారి, సద్గుణసంపన్నుడు అయియుండేవాడు. మితభాషి, అసూయారహితుడైన అతడు ఫలపుష్పాలను, సమిత్కుశలనెడి రెండురకాల గడ్డిని తీసికొని రావడానికే తండ్రి ఆజ్ఞ మేరకు అడవికి వెళ్ళాడు. అయితే ఇంటికి తిరిగివస్తున్న సమయంలో అతడు నిర్లజ్జగా వేశ్యను ఆలింగనం చేసికొనియున్నట్టి ఒక శూద్రుణ్ణి చూశాడు. ఈ సన్నివేశాన్ని చూడగానే సద్బ్రాహ్మణుడైన అజామిళుని మనస్సులో పతనం ఆరంభమైంది. అతనిలో కామవాంఛ కట్టలు తెంచుకొని పెల్లుబికింది. అప్పటినుండి అతని మనస్సులో ఆ వేశ్యయే కదలాడసాగింది. కొంతకాలానికి అతడు ఆ వేశ్యను ఇంటికి తెచ్చుకున్నాడు. అజామిళుడు అశ్లీలదృశ్యాన్ని ఒక్కసారి చూడగా సమస్త సద్గుణస్థితినుండి దిగజారాడు.

అజామిళుని ఇంటికి చేరిన వేశ్య అతనిపట్ల విశేషానురాగం చూపించడం మొదలుపెట్టింది. తనపట్ల ఆమె చూపే ప్రేమకు, ప్రసన్నతకు ముగ్ధుడైన అజామిళుడు పితృదత్తమైన ఆస్తిని వ్యయం చేస్తూ ఆమెకు అనేకమైన కానుకలను తీసికొని వచ్చేవాడు. ఆమె సాంగత్యంలో అతడు కట్టుకున్న భార్యనే విడిచిపెట్టాడు. వేశ్యకు ఇష్టంలేక పోవడంవలన తన బ్రాహ్మణ కలాపాలను అతడు త్యజించాడు. బుద్ధి నశించగా అతడు న్యాయాన్యాయ విచక్షణ లేకుండ ధనాన్ని గడించి వేశ్యను పోషించసాగాడు. అంతేకాదు కొంతకాలానికి ఆమెద్వారా అనేకమంది సంతానాన్ని కూడ పొందాడు. ఆ విధంగా ఆ బ్రాహ్మణుడు శాస్త్రవిధిని ఉల్లంఘించి, అమితవ్యయాన్ని చేస్తూ వేశ్య చేతివంటను తింటూ తన ఆయువును గడిపివేయసాగాడు. బ్రాహ్మణ విధిని విడిచిపెట్టి అతడు ఇతర కర్మలను స్వీకరించాడు.

ఈ విధంగా అతనికి ఎనభైఏళ్ళు గడిచిపోయాయి. వేశ్య వలన అతనికి పదిమంది పుత్రులు పుట్టారు. వారిలో చిన్న పిల్లవానికి నారాయణుడనే పేరు పెట్టడం జరిగింది. వృద్ధాప్యంలో పుట్టిన ఆ పిల్లవానిపట్ల అజామిళునికి అమితానురాగం ఉండేది. ఆ పిల్లవాని ఆలనపాలన చూస్తూ, అతని బాల్యచేష్టలకు అజామిళుడు ఆనందించేవాడు. తాను భోజనం చేసేటప్పుడు పిల్లవానిని భోజనానికి పిలిచేవాడు. తాను పానీయాలు త్రాగేటప్పుడు తన చెంతకు అతనిని చేరబిలిచేవాడు. ఈ విధంగా ప్రతిమారు, ప్రతిక్షణం ఆ పిల్లవానినే పేరు పెట్టి(నారాయణా) పిలుస్తూ పుత్రరతుడయ్యాడు. "నారాయణా ఇది తిను, నారాయణా పాలు త్రాగు, నారాయణా ఇటు రావయ్యా" అంటూ తనకు తెలియకుండానే అతడు నారాయణనామంలో మునిగాడు.

కాలం ఎవ్వరికొరకు ఆగదు. అజామిళునికి అంత్యకాలం అరుదెంచింది. ముగ్గురు యమభటులు పాశహస్తులై అజామిళుని తీసికొనిపోవడానికి వచ్చారు. అజామిళుడు మనసా, వాచా, కర్మణా పాపాలు చేసినందున మువ్వురు యమదూతలు అతనిని సమీపించారు. వారిని చూసిన అజామిళుని మనస్సులో తన చిన్న తనయుడు నారాయణుడే కదలాడాడు. ఈ భయంకరాకారులను చూసి వాడు దడుసుకుంటాడేమోనని అతడు దూరంగా ఆడుకుంటున్న బాలుని "నారాయణ, నారాయణ" అని బిగ్గరగా పిలిచాడు. నాలుగుఅక్షరాల నారాయణనామం అజామిళుని నోటి నుండి వెడలగానే నల్వురు విష్ణుదూతలు అక్కడ ప్రత్యక్షమయ్యారు. వేశ్యాపతియైన అజామిళుని హృదయకుహరం నుండి ఆత్మను లాగివేసేందుకు యమదూతలు యత్నించబోగా "ఆగండి, ఆగండి" అనే మేఘగంభీరస్వరం వారికి వినిపించింది. వారు తమ కార్యాన్ని ఆపి ఆ మాట పలికిన విష్ణుదూతలను గమనించి ఆశ్చర్యచకితులయ్యారు. "యమరాజు శాసనాన్నే ధిక్కరించే మీరెవ్వరు? మీరెవరి సేవకులు? ఎక్కడనుండి వచ్చారు? ఈ అజామిళుని దేహాన్ని తాకకుండా

మమ్మెందుకు నిరోధిస్తున్నారు? మీరు దేవతలా, ఉపదేవతలా లేదా సిద్ధపురుషులా?" అని వారు విష్ణుదూతలను ప్రశ్నించారు.

యమభటుల అమాయక పలుకులకు విష్ణుదూతలకు నవ్వు వచ్చింది. నవ్వుతూనే వారు మేఘగంభీర స్వరంతో "నిజంగా మీరు యమధర్మరాజు భటులే అయితే ధర్మతత్త్వాన్ని, అధర్మ లక్షణాలను మాకు కాస్త వివరించండి. దండన విధానమెటువంటిది? నిజంగా ఎవరు దండనార్హులు? కర్మిష్ఠులందరూ దండనార్హులేనా లేదా వారిలో కొందరే దండనార్హులా?" అని ప్రశ్నలను గుప్పించారు.

విష్ణుభటుల ప్రశ్నలకు విస్మితులైన యమభటులు కొద్దిగా తేరుకొని ఇలా అన్నారు: "వేదనిర్దేశితమైనదే ధర్మం. దానికి విపరీతమైనది అధర్మం. వేదములు సాక్షాత్తుగా దేవదేవుడగు నారాయణుడే. అవి స్వయంగా ఉద్భవించాయి. ఈ విషయాలను మేము మా ప్రభువు యమధర్మరాజు ద్వారా విన్నాం. నారాయణుడే సమస్తజగత్తుకు కారణుడు. సూర్యుడు, చంద్రుడు, ఆకాశం, వాయువు, దేవతలు, సంధ్యాకాలం, పగలు, రాత్రి, దిక్కులు, జలం, పృథ్వి, స్వయంగా పరమాత్ముడు అనునవి జీవుల కర్మలకు సాక్షులు. ఈ సాక్షులచే ధర్మవిరుద్ధపాలనం నిర్ధారించబడినపుడు జీవుడు దండనార్హుడౌతాడు. సర్వశక్తిమంతుడైన యమరాజు బ్రహ్మతో సమానుడు. అతడు పురంలో నిలిచి ఉండి జీవుని కర్మలను తెలిసికొంటాడు." ఈ విధంగా తమకు తెలిసిన ధర్మాన్ని తెలియజేసిన యమభటులు అజామిళుడు తాను చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం చేసికోలేదని, అందువలన అతనిని దండనార్థం యమపురికి తీసికొనిపోతున్నామని వారు అన్నారు. ఆ దండనద్వారా అతడు పాపరహితుడౌతాడని వారు చెప్పారు.

యమదూతల మాటలను వినిన విష్ణుదూతలు ఇలా అన్నారు: యమదూతలారా! ఈ అజామిళుడు తన పాపాలకు ఇదివరకే ప్రాయశ్చిత్తం చేసికొన్నాడు. నిస్సహాయ స్థితిలో నారాయణనామాన్ని ఉచ్చరిస్తే ఒక జన్మపాపాలనే కాదు, కోటిజన్మలపాపాలకు కూడ ప్రాయశ్చిత్తం కలుగుతుంది. ఆభాసంగానైనా ఇతడు అపరాధరహితంగా నామోచ్చారణ చేసి పాపవిముక్తుడయ్యాడు. వత్సా! నారాయణా! ఇటు రావయ్యా అని ఈ అజామిళుడు పదేపదే నారాయణ నామాన్ని పలికేవాడు. నాలుగుఅక్షరాల నారాయణ నామంతో అతని సర్వపాపాలు నశించిపోయాయి. విష్ణు నామోచ్చారణమే పరమశ్రేష్ఠమైన ప్రాయశ్చిత్తం.




భగవన్నామాన్ని పరోక్షంగాగాని, పరిహాసానికిగాని, సంగీత ప్రయోజనానికిగాని, చివరకు శ్రద్ధారహితంగాకాని చేసినప్పటికిని అది అనంతమైన పాపరాశిని తొలగిస్తుంది. కాలు జారినపుడు, ఇంటికప్పు పైనుండి క్రిందపడినపుడు, పాముకాటుకు గురియైనపుడు, జ్వరపీడితుడైనపుడు, ఆయుధముచే గాయపడినపుడు మనిషి హరినామాన్ని ఉచ్చరించి నరకయాతననుండి బయటపడగలుగుతాడు. ఎండుగడ్డి రాశిని అగ్ని భస్మీపటలం చేసేవిధంగా, తెలిసి చేసినా తెలియక చేసినా హరినామకీర్తనం మనిషియొక్క సమస్త పాపాలను భస్మం చేయగలదు. ఔషధప్రభావం తెలిసి త్రాగినా, తెలియక త్రాగినా అది రోగాన్ని తగ్గిస్తుంది కదా!

ఆ విధంగా విష్ణుదూతలు తర్కంతో భాగవత ధర్మాన్ని నిరూపణ చేసి అజామిళుని యమదూతల బారి నుండి కాపాడారు. యమభటులు వెళ్ళిపోగానే అతని హృదయంలోని భయం పూర్తిగా నశించింది. చేతనం తిరిగి వచ్చినవాడై అతడు శిరసు వంచి విష్ణుదూతల పాద పద్మాలకు నమస్కరించాడు. యమదూతలబారినుండి కరుణతో తనను రక్షించిన విష్ణుదూతల సన్నిధిలో అతనికి పరమానందం కలిగింది.

**1) నవగ్రహాల్లో సూర్యుని పూజిస్తే ఆరోగ్యం, సంపద, సంతానం కలుగుతాయి అంటారు. నిజమేనా?**

**- కోట రమేష్, కాకినాడ, తూ.గో.జిల్లా.**

గ్రహాలన్నిటికీ అధిపతి సూర్యుడు. ఒక్కో గ్రహానికి ఒక్కో విశేషశక్తి, అధికారం ఉంటాయి. ఈ గ్రహాల స్థితిగతుల్లోనూ, వాటి ప్రభావాల్లోనూ హెచ్చుతగ్గులూ, అవకతవకలూ జరగకుండా; వాటివల్ల భూమిమీద జీవకోటికి హాని కలుగకుండా ఉండేటట్లుగా గ్రహాలను నియంత్రించి జీవులకు ఆయురారోగ్యాలను ప్రసాదించే ఆరోగ్యమూ, సంపద, సంతానం కలుగుతాయన్నది సత్యం. ఇది ఆధ్యాత్మిక పరమైన సమాధానం.

ఇక వైజ్ఞానికంగా చూసినట్లైతే సూర్యుడు స్వతహాగానే ఆరోగ్యదేవత. ఇది వైద్యులూ, వైజ్ఞానికనిపుణులూ ఆమోదించినదే. సూర్యుడు తన సప్తకిరణాలద్వారా వేడిని, కాంతిని ప్రసరింపజేస్తూ ఉంటాడు. సూర్యకాంతినే 'సూర్యరశ్మి' అని కూడా అంటారు. ఈ సూర్యరశ్మిని ఉపయోగించుకొనే వృక్షజాతులన్నీ ఆహారోత్పత్తి చేసుకుంటాయి. ఇలా వృక్షాలూ, మొక్కలూ తయారుచేసి దాచే ఆహారనిల్వలే అన్నిజీవులకూ ఆహారం. అంతేగాక మనుష్యాది జంతుజాలములన్నిటికి అవసరమైన ఉష్ణోగ్రతను, డి విటమిన్‌ను అందజేస్తాడు సూర్యుడు. సూర్యరశ్మివలన జీవులలో ఆహారం జీర్ణమవడం మొదలగు జీవరసాయనక్రియలు సక్రమంగా జరుగుతాయి. అందుకే మన పెద్దలు ఉదయం, సాయంత్రం, సూర్యనమస్కారాలు, సంధ్యావందనం పేరుతో సూర్యునికి అర్ఘ్యం ఇవ్వడంవంటి నియమాలు పెట్టారు; వారు వీటిని క్రమం తప్పకుండా పాటించారు.

మన పూర్వికులు రోజులో ఎక్కవభాగం బయట పనులు చేస్తూ సూర్యరశ్మిలోనే ఉండేవారు. ఎక్కడికి వెళ్లాలన్నా ప్రయాణించినా నడిచో లేదా ఎద్దులబండిలో అలా వెళ్ళేవారు. కాబట్టి అప్పుడూ సూర్యరశ్మిలోనే ఉండేవారు. అందుకే పూర్వీకుల ఆయుఃప్రమాణం ఎక్కువ కాలం ఉండేది. ఉన్నంతకాలం వారు ఆరోగ్యంగా ఉండే వారు. ఇప్పుడు ఏ.సి.ఇండ్లలో నివాసం, ఏ.సి.వాహనాల్లో ప్రయాణం. ఎండముఖమే చూడరు. అందుకే ఈ కాలం జనులకు ఆయుఃప్రమాణమూ తక్కువగా ఉంటుంది; అంతు చిక్కని అనారోగ్యాలు కలుగుతున్నాయి.




ఇక సంతానం విషయంలో కూడా సూర్యుని అనుగ్రహమే కీలకం. సృష్టిలో ఏ జీవి సంతానం పొందాలన్నా ఉష్ణం అవసరం. సూర్యరశ్మివల్లనే క్రిమి, కీటకాదుల గ్రుడ్లు పిల్లలవుతాయన్నది అందరికీ తెలుసు. సంతానోత్పత్తికి సూర్యరశ్మి (ఉష్ణోగ్రత) చాలా అవసరం. అందుచేతనే శీతలప్రాంతాల్లో ఉండేవాళ్లకంటే ఉష్ణప్రాంతాల్లో ఉండేవాళ్లల్లో సంతానోత్పత్తి శక్తి ఎక్కువగానూ, ఎక్కువ కాలమూ ఉంటుందంటారు నిపుణులు. అలా జీవుల్లో సంతానోత్పత్తిని కలిగించే దేవుడు సూర్యుడే!

ఇక సంపద విషయానికి వస్తే సూర్యునివల్ల మనుషుల ఆరోగ్యాలు క్రమబద్ధమవడంతో పాటు మెదడు ఉత్తేజితమై వివేచనను కలిగిస్తుంది. మెదడు పదునెక్కి తగిన సమయంలో తగిన ఉత్తమ ఆలోచనలను కలిగిస్తుంది. దాంతో చేసే పనులలో సక్రమరీతిలో కృషి చేస్తారు. చేసే పనిలో లోపాలు జరగకుండా జాగ్రత్తపడతారు. సత్ఫలితాలు పొందుతారు. చేసే పనులన్నీ విజయవంతంగా నెరవేరితే తదనుగుణంగా సంపదా కూడుతుంది.

కాబట్టి ఆరోగ్యం, సంపద, సంతానం పొందాలంటే సూర్యుని అనుగ్రహం తప్పకుండా ఉండాలి. అది పొందాలంటే ఎక్కువసమయం సూర్యునిసమక్షంలో ఉండాలి. అందుకే సూర్యనమస్కారాలు, సంధ్యావందనాలు వంటివి చేస్తూ సూర్యారాధన చెయ్యాలంటారు పెద్దలు.



# జన్మకో శివరాత్రి

- శ్రీమతి ఎమ్.విజయలక్ష్మి,
97018 24275

మన మహాపర్వాల్లో మహాశివరాత్రి పర్వదినం ఒకటి. ఈ పండుగ శంకరునిపూజకు ఉద్దేశింపబడినది. ఈ రోజున శివభక్తులు పగలంతా ఉపవాసముంటారు. రాత్రంతా జాగరణ చేస్తారు. ఈ రోజు ప్రత్యేకించి లింగ పూజకు ప్రాధాన్యమైనది. “అభిషేక ప్రియశ్శివః” అని శివునకభిషేకం, బిల్వార్చన చాలా ప్రీతికరమైనవి. అందువలన ఈ రోజున శివునికి మహాన్యాసపూర్వకైకాదశ రుద్రాభిషేకం, కోటిబిల్వార్చన, లక్షబిల్వార్చన, సహస్రబిల్వార్చన, రుద్రాభిషేకంలను ఆచరించటం ఎంతో ఫలదాయకం.

ఈ దేవపూజ పగటిపూట గాక రాత్రిపూట సాగడం ఈ పండుగయొక్క ప్రత్యేకత. అందుకే ఇది శివ రాత్రి అయింది. ఈ రాత్రికి శివరాత్రి అనే పేరు రావడానికి గల కారణం ఈశానసంహితలో ఈ విధంగా చెప్పబడింది.

శివుడు నేటి అర్ధరాత్రి కాలాన కోటిసూర్యసమ ప్రభతో లింగాకారంలో ఆవిర్భవించడం చేత శివరాత్రి అనే పేరు వచ్చింది. పరమశివుడు లింగాకారంలో పుట్టినరోజు కావడంచేత ఇది శివుడికి ప్రీతికరమైందనీ, ఈ రోజు లింగరూపి అగు శివుడికి పూజ జరపాలనీ తెలియజేస్తోందీ శైవాగమం. సాధారణంగా పండుగలు మృష్టాన్న భోజనాలతో జరుగుతాయి. కాని శివరాత్రి మాత్రం ఉపవాసాల పండుగ. ఇదియే ఈ పండుగయొక్క ప్రత్యేకత. ఈ పండుగ నాడు పగలు ఉపవాసం. రాత్రి జాగారం, శివలింగార్చనం విధింపబడ్డాయి. ఈ విధమైన వ్రతాచరణ లింగపురాణంలో ఈ విధంగా వివరింపబడింది.

నాలుగుజాముల్లోనూ శివపూజ నాలుగురకాలుగా జరుపుతారు. ఆ విధానమేమన:

మొదటిజామునందు శివలింగాన్ని పాలతో అభిషేకించి, పద్మాలతో పూజ చేస్తారు. పెసరపప్పు, బియ్యం కలిపి పులగం వండి నైవేద్యం పెడతారు. ఋగ్వేదమంత్రాలు పఠిస్తారు.

రెండవజామునందు శివలింగాన్ని పెరుగుతో అభిషేకించి, తులసీదళాలతో అర్చిస్తారు. పాయసం నైవేద్యం పెడతారు. యజుర్వేదమంత్రాలు పఠిస్తారు.

మూడవజామునందు శివలింగాన్ని నేతితో అభిషేకించి, మారేడుదళాలతో పూజిస్తారు. నువ్వులపొడి కలిపిన తినుబండారం నైవేద్యం పెడతారు. సామవేదమంత్రాలు పఠిస్తారు.


**21-02-2020న మహాశివరాత్రి సందర్భంగా...**

నాల్గవజామునందు శివలింగాన్ని తేనెతో అభిషేకించి, నీలోత్పలాలతో పూజిస్తారు. కేవలం అన్నం నైవేద్యం పెడతారు. అథర్వణవేదమంత్రాలు పఠిస్తారు.

ఈ విధంగా అభిషేకం జరుపబడుతుండగా శివదర్శనం చేసుకోవడం మహాపుణ్యప్రదం. నాలుగో జాము పూజ ముగిశాక ఉదయాన్నే శివుని విగ్రహానికి ఊరేగింపు జరుపుతారు.

ఇలాగ సంవత్సరంలో ఐదురకాల శివ రాత్రులున్నాయి. అవి :

ప్రతినిత్యము శివార్చన చేయటాన్ని "**నిత్య శివరాత్రి**"అని; 15 రోజులకోసారి శివార్చన చేయటాన్ని "**పక్షశివరాత్రి**" అని; నెలకోసారి శివార్చన చేయటాన్ని "**మాసశివరాత్రి**" అని; ఏడాదికోసారి శివరాత్రిపర్వదినంనాడు శివార్చన చేయటాన్ని "**మహాశివరాత్రి**" అనీ; యోగి ఐనవాడు తన యోగ మాహాత్మ్యముచేత యోగనిద్రను నేర్చుకునే దానిని "**యోగశివరాత్రి**" అనీ అంటారు.



## శివరాత్రి వ్రతఫలం

వింధ్యాద్రిమీద ఒక వేటకాడుండేవాడు. అతడు మిక్కిలి క్రూరుడు. ఓనాడు పగలంతా వేటాడుతూ ఉండి రాత్రికాగానే ఒక చెరువుచెంతకు చేరి అక్కడే ఉన్న ఒక బిల్వవృక్షాన్ని ఎక్కి, తన తలమీద, తన చుట్టూ ఉన్న ఆ మారేడుచెట్టు కొమ్మలోని ఆకులన్నింటినీ అతడు తుంచి కింద పడేస్తున్నాడు. ఆ ఆకులన్నీ చెట్టు మొదట్లోనున్న బ్రహ్మచేత ప్రతిష్ఠింపబడి ఉన్న శివలింగంమీద పడ్డాయి. ఆ రోజంతా వేటాడ్డంలోనే నిమగ్నమైపోయాడు కాబట్టి ఆహారమేమీ తీసుకోలేదు. అదే అతనిపాలిటి ఉపవాసమైంది. పైగా చెట్టు కొమ్మలమీద పడుకుని సేదతీరుతూ శివా! హరా! శంకరా! అని స్మరించుకుంటూండిపోయాడు. దానివల్ల అతని పాపాలన్నీ తొలగిపోయాయి. దైవికంగా ఆనాడు శివరాత్రి పర్వదినం కావటం చేత, పగటిపూట ఆహారమేమీ తీసుకోక, రాత్రి నిద్రపోక మేలుకునే శివనామార్చన గావిస్తూ, అనాలోచితంగా అతడు జారవిడిచిన మారేడుదళాలు "శివలింగం" మీదపడి శివపూజ చేసినట్లైంది. కావున అతనికి పుణ్యఫలం ప్రాప్తించి, శివసాయుజ్యం లభించింది. ఈ విధంగా మహాశివరాత్రి నాడైనా సత్కర్మలనాచరించిన శివసాయుజ్యాన్ని పొందుతారని ప్రతీతి.

అలాగే ఒకసారి బ్రహ్మ, విష్ణువు తమలో తాము అధికులెవరనే విషయమై పెద్దగా కలహించుకుంటున్న సమయంలో ఈశ్వరుడు అర్ధరాత్రివేళ అగ్ని లింగాకారంలో వారి ఎదుట నిలిచి, వారి అహంకారాన్ని పోగొట్టి, వారి చేతనే పూజలందుకోవడం జరిగింది. మహాశివరాత్రి ఇంతటి విశిష్టమైనది కాబట్టే "జన్మకోశివరాత్రి" అనే నానుడి పుట్టింది. కాబట్టి ఈ రోజున భక్తులందరూ శివాలయాల్లో ఉన్న శివలింగాలను భక్తితో అర్చించి తరించడం జరుగుతుంది. శివరాత్రినాడే శివస్మరణ చేసిన చాలునని ఇందలి అర్థంకాదు. సర్వకాలసర్వావస్థల్లోనూ పరమశివుని స్మరించుకొంటూండాలి. ఆ విధంగా చేస్తేనే సంసారబంధాల నుండి అందరికీ విముక్తి లభిస్తుంది.

# శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయం, శ్రీనివాసమంగాపురం

*(తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణ 'నిత్యకల్యాణపురం శ్రీనివాసమంగాపురం" 2013 (జూలకంటి బాలసుబ్రహ్మణ్యం) గ్రంథం ఆధారంగా ఈ వ్యాసం ప్రచురింపబడింది.)*

తిరుపతికి పశ్చిమంగా 10కి.మీ.దూరంలో మదనపల్లి ప్రధానరహదారిని ఆనుకొని ఉన్న ఈ కుగ్రామం ఒకప్పుడు ఒక వెలుగు వెలిగింది. సిద్ధకుటి అనే శ్రీనివాసపుర గ్రామం, శ్రీనివాసమంగాపురం అని ప్రత్యేకపేర్లతో పిలువబడింది. ఇది కొట్టాలస్థలం అనే మజరాకు చెందినది. వైకుంఠవలనాడు (చంద్రగిరి) తాలూకా, తిరువేలకుట్టం (తిరుమల తిరుపతి) జిల్లా క్రీ.శ.19వ శతాబ్దానికి చెందిన తరిగొండవెంగమాంబ దానశాసనంలో శ్యామలఅడవులకు ఆనుకొని ఉన్న నాగపట్ల దీనికి కేంద్రస్థానమైంది. స్వర్ణముఖికి ఉపనది ఐన కల్యాణి (వికల్య) గట్టుమీద ఈ గ్రామం వెలసింది.

## స్థలపురాణం

శ్రీనివాసమంగాపురం పరిసరప్రాంతంలో సువర్ణముఖీనది ఒడ్డున ఒక చక్కటి ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకున్నాడు అగస్త్యమహర్షి, ఆ సమయంలో నూతనవధూవరులైన శ్రీపద్మావతీ శ్రీనివాసులు పెళ్లిబట్టలతోనే ఆది వరాహక్షేత్రానికి వెళ్తూ అగస్త్యుని ఆశ్రమానికి వచ్చారు. అక్కడున్న అగస్త్యముని పసుపుబట్టలతో ఉన్న ఆ నూతన వధూవరులను ఆశీర్వదించి వారు ఆ వస్త్రాలతో కొండెక్కడం నిషేధమని, ఆరుమాసాలదాకా ఇక్కడే ఉండండని ఆత్మీయంగా చెప్పాడు. అందుకు శ్రీనివాసుడు అంగీకరించాడు.

మనోజ్ఞమైన వాతావరణానికి శ్రీనివాసమంగాపురం పెట్టింది పేరు. ఇక్కడ్నుంచి శ్రీవారిమెట్టుమార్గంగుండా తిరుమల చేరడానికి దగ్గరిదోవ. శేషాచలకొండల అందచందాలను చూస్తూ ఆరుమాసాలు గడిపిన స్వామి అగస్త్యమహాముని అనుమతి తీసుకొని భార్యా సమేతంగా శ్రీవారి మెట్టుమార్గం గుండా తిరుమల చేరినాడు. అలా శ్రీవారిమెట్టు, అమ్మవారి కాలిమెట్లు రెండూ సోకిన ఈ కాలిమార్గం ఎంతో పవిత్రమైంది. తదనంతర కాలంలో చంద్రగిరిరాజ్యాన్ని ఏలిన రాజులెందరో చంద్రగిరి కోటనుంచి శ్రీవారి ఆలయంవరకు ఏర్పడిన సరళమార్గాన్ననుసరించి స్వామిదర్శనం చేసుకొని పునీతులయ్యారు.

శ్రీనివాసమంగాపురం ఆలయానికి ఉత్తరందిక్కున 6కి.మీ.దూరంలో ఉన్న మెట్టునుండి మొదలుకొని తిరుమల వరకుగల మెట్లమార్గాన్ని "శ్రీవారిమెట్టు" లేదా "శ్రీపతిమెట్టు" అంటారు. ఆధ్యాత్మిక పురోగతికి తొలిమెట్టు ఈ "శ్రీవారి మెట్టు". చంద్రగిరివైపున్న సోపానమార్గం కనుక 'చంద్రగిరి సోపానమార్గం' అని కూడా పేరు.

సాక్షాత్తు పద్మావతీ శ్రీనివాసుల దివ్యపాదపద్మాలు సోకిన దివ్యమార్గమే, నడచివెళ్లిన పవిత్రమార్గమే ఈ శ్రీవారి మెట్టుమార్గం. వరాహస్వామి సన్నిధిలో తొండమాను చక్రవర్తి నిర్మించిన ఆనందనిలయ విమానభవనంలో పద్మావతీ శ్రీనివాసులు ప్రవేశించి నిత్యకల్యాణదంపతులుగా ప్రసిద్ధి చెందారు. పద్మావతీ శ్రీనివాసులు నడచివెళ్లిన శ్రీవారిమెట్టు మార్గం ఆ తర్వాతకాలంలో ఎందరో రాజులకు, యాత్రికులకు వేంకటాచలయాత్రకు వెళ్లే ప్రధాన రాజమార్గమైంది. నారాయణవనప్రభువులు, ఆకాశరాజు, తొండమానుడు మొదలైన విజయనగర ప్రభువులవరకు "శ్రీవారిమెట్టు" మార్గాన్ని తమ యాత్రామార్గంగా చేసుకొన్నారు. విజయనగరప్రభువులు చంద్రగిరికోటలో విడిదిచేసిన సమయాల్లో తిరుమల శ్రీవారి నైవేద్య ఘంటానాదాన్ని అంచెలంచెలుగా విన్న తరువాతనే భోజనానికి ఉపక్రమించేవారట.

**14-02-2020 నుండి**
**22-02-2020 వరకు**
**శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి**
**బ్రహ్మోత్సవం సందర్భంగా...**




న్యాయస్థానపు ఉద్దేశ్యం చెడ్డమనిషిని అడ్డుకోవడమే

క్రీ.శ.1433 నాటికి ఈ గ్రామం, ఈ గుడి ఎంతో ఉచ్ఛస్థితిలో ఉండేవనీ, 22-11-1433 నాటి శాసనంలో ఉంది. అప్పట్లో సిద్ధకుట్టి, సిద్ధకూటం, శ్రీనివాసపురం, శ్రీనివాసమంగాపురంగా పిలువబడిన ఈ గ్రామం తర్వాతి కాలంలో కనుమరుగైపోయింది. మళ్లీ సుమారు వందసంవత్సరాలకు దినదినాభివృద్ధి చెందిన ఈ గ్రామాన్ని క్రీ.శ. 1540 ప్రాంతంలో విజయనగరసామ్రాజ్య చక్రవర్తి అచ్యుత దేవరాయలు ఈ శ్రీనివాసపురాన్ని "సర్వమాన్యఅగ్రహారంగా" తాళ్లపాకకవులకు ఇచ్చాడు. ఆ సమయంలో తాళ్లపాక అన్నమాచార్యులమనుమడు చినతిరువెంగళనాథుడు శ్రీనివాస మంగాపురదేవాలయాన్ని సర్వశోభాయమానంగా జీర్ణోద్ధరణ చేశాడు. శిథిలమైనవిగ్రహాలను తొలగించి నూతన విగ్రహాలను ప్రతిష్ఠించి శాస్త్రోక్తంగా అర్చనాదులు, ఉత్సవాదులు నిర్వహించేట్లుగా ఏర్పాట్లు చేశాడు. తనకు శిష్యులైన పద్మసాలెభక్తులు గురుదక్షిణగా పదివేలవరహాలను పాదకానుకగా అనగా గురుదక్షిణగా చెల్లించారు. చిన్నన్న వారిచ్చిన పదివేలకు మరో పదివేలు తనధనాన్ని కలిపి మొత్తం ఇరవైవేల వరహాలతో శ్రీనివాసమంగాపురం దేవాలయాన్ని సముద్ధరించారు. ఇందుకు "ఆళ్లగట్టు" అనే రాతిగనిని కొన్నాడు.

సర్వహక్కులతో తాళ్లపాకవారి అధీనంలో ఉన్న శ్రీ కల్యాణవేంకటేశ్వరుని ఆలయం పూర్వపు పునర్వైభవాన్ని సంతరించుకొంది. మళ్లీ ఉత్సవాలతో వైభవంగా వందఏళ్లపాటు నిరాఘాటంగా తిరుమల స్వామివారికి దీటుగా, సాటిగా శ్రీనివాసమంగాపుర కల్యాణవేంకటేశ్వరుని ఆలయం ఆధ్యాత్మిక వినీలాకాశంలో ప్రకాశించింది. మరోసారి కల్యాణినది వికృతమైన వరదలకు కల్యాణశ్రీనివాసుని గుడి మరోమారు వికలమయింది. శిథిలమయింది. దీనికి తురకల దండయాత్రకులోనైన కొన్ని విగ్రహాలు ఛిద్రమయ్యాయి. గర్భాలయంలో సుమారు 10 అడుగుల ఎత్తున్న శ్రీకల్యాణవేంకటేశ్వరుని మూలమూర్తి మాత్రం వందఏళ్లకొద్దీ "నివురుగప్పిననిప్పు"లాగా అంతస్తేజంతో చెట్లు, చేమలు, పుట్టలతో కప్పబడి నిలిచిపోయింది.

అలా అలా 1906వ సంవత్సరంప్రాంతంలో స్వామివారి చైతన్యానికి ఒక కదలిక వచ్చింది. అందుకు కారణం తెలుసుకుందాం.

శ్రీనివాసమంగాపురంలో ఓరోజున ఉన్నపళంగా ఒక వెర్రిబాగులమ్మ ప్రత్యక్షమైంది. ఆమె ఏ ఊరినుండి, ఎక్కడినుండి వచ్చిందో తెలియదు. ఎవ్వరితోనూ ఎక్కువగా మాట్లాడేదికాదు. ఒక ఉన్మాదస్థితిలో అవధూతలాగా, యోగినిలాగా ఉండేది. ఆమెకు 'తాయారు' అని పేరు కూడా పెట్టారు. పుట్టలతో, చెట్లతో ఉన్న శ్రీనివాస ఆలయమే తాయరమ్మ నివాసం. ఆమె ఇంటింటికి వెళ్లి కొంత చమురు తెచ్చుకునేది. బియ్యం, పప్పు తెచ్చుకునేది. ఇలా అన్నీ



సేకరించి, గుడికివచ్చి మూడురాళ్లపొయ్యిపెట్టి మట్టి కుండలో అన్నీ కలిపి ఉడకబెట్టేది. ఆ తరువాత మట్టి మూకట్లో నూనె పోసి, వత్తి వెలిగించి గుళ్లో దీపం వెలిగించేది. కటికచీకట్లో, గాఢాంధకారంలో తాటిమట్టల్ని వెలిగించి, దానిమంటల వెలుగుల్లోనే గుడికి వెళ్లేది. దారిలో పాములన్నీ చుట్టుముట్టేవి. కానీ ఆమె వాటికి భయపడేది కాదు. పైగా ఒరే! నాగా! శేషూ! అంటూ పిలిచేది. అలాగే గుళ్లోకి వెళ్లి పూలను స్వామిపాదాలపై పెట్టి మట్టిమూకుట్లో దీపారాధన చేసి, అన్నాన్ని నైవేద్యంగా పెట్టేది. కొంత తెచ్చి అందరికీ పంచిపెట్టేది. తానూ తినేది. నాగులకంతా పాలు తెచ్చి పెట్టేది. ఇదే ఆమె నిత్యకృత్యమైంది. అలా ఓరోజు తాను రేపటినుండి కనబడననీ, ఒక స్వాములోరు వస్తారనీ చెప్పింది. ఆమె చెప్పినట్లే స్వాములోరు వచ్చారు.

కాంచీపురంనుండి సుందరరాజస్వామి వచ్చారు. ఈయనకు స్వామి ప్రతిరోజు కలలో కనిపించి నీవు నాదగ్గరికిరా. నేను చీకట్లో ఉన్నాను. చెట్లల్లో, పుట్టల్లో ఉన్నాను. నీవు వచ్చి నాకు పూజలు, సేవలు చెయ్యి అనేవాడు. అందుకు అతను నీవు ఏ ఊర్లో ఉన్నావో నాకెలా తెలుస్తుంది. అనగా నీవు వెంటనే వెంకటాచలయాత్ర చెయ్యి నీకు దారి తెలుస్తుందన్నాడు. దగ్గర్లో రాబోతున్న ఆషాఢశుద్ధ సప్తమినాడు నాకు పూజచెయ్యాలి అన్నాడు. ఆ మాటలకు సుందరయ్య స్వామిని వెతుక్కుంటూ బయలుదేరాడు.

అలా ప్రయాణించి 15 రోజులకు శ్రీనివాసమంగాపురం చేరుకున్నాడు. అక్కడ విచారించగా అక్కడున్నవారందరూ తాయారమ్మగురించి, ఆమె పూజావిధానంగురించి చెప్పారు. తనస్వప్నంగురించి అందరికీ చెప్పాడు. అందరూ కలిసి ఆశ్రమాన్ని శుభ్రం చేశారు.

అది విక్రమనామ సంవత్సరం. ఆషాఢశుద్ధ సప్తమీ ఉత్తరఫల్గుణీనక్షత్రం కూడిన శుభావహమైనరోజు అనగా 11-07-1940 కూడిన రోజు. మళ్లీ వందలసంవత్సరాల తర్వాత సుందరరాజస్వామివారిచే పునఃప్రతిష్ఠ జరిపి తొలి పూజ జరిగింది. 11-07-1940 నాటినుండి ప్రతి సంవత్సరం అదే తిథిన "సాక్షాత్కారవైభవం" పేరుతో ఘనంగా శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణవేంకటేశ్వరునికి ఒక్క రోజు ఉత్సవం జరుగుతూండేది. తరువాత తి.తి.దేవస్థానం 1980వ సంవత్సరంనుండి ప్రతిఏటా "సాక్షాత్కార వైభవోత్సవం" అనే పేరుతో 3 రోజులపాటు వార్షికఉత్సవాలు నిర్వహిస్తున్నది. తర్వాత సుందరరాజస్వామి అర్చకత్వంలో దినదినాభివృద్ధి చెందుతూ రోజుకొక వైభవంగా, వైభోగంగా విలసిల్లింది. తి.తి.దేవస్థానం 1967వ సంవత్సరం ఏప్రిల్ 26వతేదీన స్వీకరించింది.

## ఆలయ నిర్మాణశైలి

పదేండ్ల తర్వాత అంటే 1980వ సంవత్సరం మహారాజగోపుర ప్రవేశద్వారం సుమారు 10 అడుగుల ఎత్తుతో, 5 అంతస్థులతో, అనేక శిల్పాలతో నిర్మింపబడింది. ప్రవేశద్వారాన్ని దాటి లోపల ఎదురుగా బలిపీఠం, ధ్వజస్తంభం ఉన్నాయి. చతురప్రాకారపు ఎత్తైన ప్రాకారపుగోడమధ్య ఉన్న విశాలమైనప్రాంతంలో సుమారు 10 అడుగుల ఎత్తైన రాతి అధిష్ఠానంపై శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి ప్రధాన ఆలయం నిర్మించబడింది. ఈ ఆలయం ముఖమండపం, (ఘంటామండపం), అర్ధమండపం, శయనమండపం, అంతరాళం, గర్భాలయం అని 5 భాగాలుగా ఉన్నమండపాలతో నిర్మింపబడింది. ఆలయప్రాంగణంలో నైరృతిమూలలో శ్రీవారికల్యాణమండపముంది. ఘంటామండపంలో శ్రీస్వామివారి మూలమూర్తికి ఎదురుగా పశ్చిమాభిముఖంగా గరుడాళ్వార్‌సన్నిధి ఉంది. ముఖమండపంలో వాయవ్యమూలన రెండు





## ఉత్సవాలు, సేవలు

**నిత్యోత్సవాల్లో సుప్రభాతం, తోమాలసేవ, సహస్ర నామార్చన, నిత్యకల్యాణోత్సవం, ఆర్జిత బ్రహ్మోత్సవం జరుగుతుంది. ఈ బ్రహ్మోత్సవంలో అశ్వవాహనం, హనుమంతవాహనం, గరుడసేవ మాత్రమే జరుగుతాయి. ఏకాంతసేవ జరుగుతుంది. వారోత్సవాల్లో స్వర్ణపుష్పార్చన, శతకలశాభిషేకం, తిరుప్పావడసేవ, నేత్రదర్శనం, పూలంగి సేవ, అభిషేకం, వస్త్రాలంకారసేవ, గ్రామోత్సవం జరుగుతాయి. మాసోత్సవాల్లో శ్రవణనక్షత్రంనాడు ఊంజల్‌సేవ జరుగుతుంది. వార్షికోత్సవాల్లో ఉగాదిఆస్థానం. శ్రీరామనవమి, ధనుర్మాసంపూజ, మాఘమాసంలో అనగా సౌరమానంప్రకారం కుంభమాసంలో శ్రవణనక్షత్రానికి పూర్తయ్యేట్లు 9రోజుల ముందునుండి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ప్రతిసంవత్సరం ఫాల్గుణమాసంలో శ్రవణనక్షత్రం రోజున పుష్పయాగం జరుగుతుంది. వైశాఖమాసంలో శ్రవణనక్షత్రం పూర్తి అయ్యేట్లుగా మూడురోజులపాటు వార్షిక వసంతోత్సవాలు జరుగుతాయి. ప్రతి ఏటా ఆషాఢ శుద్ధసప్తమి లేదా ఉత్తరఫల్గునినాటికి ముందురోజు తర్వాతిరోజు ఇలా 3 రోజులపాటు "సాక్షాత్కార వైభవోత్సవాలు" జరుగుతాయి. ప్రతిసంవత్సరం జూలై 16 లేదా 17వ తేదీన దక్షిణాయన పుణ్యకాలంలో ఆణివరఆస్థానం జరుగుతుంది. ప్రతిసంవత్సరం ఆశ్వయుజ బహుళద్వాదశి పూర్తయ్యేట్లు 3రోజులపాటు పవిత్రోత్సవాలు జరుగుతాయి.**

పెద్దఘంటలు వ్రేలాడదీయబడి ఉంటాయి. ఈ మండపంలోనే జయవిజయుల విగ్రహాలున్నాయి. జయవిజయుల ద్వారాన్ని దాటి లోపల అర్ధమండపముంది. దీన్నే స్నపన మండపం అంటారు. ఇందులో స్వామివారి ఆభరణాలు భద్రపరచబడి ఉంటాయి. దీన్ని దాటివెళితే శయనమండపముంటుంది. దీన్ని దాటితే అంతరాళం వస్తుంది. అంతరాళంలో దక్షిణంగోడకు ఉత్తరాభిముఖంగా ఆసీన భంగిమలో శ్రీలక్ష్మీనారాయణుల శిలావిగ్రహం ఉంది. వామాంకంలో శ్రీమహాలక్ష్మీదేవి కూర్చొని ఉన్నట్లుంటుంది. ఉత్తరంగోడకు పశ్చిమంగా తలనుపెట్టుకుని దక్షిణంముఖంగా ఐదుపడగల ఆదిశేషునిపై శయనించి ఉన్న శ్రీరంగనాథుని శిలామూర్తి ఉంది. ఈ విధంగా ఉన్న స్వామికి 1980 ఫిబ్రవరిలో బ్రహ్మోత్సవం, 1981 ఫిబ్రవరి 19న మొదటిసారిగా కల్యాణోత్సవం ఘనంగా జరుపబడ్డాయి. అంతరాళంనుండి కులశేఖరగడపనుదాటి లోనికి వెళితే ఉండేదే శ్రీవారి గర్భాలయం. ఇక్కడ తూర్పుముఖంగా మూలమూర్తి ప్రతిష్ఠింపబడి ఉంది. గర్భాలయంపైన ఏకకలశవిమానం, త్రికశగోపురంగా నిర్మింపబడి ఉంది. స్వామి చతుర్భుజుడై పై రెండుచేతుల్లో శంఖచక్రాలను ధరించి ఉన్నాడు. క్రింది రెండుచేతులు వరదకటిహస్తాలుగా విరాజిల్లుతూన్నాయి.

ప్రధానంగా శ్రీసుందరరాజస్వామి మధ్వాచార్య సంప్రదాయంలోని తంత్రసారాగమం ప్రకారంగా పూజలు నిర్వహించేవారు. వారి అనంతరం అనగా 2004 నాటినుండి ఈ ఆలయంలో పూర్తిగా వైఖానస ఆగమశాస్త్రానుసారంగా పూజలు జరుపబడుతున్నాయి. ఇంతటి ప్రసిద్ధి, ప్రాశస్త్యమున్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారిని దర్శించి పునీతులమవుదాం.

పూర్వం 'ఋషిక' అనే బ్రాహ్మణయువతి చిన్న వయస్సులోనే వైధవ్యంపొంది నర్మదానదీతీరంలో పార్థివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేస్తుండేది. 'మూఢుడు' అనే రాక్షసుడొకడు ఆమెకు తపో భంగం చేయాలని తలంచాడు. అయినా, ఆ భక్తురాలు చలించలేదు. ఆమెకు భయోత్పాత ములు కలిగించడానికి ఆ దైత్యుడు మాయా వేషాలు అనేకంగా ప్రదర్శించాడు. ఋషిక శివుణ్ణి మనసారా ప్రార్థించింది. శివభక్తుల ఆర్తిని తొలగించే నందీశ్వరుడు ఆమెవద్దకు వెళ్లి రాక్షసుణ్ణి సంహరించాడు. ఋషిక మొర ఆలకించి శివుడు సైతం అక్కడికి వచ్చాడు. గంగాభవాని కూడా అక్కడికి వచ్చి ఏదైనా వరం కోరుకొమ్మన్నది.

అందుకు ఋషిక 'ఓ గంగాభవానీ! వైశాఖమాసంలో ఒకరోజు నీవు త్రికోటి పుణ్యనదులతో కలసి నేను స్నానమాచరించిన ఈ మడుగులో కొలువుండు తల్లీ' అని ప్రార్థించింది. ఆ ప్రార్థనను మన్నించింది జగజ్జనని. రాక్షసుడి బాధను తొలగించడానికి ఋషికవద్దకు నందీశ్వరుడు మునుముందుగా వచ్చినందువల్ల ఈ తీర్థానికి 'నందికేశ్వర తీర్థం' అనే పేరొచ్చింది. ఋషిక గంగాభవానిని వరం కోరింది వైశాఖ శుద్ధసప్తమి కనుక ఆ తిథియందు ఆ తీర్థము పుణ్యతమమై అల రారుతోంది. ఇంతకీ ఈ నందీశ్వరుడు ఎవరో తెలుసుకుందాం.

సాలంకాయనమహర్షి పుత్రుడు శిలాదమహర్షికి ఎన్నినోములు నోచినా, ఎన్నెన్ని తీర్థక్షేత్రాలు సేవించినా సంతానం కలగలేదు. అందుకు ఆ మహర్షి మిక్కిలి చింతించి సంతానాభిలాషకై శివునిగూర్చి ఘోర తపస్సు చేశాడు. అందుకు శివుడు ప్రత్యక్షమై, "ఓ మహర్షీ! నీజాతకంలో సంతానయోగ్యం లేదు. అయినా, తపస్సుచే నన్ను మెప్పించావు. కావున, నీకు ఒక పుత్రుణ్ణి ప్రసాదిస్తున్నాను. అతడు శాశ్వత కీర్తివంతుడవుతాడు. కానీ, అల్పాయుష్కుడు" అని వరమిచ్చి అంతర్ధానమయ్యాడు.

శిలాదుడు తన ఆశ్రమానికి తిరిగొచ్చాడు. చాలాకాలం ఎదురుచూచినా సంతానం కలుగనందున అందు నిమిత్తం ఒక యజ్ఞాన్ని చేయాలని తలపెట్టాడు. అందుకు యజ్ఞకుండానికై భూమిని త్రవ్వడం మొదలుపెట్టాడు. ఆ గుండమునందు ఒక బాలుడు కన్పించాడు. అదే ఈశ్వరప్రసాదమని భావించి, ఆ బాలుణ్ణి తీసుకొని ముద్దాడి నామ కరణం చేయబోతూండగా అశరీరవాణి "ఓ మహర్షీ! ఆ బాలకుడు మీకేగాక, ఎల్లలోకాలకూ, పార్వతీపరమేశ్వరులకూ ఆనందం కలుగ జేస్తాడు. కాబట్టి, బాలుడికి 'నందుడు' అని నామకరణం చేయాలని



21-02-2020న
శ్రీకపిలేశ్వరస్వామివారి నందివాహనోత్సవం సందర్భంగా...

# చిరాయుష్మాన్‌భవ!

– శ్రీమతి ఎమ్. పద్మావతి,
79930 24341

పలికింది. అప్పుడు మహర్షి దంపతులు ఆ పేరునే పెట్టారు.

ఐదవఏట నందునికి అక్షరాభ్యాసం, ఎనిమిదవఏట ఉపనయనం చేసి, వేదాలను నేర్పసాగారు. బాలకుడు ఏకసంథాగ్రాహియేగాక, అకళంక శివ భక్తుడు. చతుర్వేదాలను అష్టాదశపురాణములు, ఆగమ శాస్త్రాలు అచిరకాలంలోనే నేర్చి నందుడు తల్లిదండ్రులకు ఎంతో ఆనందం కలిగించాడు. ఓసారి మిత్రావరణమహర్షి వారిఆశ్రమానికి రాగా శిలాదుడు ఆతిథ్యమిచ్చి, సత్కరించి తన కుమారుని జాతకం చూడాల్సిందిగా కోరాడు.



మిత్రావరణుడు నందుని జాతకచక్రాన్ని చూచి "ఈతడు మహాజాతకుడే గాని అల్పాయుష్కుడు" అని తెలిపాడు. ఆ మాటలు విన్న ఆ శిలాదదంపతులు దుఃఖించారు. ఆ విషయం తెలుసుకున్న నందుడు వారిని ఓదార్చి, "తల్లిదండ్రులారా! పుట్టిన ప్రతిప్రాణి గిట్టుట సహజమే కదా! అందుకు బాధపడకూడదు. అయినా నన్ను మీకు ప్రసాదించినవాడు ఈశ్వరుడు. నేను తపస్సు చేసి ఆ ఈశ్వరానుగ్రహమును సంపాదించి మిమ్మల్ని ఆనందింపజేస్తాను" అని చెప్పి తపస్సుకు వెళ్లిపోయాడు నందుడు.

కేదారక్షేత్రంనందు నందుడు నియమనిష్ఠలతో ఘోర తపస్సు చేశాడు. ఆ తపస్సుకు మెచ్చి ఈశ్వరుడు దర్శనమిచ్చి "బిడ్డా! ఏదైనా వరం కోరుకో" అన్నాడు. నందుడు భక్తితన్మయత్వంతో ఈశ్వరుణ్ణి చూస్తూ, "ప్రభూ! మీ దర్శనభాగ్యం లభించిన తర్వాత నాకు ప్రాపంచికవిషయాలందు ఆసక్తి నశించింది. నాకు మీ సందర్శన, సేవాభాగ్యాలు అహర్నిశలూ ప్రసాదించు" అని ప్రార్థించాడు.

ఆ మాటలకు ఈశ్వరుడు సంతసించి, "వత్సా! కారణజన్ముడవైన నీవు కోరాల్సిన వరాన్నే కోరావు. నీవు మా చెంతనే మాకు వాహనంగానూ, రుద్రగణాలకు ప్రతినిధిగానూ 'నందీశ్వరుడు' అనే పేరుతో నివసించి, చిరాయుష్మంతుడవై మాతో గూడి వర్ధిల్లుతావు" అని వరప్రదానం చేసి ఆశీర్వదించాడు. అంతట నందుడు శివుడికి వాహనమై, అతనికి సచివుడై, సన్నిహితుడై, **'నందీశ్వరుడు'** అను పేరున విరాజిల్లుతున్నాడు.

### వైకుంఠపాళి
### :: 50- సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 జ | | 2 చం | ద్ర | 3 కే | తు | 4 డు | | |
| యం | | ప | | క | | ల్బు | | 5 కం |
| 6 తు | ష్పు | | 7 మ | యు | డు | | 8 షా | కు |
| డు | | 9 వా | | డు | | 10 కౌ | | డు |
| | 11 చూ | త | ము | | 12 వా | శి | త | |
| 13 కై | | ము | | 14 సు | | క | | నం |
| 16 క | క్ష | | 17 హ | వ | ము | | 18 రౌ | ద |
| సి | | 19 ఆ | | ర్చ | | 20 టో | | క |
| | | 21 కు | వ | ల | యా | పీ | డ | ము |

శ్రీవేంకటేశ్వరలీలలు



# శరణన్నవారిని కరుణించే శ్రీవారు

- శ్రీమతి ఎం.జయశ్రీ, 94919 10756

నేను విశాఖపట్నంలో ఒక పాఠశాలలో ఉపాధ్యాయినిగా 25 సంవత్సరాలు ఉద్యోగం చేసి పదవీవిరమణ చేశాను.

రోజూ పాఠశాలకి బయలుదేరేముందు శ్రీవేంకటేశ్వరుని పటానికి నమస్కరించి బయలుదేరటం నాకు అలవాటు. పాఠశాలకి చేరాక తరగతిగదిలో బీరువాలో శ్రీగోవిందునిపటానికి నమస్కరించి, పాఠాలు మొదలుపెట్టేదాన్ని.

ఒకరోజు పాఠం మొదలుపెడుతున్నప్పుడు ఉపప్రధానోపాధ్యాయులనుండి కబురు వచ్చింది. ముందురోజు నేను ఒక విద్యార్థిని కొట్టి, రోజంతా తరగతిగది బయట మోకాళ్ళమీద నిలబెట్టినట్లు నామీద ఫిర్యాదు వచ్చినట్లు, వెంటనే వచ్చి ఉపప్రధానోపాధ్యాయులవారిని కలవమని చెప్పారు.

నేను ఈ విషయం విని నిర్ఘాంతపోయాను. నేను కొట్టలేదు, శిక్షించలేదు. నా పై ఎందుకింత నింద వచ్చిందని బాధపడి, బీరువాలో ఉన్న స్వామిపటానికి నమస్కరించి, పిల్లల్ని కొద్దిసేపు నిశ్శబ్దంగా ఉండమని చెప్పి, బయలుదేరటకు సిద్ధపడ్డాను.

అప్పుడు మా పాఠశాల యూనిఫారమ్‌లో ఉన్న మూడుసంవత్సరాల చిన్నబాలుడు నా వద్దకు వచ్చి, ఈ ప్రసాదం మా అమ్మగారు మీకు ఇమ్మన్నారని చెప్పి నాకు ఇచ్చాడు. అప్పుడు నేను ఆ బాబు తరగతి, పేరూ అడిగాను. జవాబు లేదు. ఎల్.కె.జి. బాబు అయి ఉంటాడని అనుకున్నాను. మరుక్షణం ఆ బాబు ఎటు వెళ్ళాడో కనబడలేదు. పెద్ద పరిమాణంలో, పచ్చకర్పూరం, ఏలకల ఘుమఘుమలతో ఉన్న తిరుపతి లడ్డూప్రసాదం చూసి నాకు ఆనందం, ఆశ్చర్యం కలిగాయి. ప్రసాదాన్ని బీరువాలో ఉంచి, నేను ఉపప్రధానోపాధ్యాయులవద్దకు వెళ్ళాను.

అప్పటికే విద్యార్థి తల్లిగారు, విద్యార్థీ అక్కడ ఉన్నారు. ఉపప్రధానోపాధ్యాయులవారు నన్ను చాలా గట్టిగా మందలించి, ఈ సమస్య నీ ఉద్యోగానికే ముప్పు అని చెప్పి, ప్రధానోపాధ్యాయులవారు ఊరినుండి వచ్చాక వారిని కలవమని చెప్పారు.

అదే రోజు మధ్యాహ్నం ప్రధానోపాధ్యాయులవారు పాఠశాలకు రాగానే, వారిని కలిసి, నామీద వచ్చిన నింద గురించి చెప్పాను. ఆమె చాలా ప్రశాంతంగా విని, ఇది కేవలం అపనింద మాత్రమే. నువ్వు ఆ విద్యార్థిని శిక్షించలేదని నాకు తెలుసమ్మా అని, నన్ను బాధపడవద్దని చెప్పి, నాకు మనఃశాంతిని కలిగించారు.

సాయంకాలం పిల్లల్ని బస్సులు ఎక్కించాక, ఉపాధ్యాయులమంతా ఒక చోట కలుస్తాం. అప్పుడు నేను ఆ టీచర్లని ఆ బాబు గురించి అడిగాను. ఆరోజు ఎవ్వరూ తిరుపతిప్రసాదం తేలేదని, నావద్దకు ఏ చిన్నబాబునీ ప్రసాదంతో పంపలేదని వారు చెప్పడంతో ఇదంతా శ్రీబాలాజీ కరుణ, లీల అనుకుని స్థిమితపడ్డాను.

నాకు ప్రసాదం ఇచ్చి, నన్ను రక్షించారని శ్రీవారి పటానికి నమస్కరించాను. కొద్దిరోజులకే మావారు, నేనూ తిరుమల వెళ్ళి, నా శిరస్సు వంచి, వందనాలు చేసి నా తలనీలాలు శ్రీ శ్రీనివాసునికి అర్పించి, దర్శనం చేసుకుని వచ్చాం.

*ఓం శ్రీ వేంకటేశాయ నమః*



చెడుని అడ్డుకోవడం చేయకపోతే నువ్వేమి చెయ్యలేవు


**ఓం త్ర్యంబకం యజామహే సుగంధిం పుష్టివర్ధనమ్।**
**ఉర్వారుక మివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మామృతాత్॥**
**(మహామృత్యుంజయ మంత్రం)**

ఓం=పరమాత్ముని ప్రధాననామం; త్ర్యంబకం= మూడుకన్నులవాడు, ముల్లోకాలనేలేవాడు (శివుడు); యజామహే=నిష్ఠచేత పూజిస్తాం; సుగంధిం పుష్టివర్ధనమ్= ఆయన మనకు శారీరిక, మానసిక, ఆధ్యాత్మిక సుఖ శాంతులు ఇవ్వాలి; ఉర్వారుక మివ= కర్బూజా (దోస) పండు పండి తనకు తాను ఎలాగైతే తీగనుండి వేరవుతుందో అలాగే; బంధనాత్ మృత్యోర్= మృత్యువనే బంధనంనుండి; ముక్షీయ= విడిపించాలి, ముక్తి కల్గించాలి; మామ్= మాకు; అమృతాత్=అమృతాన్నివ్వాలి.

"ఓ త్రినేత్రుడా! శంకరభగవాన్! మేము మీ ఉపాసన చేస్తున్నాం. మీ ప్రార్థన మాకు సుఖశాంతులని స్తుంది. శారీరక, మానసిక పుష్టినిస్తుంది. ఆధ్యాత్మిక ఉన్నతి కల్గిస్తుంది. అన్నిరకాల రోగాలనుండి, దుఃఖాలనుండి; వృద్ధాప్యపుకష్టాలనుండీ మాకు విముక్తి లభిస్తుంది. దోస తీగనుండి పండు ఎలాగైతే వేరవుతుందో అలా మమ్మల్ని మృత్యువునుండి వేరుచేసి మోక్షాన్నివ్వు".

సాధకుడికి ఈ మంత్రం సకలార్థాలను సాధించి పెడుతుంది. సర్వారిష్టాలనూ తొలగిస్తుంది. మృత్యువునుండి కూడా తప్పిస్తుంది. ఎప్పుడు? సాధకుడు సంపూర్ణ సత్ప్ర వర్తనను అలవరచుకొని ఆర్తితో, చిత్తశుద్ధితో జపం చేసినపుడు, ఆ చిత్తశుద్ధికి సంపూర్ణ విశ్వాసం, భక్తి, శ్రద్ధ తోడుకావాలి. నియమనిష్ఠలు తు.చ.తప్పక అనుసరించాలి.

గాయత్రిమంత్రంలాగే విశేషఫలాల నివ్వగలిగే ఈ మంత్రజపంవల్ల సాధకుడిలో నూతన తేజస్సు ఉద్భవిస్తుంది. శివారాధనకు ప్రధానంగా ఉపకరించే ఈ మంత్రం వల్ల పరమదయాళువైన పరమశివుడు తన భక్తులపట్ల అతి శీఘ్రంగా ప్రసన్నుడై ఇష్టకామ్యార్థసిద్ధిని కల్గిస్తాడు. జీవశక్తినిచ్చి, శరీరాన్ని రక్షించి అకాలమృత్యువునుండి తప్పించే ఈ మంత్రజపానికి రుద్రాక్షమాలయే ఉపకరిస్తుంది.




భక్తికి, నిష్ఠకు, సాధనకు జాతి, విద్య, రూప, కుల, ధనభేదాలుండవు. కనుక, ఏ విధమైన అభిప్రాయాలను మనసునందుంచుకోక సత్ప్రవర్తనతో మెలగుతూ సంపూర్ణవిశ్వాసంతో, భక్తిశ్రద్ధలతో సాధనచేయడంవల్ల నిస్సంశయంగా సాధకుడు సర్వారిష్టాలబారినుండీ విముక్తుడౌతాడు.

*– శంకరం లోక శంకరమ్ –*



# పుట్టలో తపస్సు!!

- శ్రీ ఎమ్వీ రమణ,
91609 71498

శ్రీవేంకటభూధరమునందు అర్చావతారమున వేంచేసి ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధానానికి ఆరుమైళ్లదూరంలో ఉన్న రామ కృష్ణతీర్థంలో ముక్కోటి ఉత్సవం ప్రతి సంవత్సరం మకరమాసంలో పుష్యమీ నక్షత్రయుక్త పూర్ణిమా శుభపర్వదినమునందు జరుగుతుంది.

ఆ రోజున శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రాతఃకాలారాధనము, మాధ్యాహ్నికారాధనము పూర్తైన తర్వాత అర్చకులు, పాచకులు, పరి చారకులు, ఉద్యోగులు, ఏకాంగి, భక్తులు, యాత్రికులు అందరు మంగళ వాద్యాలతో దేవస్థానం నుండి శ్రీరామకృష్ణతీర్థానికి వెళ్లతారు. అక్కడున్న శ్రీకృష్ణస్వామివారికి అభిషేకం, పుష్పాలంకారం, ఆరాధనము చేసిన తర్వాత తళియనివేదనము, హారతి అయి గోష్ఠికి మామూలుప్రకారం చందన తాంబూల ప్రసాద వినియోగం జరుగుతుంది. పిమ్మట, అందరు శ్రీరామ కృష్ణతీర్థమునుండి వాద్యాలతో శ్రీవారి సన్నిధానమునకు వస్తారు.

**09-02-2020న**
**శ్రీరామకృష్ణతీర్థముక్కోటి సందర్భంగా...**

ఈ రామకృష్ణతీర్థమును గురించి స్కాందపురాణంలో ఇలా ఉన్నది. పూర్వ కాలంలో ఈ వేంకటాద్రియందు రామకృష్ణుడనే ఒక మహర్షి తపస్సు చేస్తూండేవాడు. ఆ తపస్సుకోసం స్నానార్థమై ఒక తీర్థాన్ని కల్పించు కొన్నాడు. అక్కడ ఆ మహర్షి అనేక వందల సంవత్సరాలు గాఢమైన తపస్సు గావించాడు. ఆ సమయంలో శరీరంచుట్టూ పుట్టలు పెట్టాయి. ఆ మహర్షి అది కూడా పట్టించుకోక తపస్సును కఠినంగా చేస్తున్నాడు. అది చూచి దేవేంద్రుడు మేఘాలను పంపి వర్షాన్ని కురి పిస్తాడు. ఆ విధంగా ఏడురోజులు కుంభ వృష్టి కురిపించాడు. ఉరుములు, మెరుపులు భయంకరమైన పిడుగులు, గర్జనలతో వర్షాన్ని ఆ పుట్టపై కురిపించాడు. ఐనా, ఆ మహర్షి తన తపస్సు నుండి ఏ మాత్రం చలించలేదు. అప్పుడు శ్రీస్వామివారు శంఖచక్రగదారూఢుడై, గరుడవాహనమెక్కి, ఆ మహర్షి తపస్సుకు మెచ్చి ప్రత్యక్షమై రామకృష్ణునికి కనిపించాడు. అప్పుడు స్వామి “ఓ తపోనిధీ! రామకృష్ణా! ఇక్కడ నేను ఆవిర్భవించిన ఈ మకరమాసం నందలి పుష్యమీనక్షత్ర యుక్త పూర్ణిమా పర్వదినమునందు దేవతలు, దిక్పాలకులు స్నానార్థమై వచ్చి స్నానము చేసి పవిత్రులౌ తారు. అలాగే, నీ పేరుతోనే ఈ తీర్థము ఖ్యాతిని పొందుతుంది” అని చెప్పి మాయమై పోయాడు.

ఈ రోజున ఏ మానవులు ఈ తీర్థంలో స్నానమాచరిస్తారో వారి సర్వపాపాలు తొలగిపోవడమే కాక, సర్వాభీష్టాలను పొందు తారు. ఆ విధంగా ఈ పుణ్యతీర్థంలో ఈ పుణ్యకాలమునందు స్నానమాచరించి, పూజా దికాలు చేసి, శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించినట్లైతే వారికి అనంత పుణ్యఫలాలు ప్రాప్తిస్తాయి.

## వైకుంఠ ఏకాదశి సందర్భంగా (2020 జనవరి 06)
## తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో అలంకరణ, స్వర్ణరథోత్సవం దృశ్యాలు









శ్రీవారి భక్తులకు వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేస్తున్న
తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి. సుబ్బారెడ్డి గారు



స్వామి పుష్కరిణిలో చక్రస్నానం

తిరుమల తిరుపతి దేవస్థానములు
సప్తగిరి
సచిత్రమాసపత్రిక



# సూర్యాష్టోత్తర శతనామావళి:

ఓం అరుణాయ నమ:
ఓం శరణ్యాయ నమ:
ఓం కరుణారససింధవే నమ:
ఓం అసమానబలాయ నమ:
ఓం ఆర్తరక్షకాయ నమ:
ఓం ఆదిత్యాయ నమ:
ఓం ఆదిభూతాయ నమ:
ఓం అఖిలాగమవేదినే నమ:
ఓం అచ్యుతాయ నమ:
ఓం అఖిలజ్ఞాయ నమ: 10
ఓం అనంతాయ నమ:
ఓం ఇనాయ నమ:
ఓం విశ్వరూపాయ నమ:
ఓం ఇజ్యాయ నమ:
ఓం ఇంద్రాయ నమ:
ఓం భానవే నమ:
ఓం ఇందిరామందిరాప్తాయ నమ:
ఓం వందనీయాయ నమ:
ఓం ఈశాయ నమ:
ఓం సుప్రసన్నాయ నమ: 20
ఓం సుశీలాయ నమ:
ఓం సువర్చసే నమ:
ఓం వసుప్రదాయ నమ:
ఓం వసవే నమ:
ఓం వాసుదేవాయ నమ:
ఓం ఉజ్జ్వలాయ నమ:
ఓం ఉగ్రరూపాయ నమ:
ఓం ఊర్ధ్వగాయ నమ:
ఓం వివస్వతే నమ:
ఓం ఉద్యత్కిరణజాలాయ నమ: 30
ఓం హృషీకేశాయ నమ:
ఓం ఊర్జస్వలాయ నమ:
ఓం వీరాయ నమ:
ఓం నిర్జరాయ నమ:
ఓం జయాయ నమ:
ఓం ఊరుద్వయాభావరూప-
యుక్తసారథయే నమ:

ఓం ఋషివంద్యాయ నమః
ఓం ఋక్షాస్త్రే నమః
ఓం ఋక్షచక్రచరాయ నమః
ఓం ఋజుస్వభావచిత్తాయ నమః 40
ఓం నిత్యస్తుత్యాయ నమః
ఓం ౠకారమాతృకావర్ణ -
రూపాయ నమః
ఓం ఉజ్జ్వలతేజసే నమః
ఓం ఋక్షాధినాథమిత్రాయ నమః
ఓం పుష్కరాక్షాయ నమః
ఓం లుప్తదంతాయ నమః
ఓం శాంతాయ నమః
ఓం కాంతిదాయ నమః
ఓం ఘనాయ నమః
ఓం కనత్కనకభూషాయ నమః 50
ఓం ఖద్యోతాయ నమః
ఓం లూనితాఖిలదైత్యాయ నమః
ఓం సత్యానందస్వరూపిణే నమః
ఓం అపవర్గప్రదాయ నమః
ఓం ఆర్తశరణ్యాయ నమః
ఓం ఏకాకినే నమః
ఓం భగవతే నమః
ఓం సృష్టిస్థిత్యంతకారిణే నమః
ఓం గుణాత్మనే నమః
ఓం ఘృణిభృతే నమః 60
ఓం బృహతే నమః
ఓం బ్రహ్మణే నమః
ఓం ఐశ్వర్యదాయ నమః
ఓం శర్వాయ నమః
ఓం హరిదశ్వాయ నమః
ఓం శౌరయే నమః
ఓం దశదిక్సంప్రకాశాయ నమః
ఓం భక్తవశ్యాయ నమః
ఓం ఓజస్కరాయ నమః
ఓం జయినే నమః 70
ఓం జగదానంద హేతవే నమః
ఓం జన్మమృత్యుజరావ్యాధివర్జితాయ నమః
ఓం ఔన్నత్యపదసంచార రథస్థాయ నమః
ఓం అసురారయే నమః
ఓం కమనీయకరాయ నమః
ఓం అబ్జవల్లభాయా నమః
ఓం అంతర్బహిఃప్రకాశాయ నమః
ఓం అచింత్యాయ నమః
ఓం ఆత్మరూపిణే నమః
ఓం అచ్యుతాయ నమః 80
ఓం అమరేశాయ నమః
ఓం పరస్మైజ్యోతిషే నమః
ఓం అహస్కరాయ నమః
ఓం రవయే నమః
ఓం హరయే నమః
ఓం పరమాత్మనే నమః
ఓం తరుణాయ నమః
ఓం వరేణ్యాయ నమః
ఓం గ్రహాణాంపతయే నమః
ఓం భాస్కరాయ నమః 90
ఓం ఆదిమధ్యాంతరహితాయ నమః
ఓం సౌఖ్యప్రదాయ నమః
ఓం సకలజగతాంపతయే నమః
ఓం సూర్యాయ నమః
ఓం కవయే నమః
ఓం నారాయణాయ నమః
ఓం పరేశాయ నమః
ఓం తేజోరూపాయ నమః
ఓం శ్రీం హిరణ్యగర్భాయ నమః
ఓం హ్రీం సంపత్కరాయ నమః 100
ఓం ఐం ఇష్టార్థదాయ నమః
ఓం ప్రసన్నాయనమః
ఓం శ్రీమతే నమః
ఓం శ్రేయసే నమః
ఓం భక్తకోటిసౌఖ్యప్రదాయినే నమః
ఓం నిఖిలాగమవేద్యాయ నమః
ఓం నిత్యానందాయ నమః
ఓం ఛాయాఉషాదేవీ సమేత -
శ్రీ సూర్యనారాయణ స్వామినే నమః




తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో (25 రోజులు) జరిగిన
అధ్యయనోత్సవం దృశ్యాలు




తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా
తి.తి.దే. నిర్వహించిన కోయిల్‌ఆళ్వార్ తిరుమంజనం (ఆలయశుద్ధి) కార్యక్రమ దృశ్యాలు




ఇటీవల తిరుపతి శ్రీపద్మావతీ విద్యాలయాలలో మహిళలను ఉద్దేశించి ఉత్తమ సమాజ నిర్మాణానికి మహిళలకు విద్య అవసరం అని తెలియజేసిన
తి.తి.దే. ధర్మకర్తల మండలి సభ్యురాలు డా. సుధానారాయణమూర్తి

డిసెంబరు 2019 మాసంలో తిరుమల కుమారధార, పసుపుధార డ్యాములవద్ద గంగపూజ నిర్వహిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్. ఐ.ఏ.యస్.



# దివ్యక్షేత్రం... తిరుమల

05

– శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 9985670152

*గత సంచిక తరువాయి భాగం...*

## వకుళమాతే యశోద

ద్వాపరయుగంలో చిన్నికృష్ణుణ్ణి పెంచి పెద్ద చేసిన తల్లి యశోద! చిన్నికృష్ణుని లీలల్ని దర్శించిన యశోద శ్రీకృష్ణునికి ఒక్కపెళ్లైనా చెయ్యలేకపోయింది. కనీసం ఆయన పెళ్లిని చూసే భాగ్యం అయినా పొందలేకపోయింది.

పాపం ఆమె బాధను చూసిన కృష్ణయ్య "అమ్మా! కలియుగంలో నేను శ్రీనివాసుడిగా వస్తాను. ఆకాశరాజు కూతురు పద్మావతిని నేను వివాహం చేసికుంటాను. ఆ పెండ్లి నీ చేతులమీదుగానే జరుగుతుంది అని వర మిచ్చాడు. అప్పటి యశోదే ఇప్పటి వకుళమాత!

వకుళమాత శ్రీనివాసుణ్ణి తన కన్నబిడ్డలాగా చూసు కుంది. శ్రీనివాసుడు మరొక్కమారు మాతృప్రేమను చవి చూశాడు.

ఒకరోజు శ్రీనివాసుడు వేటకోసం కొండల్లోకి వెళ్లాడు. అక్కడ అడవిఏనుగుచేత తరుమబడుతున్న ఆకాశరాజు కూతురు పద్మావతి కనిపించింది. ఆ ఏనుగుబారినుండి రక్షించిన శ్రీనివాసుడు ఆమె మోహంలో పడ్డాడు. ఆమె వెంట ఉన్న చెలికత్తెలు శ్రీనివాసునిపై రాళ్లు విసరుతూ తరిమి కొట్టారు. నెత్తురోడుతున్న గాయాలతో వచ్చిన శ్రీనివాసుణ్ణి చూచి వకుళమాత ఆందోళనపడింది.

జరిగిన కథనంతా చెబుతూ ఆకాశరాజు కూతురు పద్మావతీ తాను పరస్పరం ప్రేమించుకున్నామనీ, ఆమెను పెళ్లి చేసుకొనడానికి ఆకాశరాజుతో మాట్లాడి రమ్మని వకుళమాతను కోరాడు శ్రీనివాసుడు.



కొండల్లో తిరిగే తామెక్కడ? చక్రవర్తి అయిన ఆకాశ రాజుకూతురు పద్మావతి ఎక్కడ? ఇద్దరికీ పొంతన ఎలా కుదురుతుంది అని సందేహిస్తున్న వకుళమాతతో అమ్మా ద్వాపరయుగంనాటి యశోదవు నీవు. అప్పటి కృష్ణుణ్ణే నేను.

అంతేకాదు, ఆకాశరాజు పుత్రిక పద్మావతే త్రేతా యుగం నాటి వేదవతి.



## వేదవతే పద్మావతి

సీతారామలక్ష్మణులు అరణ్యవాసం చేస్తున్న సమయంలో రావణాసురుడు సీతను అపహరించాడు. ఆ సమయంలో అగ్నిదేవుడు ఎదురై రావణా! ఈమె ఎవరు? అని అడిగాడు. ఈమె సీతాదేవి అన్నాడు రావణుడు. కాదు సీతకానే కాదు. అసలు సీత నా దగ్గర ఉంది అంటూ వేదవతిని చూపించాడు. రావణాసురుడు అగ్నిదగ్గర ఉన్న వేదవతిని తీసుకెళ్లాడు. లంకలో సీతకు బదులుగా వేదవతి ఉండింది. మళ్లీ రావణసంహారం అయిన తర్వాత సీత అగ్నిప్రవేశం చేసిన సమయంలో, అగ్నిగుండంనుంచి సీతరూపంలో ఉన్న ఇద్దరు స్త్రీలు బయటికి వచ్చారు.

ఆశ్చర్యపోయిన శ్రీరామచంద్రునితో అగ్నిదేవుడు ప్రత్యక్షమై రామచంద్రా! ఇంతవరకు లంకలో ఉన్నది ఈ వేదవతి. అసలు సీత ఇదిగో నా దగ్గర ఉంది అని చూపించాడు. వెంటనే సీతాదేవి రామునితో నాకోసం లంకలో కష్టాలను అనుభవించిన వేదవతిని వివాహం చేసుకొమ్మని అడిగింది.

ఈ అవతారంలో నేను ఏకపత్నీవ్రతుణ్ణి, కలియుగంలో వేంకటాచలపతిగా అవతరించినవేళ, ఈమె ఆకాశరాజుకూతురుగా పద్మావతిపేరుతో అవతరిస్తుంది, అప్పుడు ఆమెను వెళ్లి చేసుకొంటానని రాముడు వరం ఇచ్చాడు. ఆ రాముణ్ణే నేను, ఆ వేదవతే ఈ పద్మావతి!

వేదవతి కూడ లక్ష్మి అవతారమే. మయుడు అనే వేదపండితుడు ఎప్పుడు వేదాధ్యయనం చేస్తుండగా ఒకసారి ఊర్వశి అనే అప్సరస కంటబడింది. ఆమెను చూసిన ఆ విప్రుడు కామప్రేరితుడు కాగా అతనికి ఇంద్రియపతన మయ్యింది. అందులోనుండి 'లక్ష్మీదేవి' శిశువుగా అవతరించింది. వేదం వల్లిస్తుండగా పుట్టింది కనుక 'వేదవతి' అనే పేరు పెట్టుకొన్నాడు. అదీ ఇప్పటి పద్మావతి గాథ! అంటూ వకుళమాతతో శ్రీనివాసుడు వివరించాడు.

## శ్రీనివాసకల్యాణం

ఈ గాథనంతా విన్న వకుళమాత ఆనందంతో ఆకాశ రాజు దగ్గరికి వెళ్లి పద్మావతీ శ్రీనివాసుల కల్యాణానికి మధ్యవర్తిత్వం నిర్వహించింది.

వైశాఖమాసం శుక్లపక్షం దశమీ శుక్రవారం ఉత్తర ఫల్గుణీ నక్షత్రంతో కూడిన శుభలగ్నంలో శ్రీపద్మావతీ శ్రీనివాసుల కల్యాణం ఆకాశరాజు రాజధాని నారాయణవరంలో అంగరంగవైభవంగా జరిగింది. ఆ వివాహవేడుకలకు బ్రహ్మేంద్రాదిదేవతలు, సమస్తలోకాలవాసులు వచ్చారు. అష్టదిక్పాలకులు వచ్చారు. సూర్యుణ్ణి పంపించి కొల్హాపురం నుంచి శ్రీమహాలక్ష్మిని కూడా పిలిపించారు.




పార్వతీ, సరస్వతీ, లక్ష్మీదేవి దగ్గరుండి వేంకటేశ్వరుణ్ణి పెళ్లికొడుకును చేసి ఘనంగా పెండ్లి చేయించారు. అంగరంగవైభవంగా పెండ్లివేడుకలు పూర్తి అయిన తరువాత ఎవరు చెప్పినా వినక మహాలక్ష్మి మళ్లీ కొల్హాపురం చేరుకుంది.

నూతనదంపతులైన పద్మావతీ శ్రీనివాసులు వేంకటాచలక్షేత్రానికి వెళుతూ ఆరునెలలపాటు సువర్ణముఖీతీరంలోని అగస్త్యాశ్రమంలో ఉండినారు. ఆ తర్వాత వరాహక్షేత్రం చేరుకొన్న వారిద్దరు, తొండమానురాజు వాస్తుశాస్త్రరీత్యా ఆనందనిలయమనే బంగారుశిఖరంతో నిర్మించి ఇచ్చిన, దివ్యభవనంలో పద్మావతీ శ్రీనివాసులు గృహప్రవేశం


ఆకాశాన్ని చేరుకోవాలనుకున్నప్పుడు కిందినుంచే మొదలుపెట్టాలి మరి!

చేశారు. తొండమానుడు శ్రీనివాసునికి పరమభక్తుడే కాకుండా ఆకాశరాజుకు తమ్ముడు కూడా.

ఆదివరాహక్షేత్రం చేరుకొన్న శ్రీనివాసుడు, లక్ష్మీదేవి లేదే అని చింతిస్తూ ఆమెను తిరిగి పిలుచుకరావడానికి కొల్హాపురం వెళ్లాడు. అక్కడ ఆమె అనుగ్రహంకోసం పది ఏండ్లపాటు తీవ్రంగా తపస్సు చేశాడు. కాని ఆ జగన్మాత దర్శనం కాలేదు. ఇంతలో ఆకాశవాణి ఇలా విన్పించింది.

'శ్రీనివాసా! ఈ అవతారంలో శ్రీమహాలక్ష్మి నిన్ను చేరదు. నీవు వేంకటాచలక్షేత్రానికి తిరిగి వెళ్లు. ఆ క్షేత్రానికి దక్షిణాన సువర్ణముఖీతీరంలో శుకమహర్షి ఆశ్రమం తీరాన ఒక పద్మసరస్సు ఏర్పాటుచేసి, లక్ష్మికోసం తపస్సును శ్రద్ధగా ఆచరించు. ఆ పద్మసరోవరంలో సాక్షాత్తు లక్ష్మి అవతరిస్తుంది.

ఆకాశవాణి చెప్పిన ప్రకారం శ్రీనివాసుడు శుకమహర్షి ఆశ్రమతీరాన ఒక పద్మసరస్సును నిర్మించాడు. అందులోని పద్మాలు వికసించి ఉండడానికి సూర్యభగవానుణ్ణి ప్రతిష్ఠించాడు. పన్నెండేళ్లపాటు మహాలక్ష్మికోసం తపస్సు చేశాడు.

ఒకానొక కార్తికమాసం శుక్లపక్షంలో పంచమీ శుక్రవారం ఉత్తరాషాఢనక్షత్ర అభిజిత్‌లగ్నంలో సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి పదహారేళ్లయువతిగా సరోవరంలో బంగారు పద్మంలో అవతరించింది. పద్మంలో ఆవిర్భవించింది కనుక 'పద్మావతి' అనీ, పద్మంపై ప్రకాశించే వనిత కనుక 'అలమేలుమంగ' అనీ భక్తులచేత పిలువబడింది. ఆ జగన్మాతను బ్రహ్మాది దేవతలు అనేక విధాలుగా స్తుతించారు.

శ్రీనివాసుడు పద్మావతి మెడలో తన కలువలహారాన్ని వేశాడు. తన వక్షఃస్థలంలో వ్యూహలక్ష్మిగా చేసుకొని తిరుమలక్షేత్రానికి బయలుదేరాడు. ఇంతలో దేవతలంతా ఈ పద్మసరోవరతీరాన అర్చామూర్తిగా పూజలందుకొమ్మని ప్రార్థించారు. మహారాజ్ఞిగా, స్వతంత్ర వీరలక్ష్మిగా పద్మావతి పేరుతో పూజలందుకుంటున్నది శ్రీలక్ష్మీదేవి

తిరుమల చేరుకొన్న శ్రీనివాసుడు ఆకాశరాజు కూతురు పద్మావతిని కూడ తన హృదయంలోని వక్షఃస్థల వ్యూహలక్ష్మితో మిళితం చేసుకొన్నాడు.

దేవతల కోరికపై కలియుగాంతవరకు తిరుమల క్షేత్రంలో వక్షఃస్థలలక్ష్మితో నిలిచి ఉన్న శ్రీనివాసునికి బ్రహ్మదేవుడు పదినాళ్లపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించాడు.

## శిలగా మారిన శ్రీనివాసుడు

ఒకనాడు భక్తుడైన తొండమానుడు రహస్యమార్గం గుండా ఆనందనిలయంలో ప్రవేశించి శ్రీవేంకటేశ్వరుణ్ణి కాపాడుమని శరణువేడినాడు. అసలు ఏమి జరిగిందని అడిగాడు ఆనందనిలయుడు.

"రెండేండ్లక్రిందట ఒక విప్రుడు అతని భార్యాపిల్లల్ని తనకు అప్పచెప్పాడనీ. కాని తన మతిమరపుతో పొరపాటు జరిగినందువల్ల వాళ్లంతా మరణించారనీ; ఇప్పుడు ఆ విప్రుడు తిరిగి వచ్చాడనీ, శ్రీనివాసుని దర్శనానికి వెళ్లారని అసత్యం పలికాను" అంటూ తన దీనగాథను చెప్పాడు తొండమానుడు.

అయ్యా! నీకు బ్రహ్మహత్యాపాపం చుట్టుకొందే, సరే, నీ కోసం ఆ పాపాన్ని నేనే భరిస్తాను. ఇకమీదట ఎవరికీ దర్శనం ఇవ్వను, మాట్లాడను అంటూ ఆ స్వామివారు ఆ విప్రకుటుంబాన్ని బ్రతికించాడు.

ఆనాటినుంచి "వక్షఃస్థల వ్యూహలక్ష్మి"తో శ్రీనివాసుడు "కలౌ వేంకట నాయకః" అనే ప్రసిద్ధితో ఈ కలియుగంలో పిలిస్తే పలికే ప్రత్యక్షదైవంగా, కోరిన వరాలరాయడిగా సార్థక నామధేయంతో వరలుతూ అద్భుతమైన సాలగ్రామ శిలావిగ్రహమూర్తిగా ఆవిర్భవించి దర్శనమిస్తున్నాడు.

అదే భూలోకవైకుంఠంగా భాసిల్లుతున్న తిరుమల కొండ. అదిగో! దర్శించి ధన్యులు కండి!

**కట్టెదుర వైకుంఠము కాణాచయనకొండ !!**
**తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ !!**


శ్రీవేంకటేశ్వరుడు అర్చామూర్తిగా వెలసిననాటినుండి ఈ క్షేత్రంలో ఎన్నో ఉత్సవాలు, మరెన్నో సేవలు జరుగుతున్నాయి. వాటిని గూర్చి కూడా సంగ్రహంగా తెలుసుకుందాం.

*(ఇంకా ఉంది)*

45

# కైంకర్యమే.. తనువు దాల్చితే....

– డా॥ కంపల్లె రవిచంద్రన్, 98487 20478



**( కంబర్ మహాశయుడు నమ్మాళ్వార్ల దివ్యప్రభావాన్ని స్తుతించారు. ఇందుకు ఎంతో సంతోషపడ్డ మధురకవులు శ్రీనమ్మాళ్వార్లవారి దివ్య వైభవాన్ని, వారు అనుగ్రహించిన దివ్యప్రబంధాలను తలచుకొని మైమరచి 'కణ్ణినుణ్ శిఱుత్తామ్బినాల్' గానం చేయడం ఈ సంచికలో చదువవచ్చు.)**

భగవానునకు ఉపకారం చేసినవారని ఆళ్వార్లను ఆశ్రయించినవారైనా, పురుషార్థంగా భగవానునే ఆశ్రయించారా? అని అంటే,

(మెయ్మ్మైయే మేవినేన్)– భగవానునకు ఉపకారం చేసినవారని ఆళ్వార్లను ఆశ్రయించి, భగవానుడు లభించగానే, అతనినే ఉద్దేశ్యంగా గ్రహించడం కాకుండా, ఇహలోక– పరలోకాలు రెండింటిలోను ఆళ్వార్ల శ్రీచరణాలనే రెండింటిని ఉద్దేశ్యంగా గ్రహించాను. ఇక్కడున్న రోజుల్లో భగవానునిగూర్చి, అతని భక్తులనుగూర్చి తెలీని విషయాలను తెలిపినందున ఉపకారం చేసినవారు–అని, పరమపదంలో భగవానుని పొందడంలో పురుషకారంగా, **"తేహ నాకం మహిమా న స్సచం తే యత్ర పూర్వే సాధ్యా స్సంతి దేవాః"** (ఏ పరమపదంలో సాధ్యులనబడే దేవతలు ఉన్నారో, ఆ పరమపదాన్ని వారు మహిమను కలవారై పొందుతున్నారు–పురుషసూక్తమ్) అనే రీతిలో పరమపదంలో పొందదగ్గ ప్రాప్యంగా కూడా ఆళ్వార్లనే ఆశ్రయించాను. **"తస్మై నమో మధుజిదంఘ్రిసరోజతత్త్వజ్ఞానా నురాగ మహిమాతి శయాంతసీమ్నే, నాథాయ నాథ మునయేఽత్ర పరత్ర చాపి నిత్యం యదీయచరణౌ శరణం మదీయమ్" – స్తోత్రరత్నం–2)** (ఈ లోకంలోను, పైలోకంలోను, ఎల్లప్పుడు ఏ శ్రీమన్నాథమునుల శ్రీచరణాలు నాకు శరణమో, మధువు అనే అసురుని సంహరించిన భగవానుని శ్రీచరణపద్మాలను గూర్చిన యథార్థజ్ఞానం, ప్రేమ, అతిశయం– అనే వీటి యొక్క పరమావధి అనదగ్గవారు, నాకు పితామహులైన ఆ నాథమునులకు నమస్కారం)అని అంటూ శ్రీయామునులు నాథమునులను పరమపదంలో తమకు ప్రాప్యంగా ఆశ్రయించడానికి కారణం– ఈ మధురకవిఆళ్వార్లే.

**తేవు మట్రటియేన్**– ప్రాప్యంగా, ప్రాపకంగా వేరొక దైవం ఉన్నదని నాకు తెలియదు. **"అవన్ పొన్నడి మెయ్మ్మైయే మేవినేన్"**– అనే పదసందర్భంతో ఆళ్వార్లే ప్రాప్యం, ప్రాపకం– అనే అర్థాన్ని అన్వయంద్వారా తెలిపారు. ఇక్కడ **"తేవు మట్రటియేన్"** అని అంటూ ప్రాప్య–ప్రాపకాలు వేరు అనేవి లేవు– అని అన్నందువల్ల తమ నిశ్చయాన్ని వ్యక్తం చేయడంకోసం ఈవిధంగా వ్యతిరేకముఖంగా పల్కుతున్నారు. **"మట్రటియేన్"** అని అనడంద్వారా "మిగిలిన విషయాలవలే భగవానుని కూడా నేను ప్రాప్య–ప్రాపకాలుగా గ్రహించలేదు" అని నిషేధిస్తున్నారు కదా! భగవద్విషయం యొక్క పర్యంతసీమ అయిన ఆళ్వార్ల శ్రీచరణాల పర్యంతం అభినివేశాన్ని పొందినవారైనందున ఈ విధంగా పల్కుతున్నారు. శాస్త్రాలు భగవానుని ప్రాప్యప్రాపకరూపునిగా తెల్పుతున్నాయి. ఆచార్యుల ఉపదేశాలు ఆ రీతిలోనే ఉన్నాయి. ఆవిధంగా ఉండగా, వీరు ఈవిధంగా భగవద్విషయాన్ని కాదనవచ్చునా?– అని అంటే, భగవానుడే ప్రాప్యం, ప్రాపకం– అనే అరుదైన అర్థాన్ని తెలిపి మహోపకారం చేసినవారైన ఆళ్వార్ల శ్రీచరణాలపట్ల గల అభినివేశం చేత ఈవిధంగా మధురకవులు అంటున్నారు, కనుక, విరోధం లేదు.

*(ఇంకా ఉంది)*



2020,
ఫిబ్రవరి 05వ తేదీన
భీష్మఏకాదశి
సందర్భంగా...

# త్యాగైకధనుడు భీష్ముడు

– ఆచార్య శలాక రఘునాథశర్మ

**"న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః"** అంటున్నది ఉపనిషన్మాత. త్యాగంవలననే కొందరు అమృతత్వం అనుభవించారట. సర్వసంగపరిత్యాగం లాంఛనంగా చేసి మేము కూడా త్యాగులమో, యోగులమో అయ్యామనుకొనేవారికంటె జీవితమంతా త్యాగైక భావనతో వెళ్లబుచ్చిన భీష్ముడు మూర్తీభవించిన త్యాగస్వరూపం అనటం స్వభావోక్తి.

నూనూగుమీసాల నూత్నయౌవనంలోనే తండ్రికోసం శాశ్వత బ్రహ్మచర్యపాలనవ్రతం పట్టి శరీరసుఖత్యాగం చేశాడు. అందులో భాగంగానే పైతృకంగా సర్వాధికారాలతో వరిస్తున్న ఆధిపత్యలక్ష్మిని త్యాగం చేశాడు. తమ్ముల సంతానం భోగభాగ్యాలను చూడటమే పరమ లక్ష్యంగా పెట్టుకొని ఐహికభోగాలనన్నింటినీ త్యాగం చేశాడు. అందుకే ఆయన మూర్తీభవ త్యాగం.

ఆ మహాత్మునిలో ఆజన్మశుద్ధత్వం ఉన్నది. తల్లి పరమపావనమూర్తి గంగ. తండ్రి పూర్వజన్మలో సత్యవాక్కు, సత్యవిక్రముడు. అశ్వమేధసహస్రంతో, రాజసూయశతంతో దేవదేవుని సంతోషపెట్టి స్వర్గానికే కాదు సత్యలోకానికి కూడా రాకపోకలు చేయగల సత్తా సాధించిన మహాభిషుడు. శ్రీమహావిష్ణువు "పితరం రోచయామాస తదా దశరథం నృపమ్" (రామా.బాల.16.8) అని తన అవతారానికి యోగ్యతగల వ్యక్తిగా దశరథుణ్ణి ఇష్టపూర్వకంగా ప్రీతితో ఎన్నుకున్నాడట.

అలాగే బ్రహ్మగారి శాపంవలన మరల మానవుడుగా పుట్టవలసివస్తే "ప్రతీపం రోచయామాస పితరం భూరితేజసమ్" (ఆది. 96-9)-మహాతేజస్సుగల ప్రతీపుణ్ణి తండ్రిగా ఎన్నుకున్నాడట మహాభిషుడు. అతనే శాంతనుడుగా పుట్టాడు. అట్టి దివ్యవ్యక్తులు ఈ మహాత్ముని పితరులు.

భీష్ముడు స్వయంగా అష్టవసువుల తురీయాంశాల అర్ధభాగాలను కైకొని పుట్టినవాడు. వసువులు దేవయోనులలో ఒకజాతివారు. ఒక దోషానికి కోపించి వసిష్ఠుడు శపిస్తే భూలోకంలో పుట్టవలసి వచ్చింది.

ఈవిధంగా దేవవ్రతుని జన్మ దివ్యమైనది.

దేవవ్రతుడు గంగ పర్యవేక్షణలో సర్వవిద్యలు నేర్చాడు.

అందులో అస్త్రవిద్యనంతా నేర్చాడు. ఆరుఅంగాలతో పాటుగా నాలుగువేదాలు, శుక్రనీతి, బృహస్పతినీతి శాస్త్రాలు, సర్వశాస్త్రాలు సాంగోపాంగంగా అభ్యసించాడు. ఇదంతా వసిష్ఠులవారి శిష్యత్వంలో పొందిన విద్యారాశి. ఇంక పరశురాముడు ధనుర్విద్యనూ, అస్త్రవిద్యనూ తనకు వచ్చినదంతా ఇతనికి నూరిపోశాడు. ఈతడు రాజధర్మార్థ కోవిదుడు.

గంగతీర్పులో గాంగేయుడు ఇన్నివిద్యలు నేర్చినది సుమారు మూడుపదులవత్సరాలు. సాధారణంగా వ్యాకరణాదిశాస్త్రాలలో ఒకశాస్త్రానికి పన్నెండుసంవత్సరాలు పడుతుందని అంచనా. పోనీ యుగాంతరధర్మంగా ఒక్కొక్క విద్యకు కనీసపక్షంగా రెండుసంవత్సరాలుగా నిర్ణయించుకుంటే పదునాలుగువిద్యలకు ఇరవైయెనిమిది సంవత్సరాలు పడుతుంది. ఈ విద్యలలో ధనుర్విద్య మొదలైన ఉపవేదాదులు లేవు. కానీ మహామేధావి దేవపుత్రుడు అప్పటికి అందుబాటులో ఉన్న సర్వవిద్యలను ముప్పది ఏండ్లలో అగస్త్యుడు సముద్రాన్నిలాగా అపోశన పట్టివేశాడన్నమాట.

భీష్ముడు దుర్ధాంతపరాక్రమశాలి. వయోవృద్ధుడైనా– తక్కినవాళ్లమాట అటుంచి– లోకైకవీరుడు అర్జుననకూ, లోకేశ్వరుడు శ్రీకృష్ణునకు కూడ గుండె గుబులు పుట్టించిన మహావీరుడు. గురువు పరశురాముడే భీష్ముని కోడితినని పదిమందిముందు ప్రకటించాడు.

కురుక్షేత్ర మహాసంగ్రామంలో ఆయన విజృంభణ అతిలోకసామాన్యమైనది. ఆయుధం ముట్టనని ప్రతిజ్ఞ చేసిన వాసుదేవుడు రెండుపర్యాయాలు ప్రతిజ్ఞ పాడుకానీ, భీష్ముని అంతుచూస్తానని విజృంభించవలసి వచ్చింది.

భారతమంతా జాగ్రత్తగా పరిశీలిస్తే జగద్గురుస్థానంలో సర్వోన్నతశిఖరంలో ఉన్నవాడు వాసుదేవుడు. ఆయన అర్జునుణ్ణి నిమిత్తంగా చేసికొని జ్ఞానామృతాన్ని సర్వమానవకోటికి అవ్యాజకృపతో అందించాడు. విదురుడు ధృతరాష్ట్రునినిమిత్తంగా ఐహికనీతివిద్యను స్వయంగా అందించి పరమార్థవిద్యను సనత్సుజాతునిద్వారా అందింపజేశాడు. కాగా శాంతనవుడు ధర్మరాజును నిమిత్తంగా చేసుకొని రాజధర్మాలను, ఆపద్ధర్మాలను, మోక్షధర్మాలను సాకల్యంగా సర్వమానవజాతి హృదయాలలో పదిలపరచాడు. ప్రధానంగా ఈ ఉపదేశగరిమయే భారతానికి "యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్క్వచిత్" అనే గౌరవాన్ని కలిగించింది.

శాంతిపర్వంలో భీష్ముడు చేసిన శ్రీకృష్ణస్తవరాజం సర్వోపనిషత్సారమైన అమృతకలశం. "విద్యా హృద్యాపి సావద్యా వినా వినయసంపదమ్" అని పెద్దలమాట. భీష్మునిలో అణువణువునా విద్య నిబిడంగా ఉంది. కాని అది అతనిలో అణుమాత్రమైన అహంకారాన్ని కూడా అంకురింపజేయలేదు. యుధిష్ఠిరునికి ధర్మబోధ చేసి చిత్తశాంతి కలిగించవలసినదిగా శ్రీకృష్ణుడు కోరినపుడు ఆయన వాక్కులలో అభివ్యక్తమైన వినయగరిమ సముద్రమంత గంభీరమైనది.

కానీ బోధకు ఉపక్రమించిన తరువాత జిజ్ఞాసువైన ధర్మజుని సర్వప్రశ్నలకు చక్కని సమాధానాలను సప్రమాణంగా ఇచ్చిన తీరుతెన్నులను పరికిస్తే ఆతని జ్ఞానగరిమ బ్రహ్మాండాంతసంవర్ధి అయి, సత్యపదోన్నతుడు అయిన త్రివిక్రమునిస్వరూపాన్ని తలపింపజేస్తుంది. మానవహృదయాలను పులకింపజేస్తుంది.

శాంతనుకుమారుడు భీష్ముడు సత్యధర్ముడు, మహావీర్యుడు, శూరుడు, ధర్మైకతత్పరుడు. ఇట్టివ్యక్తి మరియొకడు మూడులోకములందును లేడు. శరతల్పమున పరుండి తనతపస్సుతో మృత్యువును నిలువరించిన భీష్మునివంటి జీవి సృష్టిలో మరియొకడు లేడు. ఉన్నట్లు మేము వినలేదు. సత్యం, తపస్సు, దానం, యజ్ఞాధికరణం, ధనుర్వేదం, వేదం, నీతి, దానిని చక్కగా పరిరక్షించుట– అనువానిలో నీవంటి వ్యక్తి మరియొకడున్నట్లు మేము కనలేదు. వినలేదు. అనృశంసుడు, శుచి, దాంతుడు, సర్వభూతముల హితమునందు పరమప్రీతి కలవాడు, మహారథుడునగు నీవంటి వాడెవ్వడు మాకు వినరాలేదు.

ఇవి సాక్షాత్తు శ్రీకృష్ణవాసుదేవుని ప్రకటనలు. 'గగనం గగనాకారం సాగరః సాగరోపమః' అన్నట్లు **'భీష్మునివంటివాడు భీష్ముడే'** అనుట యథార్థం. మానవసమాజము ఉపాసింపదగిన మానవుడొకడుండునన్నచో అతడు శాంతనవుడు మాత్రమే.

బాలవాక్కు

# అందరిలోనూ దేవుడున్నాడు!!

పూర్వం ఒక అరణ్యంలో ఓ సాధువుండేవాడు. ఆయనకు చాలామంది శిష్యులుండేవారు. ఒకరోజు ఆయన తన శిష్యులతో "అన్ని ప్రాణుల్లోనూ దేవుడున్నాడు. కనుక, మీరు అందరికీ నమస్కరించండి" అని ఉపదేశించాడు.

ఒకరోజు ఒక శిష్యుడు హోమానికి అవసరమైన కట్టెలు తీసుకురావడానికి అడవికెళ్లాడు. అప్పుడు హఠాత్తుగా 'పారిపోండి.. పారిపోండి! మదపుటేనుగు వస్తోంది!!' అని పెద్దగా ఒకకేక వినిపించింది. ఆ కేక వినడంతోనే అక్కడున్న వారందరూ పారిపోయారు.

అయితే, ఆ శిష్యుడు మాత్రం అక్కడినుండి కనీసం జరగనైనా జరగలేదు. 'నేనెందుకు పరుగెత్తాలి? నేనూ దేవుణ్ణే! ఆ ఏనుగూ దేవుడే!!' అని అనుకుంటూ ఒక అడుగైనా అటూ ఇటూ వేయకుండా అక్కడే నిలబడ్డాడు. ఏనుగుకి నమస్కరించి భగవంతుణ్ణి కీర్తించసాగాడు. అతణ్ణి చూచి ఏనుగుపై ఉన్న మావటివాడు 'పారిపో! పారిపో!!' అని గట్టిగా అరిచాడు. అప్పటికీ ఆ శిష్యుడు పారిపోలేదు. ఆ శిష్యుణ్ణి ఏనుగు సమీపించి తన తొండంతో అతణ్ణి చుట్టి



ఓ పక్కగా విసిరేసింది. అతడికి బలమైన గాయాలు తగిలి సొమ్మసిల్లి పడిపోయాడు. ఆశ్రమవాసులు జరిగిందంతా తెలుసుకొని అతణ్ణి ఆశ్రమానికి తీసుకొచ్చారు. శిష్యుడు క్రమంగా స్పృహలోకి వచ్చాడు. తక్కిన శిష్యుల్లో ఒకడు అతణ్ణి చూచి 'ఏనుగు వస్తున్న సంగతి నీకు తెలుసుకదా? నువ్వెందుకు పారిపోలేదు?' అని అడిగాడు.

అందుకు ఆ శిష్యుడు ప్రపంచంలోని జీవరాసులన్నీ భగవంతుడి రూపాలే! మానవుడు, జంతువు తదితర




మాస్టర్ వి.జి.ఎల్.అమర్త్య,
8వ తరగతి, చైతన్య టెక్నోస్కూల్,
తిరుమల బైపాస్‌రోడ్డు,
తిరుపతి.


జీవరాశులన్నింటిలోనూ ఆయనే ఉన్నాడని మన గురువు గారు చెప్పారు కదా! కనుకనే, ఏనుగును చూచినప్పుడు నేను ఏనుగురూపంలో భగవంతుడు వస్తున్నాడు అని భావించాను. అందుకే అక్కడినుండి పారిపోలేదు' అని చెప్పాడు.

శిష్యుడి జవాబు విన్న గురువుగారు 'నాయనా! అదంతా సరే! నువ్వూ దేవుడివే, ఆ ఏనుగూ దేవుడే! అయితే ఆ ఏనుగుపై ఉన్న మావటివానిలోని దేవుడు నిన్ను హెచ్చరించినప్పుడు అతడి మాటపై నీకెందుకు నమ్మకం కుదరలేదు? నువ్వు ఆ మావటివాడిలో ఉన్న భగవంతుడి మాటలను గౌరవించాలి కదా! ఆ హెచ్చరికలు పట్టించుకోవాలి కదా! భగవంతుడు ఎప్పటికప్పుడు సందేశం ఇస్తూనే ఉంటాడు.' అన్నారు.

**పాపాత్ముల్లోనూ, పుణ్యాత్ముల్లోనూ; అలాగే మంచివారిలోనూ, చెడ్డవారిలోనూ- అందరిలోనూ దేవుడున్నాడు. అయితే భక్తి, మంచితనం లేనివారితోనూ, దుర్మార్గులతోనూ మెలగకూడదు. వారికి దూరంగా ఉండాలి. మంచివారితోనే స్నేహం చేయాలి అన్నదే ఈ కథలో ఉన్న నీతి.**

## భగవద్గీత-యువత

# దైవీగుణాలతో దుఃఖరాహిత్యము

- డా॥ వైష్ణవాంఘ్రిసేవకదాసు
9821914642

మనిషి తన సహజస్థితిదృష్ట్యా ఆనందమయుడు. ప్రేమను కలిగి ఉండడమే, ప్రేమను పంచడమే అతని సహజ స్వభావం. ఇది కేవలం అతడు తనను ఆత్మస్వరూపునిగా తెలిసికొన్నప్పుడే సాధ్యపడుతుంది.

కాని సామాన్యంగా మనం చూస్తే నూటికి తొంభై శాతం జనులు ఏదో ఒక కారణంగా దుఃఖంలో మునిగి ఉన్నట్లు కనిపిస్తుంది. ఆ దుఃఖం స్వయంగా కొని తెచ్చు కున్నదే కావచ్చు లేదా నిజంగా వచ్చి నెత్తిమీద పడినదే కావచ్చు. ఏదియేమైనా దాదాపుగా అందరు దుఃఖంలో మునిగి ఉన్నట్లే కనిపిస్తుంది.

కురుక్షేత్రంలో అర్జునుడి దుఃఖం కూడ కొని తెచ్చుకున్నదే! ఎందుకంటే తాను యుద్ధం చేయబోయేది బంధువులతోనేనని అతనికి 14 ఏళ్ళనుండే తెలుసు. మరి యుద్ధరంగానికి వచ్చిన తరువాత దుఃఖించడంలో అర్థ మేమిటి?

అందుకే భగవద్గీత దుఃఖరాహిత్యానికి ఉత్తమమైన మార్గాలు చెప్పింది. అందులో ఒకటి దైవీగుణాలు అల వరచుకోవడం. దైవీగుణాలు అలవరచుకున్నవారికి ఆత్మ శక్తి జాగృతమౌతుంది. ఆత్మశక్తి జాగృతమైతే ఇక మనిషికి ఎదురే ఉండదు. అతడు సమస్త విజయాలతో ముందుకు సాగుతాడు.

మరి దైవీగుణాలు ఏవి?

"భయం లేకపోవడం, తన అస్తిత్వాన్ని పవిత్రీక రించుకోవడం, ఆధ్యాత్మికజ్ఞానాన్ని సంపాదించుకోవడం, దానం చేయడం, ఆత్మనిగ్రహాన్ని కలిగి ఉండడం, యజ్ఞం చేయడం, వేదాధ్యయనం, తపస్సు చేయడం, సరళంగా ఉండడం, అహింస, సత్యము పలకడం, కోపం లేకపోవడం, త్యాగం, శాంతి, ఇతరుల దోషాలను ఎన్నకపోవడం, జీవులపట్ల దయ, లోభం లేకపోవడం, మృదువుగా వ్యవ హరించడం, సిగ్గు, దృఢనిశ్చయం, తేజం, క్షమ, ధైర్యం, శుచిత్వం, అసూయ లేకపోవడం, గౌరవవాంఛ లేకపోవడం" అనేవి దైవీగుణాలు అని భగవద్గీత (16.1-3) పలికింది.

ఈ దైవీగుణాలలో మొట్టమొదటిదే భయ రాహిత్యం. అంటే నిర్భయంగా ఉండడం. ఈ జగత్తులో అందరు భయంతోనే బ్రతుకుతారు. అంటే మానసికస్థితిలో జీవిస్తారు.





అన్ని ఆశలు ఒకేసారి అడియాశలుకావు

కాని, ఎవరైతే ఆత్మస్థితిలో ఉంటారో వారు ప్రేమతో బ్రతుకుతారు. అనేకమైన అద్భుతాలను సాధించినవారి జీవితంలో నిర్భయత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. అంటే వారిలో దైవీగుణము ఉన్నట్లే. దైవీగుణము ఉన్నది కాబట్టే వారు దుఃఖరాహిత్యాన్ని పొందారు.

భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చినది గాంధీజీయే కావచ్చు, మొట్టమొదటిసారి చంద్రుని మీద కాలు పెట్టినది నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్‌యే కావచ్చు, తొలిసారిగా ఎవరెస్టు ఎక్కిన వాడు ఎడ్మండ్ హిల్లరీయే కావచ్చు, ఇంకెవరో అద్భుతవీరుడే కావచ్చు. అందరిలో ఈ నిర్భయత్వం కనిపిస్తుంది.

కాబట్టి యువత మొట్టమొదట నేర్చుకోవలసింది నిర్భయత్వం. ఓడిపోతామేమో, నవ్వుతారేమో, నష్ట పోతామేమో లేదా ఇంకేదో భావనను కలిగి ఉండడమే భయం.

"మనిషి మొట్టమొదలు గెలుపు పొందవలసింది మనస్సులోనే గాని బయట కాదు" అని చాణక్యపండితుడు అన్నాడు. యుద్ధానికి బయలుదేరే యోధుడు లేదా ఇంటర్వ్యూకు బయలుదేరే యువకుడు లేదా పరీక్షకు బయలుదేరే విద్యార్థియొక్క గెలుపు ఓటమిలు ముందే నిర్ణయించబడతాయి. అవి ఆయా వ్యక్తుల మనస్సులో నిర్ణ యించబడడం జరుగుతుంది. గెలిచి తీరుతానని బయలు దేరేవాడు తప్పకుండ గెలిచి తీరుతాడు. అతడు "అభయం" అంటే భయరాహిత్యమనే దైవీగుణంలో ఉంటాడు కాబట్టే విజయం సాధించి తీరుతాడు.

"నేను సాధించగలను" అన్నా లేదా "నేను సాధించ లేను" అనుకున్నా రెండుకూడ నిజమే అని ప్రపంచ ప్రఖ్యాతి చెందిన మోటారుకార్ల యజమాని హెన్రీఫోర్డ్ అన్నాడు. అంటే జయాపజయాలు నీవే నిర్ణయించుకుంటావు.

గీతద్వారా దైవీగుణాలను పొందితే విజయం నీది అవుతుంది, అలా కాకుండ మానసికస్థితిలో భయంలో కూరుకొనిపోతే నిశ్చయంగా అపజయం నిన్ను వరిస్తుంది. భగవద్గీతలోని 16వ అధ్యాయంలో ఉన్న మొదటి మూడు శ్లోకాలను కంఠస్థం చేసి ప్రతీరోజు రెండుమూడుసార్లు ఎలుగెత్తి చదివితే ఆ శ్లోకోచ్చారణప్రభావంతో దైవీగుణాలు మీలో కలుగుతాయి. ఇక అప్పుడు మీరు దుఃఖరహితులై విజయసీమలలో ప్రయాణిస్తారు.



## తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి (తెప్ప) ప్లవోత్సవక్రమము

### 2020, ఫిబ్రవరి 02 నుండి 08 వరకు

| | | | |
|---|---|---|---|
| 02-02-2020 | ఆదివారం | శ్రీ కోదండరామస్వామివారికి | మాఘ పూర్ణిమకు జరుగును |
| 03-02-2020 | సోమవారం | శ్రీ పార్థసారథిస్వామివారికి | |
| 04-02-2020 | మంగళవారం | శ్రీ కల్యాణవేంకటేశ్వరస్వామివారికి | |
| 05-02-2020 | బుధవారం | శ్రీకృష్ణస్వామి, ఆండాళ్‌అమ్మవారికి | |
| 06-02-2020 | గురువారం | శ్రీ గోవిందరాజస్వామివారికి | |
| 07-02-2020 | శుక్రవారం | శ్రీ గోవిందరాజస్వామివారికి | |
| 08-02-2020 | శనివారం | శ్రీ గోవిందరాజస్వామివారికి | |



బాలప్రబోధం

# బోళాశంకరుడు

- శ్రీమతి మొలకా ఉత్తరఫల్గుణి,
80996 81422

మహామహిమాన్వితుడు, సర్వశుభంకరుడు, సకల విద్యాప్రదాత, భుక్తిముక్తిదాయకుడు అయిన మహాదేవుడు ఈశ్వరుడు పరమేశ్వరుడు. నవవిధభక్తిమార్గాలను ఆశ్రయించి ఎందరో భక్తులు పరమాత్మునిలో ఐక్యమయ్యారు. అవేకాక ఆచారాలు, సంప్రదాయాలు, నియమనిష్ఠలు ఇలాంటివేవీ తెలీని ఎందరో అమాయక భక్తులు మనసా, వాచా, కర్మణా భగవంతునిపైనే దృష్టి నిలిపి, భగవంతునితోనే అమాయకంగా మాట్లాడుతూ, స్వామితోనే మమేకమై తరించినవారు కూడా కోకొల్లలున్నారు. ఆ అమాయక భక్తులను తనలో ఐక్యం చేసుకొని, తానూ బోళాశంకరు డయ్యాడు శివుడు. ఆ కోవలో కొంతమంది భక్తులను గురించి తెలుసుకుందాం.....

**1) ఫల్గునుడు**

ద్వాపరయుగంలో కౌరవులు పన్నిన మాయా జూదంలో పాండవులు ఓడిపోయారు. అందుకు వారు పన్నెండేండ్లు అరణ్యావాసం, ఒక్క ఏడు అజ్ఞాతవాసం చెయ్యాల్సి వచ్చింది. ఆ అరణ్యావాసకాలంలో శ్రీకృష్ణుడు ఫల్గునుడితో, శివుణ్ణి గూర్చి తపస్సు చేసి పాశుపతాస్త్రం సంపాదించుకో. రాబోయే యుద్ధంలో అది నీకు చాలా అవసరమౌతుందని చెప్పాడు. ఆ మాటలకు ఫల్గునుడు అడవికి వెళ్లి తపస్సు చేయనారంభించాడు. ఆ సమయంలో ఫల్గునుణ్ణి పరీక్షించాలనిపించింది శివునికి. అనుకున్నదే తడవుగా కిరాతరూపం ధరించి మూకాసురుడనే రాక్షసుణ్ణి అడవిపందిగా చేసి ఫల్గునుడిపై వదిలాడు. అప్పుడు ఫల్గునుడు దాన్ని తరుముకుంటూ వెళ్లి దానిపై బాణాన్ని వదిలాడు. అదే సమయంలో శివుడు కూడా బాణాన్ని వదిలాడు. ఆరెండు బాణాలూ ఒకేసారి ఆ అడవిపంది శరీరంలోకి దూసుకెళ్లాయి. శివుడు, ఫల్గునుడు ఆ అడవిపంది నాదంటే నాదని వాదులాడుకున్నారు. ఆ కోవలో ఎదుట ఉన్న కిరాతుడు శివుడని తెలుసుకొని ఫల్గునుడు తన తప్పిదాన్ని మన్నించాలని కోరాడు. అందుకు శివుడు ఏదైనా వరం కోరుకొమ్మన్నాడు. అప్పుడు పాశుపతాస్త్రం కావాలన్నాడు ఫల్గునుడు. ఇంకొక వరమేదైనా కోరుకో అన్నాడు శివుడు. నాకు ఈ జన్మలోనే ముక్తి కావాలన్నాడు ఫల్గునుడు. అది ఈ జన్మలో సాధ్యం కాదు. మరుజన్మలో నీకు ప్రసాదిస్తాను అని వరమిచ్చాడు. అలా ఇచ్చిన వరప్రభావంవల్ల ఫల్గునుడే మరుజన్మలో అమాయక భక్తుడైన తిన్ననిగా జన్మించాడు.



## 2) తిన్నడు

ఫల్గునుడు శివుని వరానుగ్రహంతో గిరిజనుడైన తిన్నడుగా జన్మించాడు. ఇతను అందరితో దేవుడే లేడు అని ఎప్పుడూ మూర్ఖంగా వాదించేవాడు. కానీ అనూహ్యంగా ఇతనిలో మార్పు వచ్చింది. అడవిలో కనబడ్డ ఒక శివ లింగాన్ని నిత్యమూ భక్తితో అర్చించడం మొదలుపెట్టాడు. ఆ కోవలో ఓ రోజు అడవిపంది మాంసాన్ని బాగా కాల్చి దొన్నెలలో నింపుకొన్నాడు. మారేడుదళాల్ని సేకరించి తన నెత్తిన చింకిజుట్టు మధ్యలో అమర్చుకున్నాడు. నోటినిండుగా పవిత్రమైన సువర్ణముఖరీనదినీటిని నింపుకొన్నాడు. నేరుగా శివలింగం దగ్గరికొచ్చాడు. అక్కడున్న చెత్తనంతా తన చెప్పు కాలితోనే ప్రక్కకు తోసేశాడు. నోటితో తెచ్చిన జలాన్ని శివ లింగంమీద ధారలుగా ఊశాడు. నెత్తిపైనున్న మారేడు దళాల్ని లింగంపై విదిలించాడు. స్వామిముందు మోకాళ్లపై కూర్చొని తన చేతుల్లో ఉన్న మాంసపుముక్కలను స్వామి ముందుంచి తినమని చెప్పాడు. కానీ, శివుడు వాటిని తిన లేదు. ఎంతగానో బ్రతిమిలాడిన తర్వాత వాటిని తీసు కొన్నాడు స్వామి. అలాగే సాగుతోంది ప్రతిరోజూనూ. అ తతంగాన్నంతా చూచిన బ్రాహ్మణుడికి చాలా కోపమొ చ్చింది. శివుడు ఆ బాపణ్ణి శాంతింపజేసి, నాకు అందించే ఈ పూజ ఒక అమాయకుడైన భక్తుడిది. అతని నిష్కల్మష భక్తిని చూడుమన్నాడు. అప్పుడే తిన్నడు వచ్చి యథాప్రకా రంగా అన్నీ తోసేసి శివుడి ముందు కూర్చున్నాడు. కానీ, శివుడు ఏమీ ఆరగించక మౌనంగా తన కంటి నుండి కన్నీటిని కార్చాడు. అందుకు తిన్నడు తనకు తెలిసిన వైద్యాలన్నీ చేశాడు. అది తగ్గకపోగా ఆ కంటినుండి రక్తం



కారడం చూశాడు. అది చూచి తిన్నడు వేడికి వేడే మందు కదా! కాబట్టి కన్నుకు కన్నే కదా మందు అంటూ ఏమీ ఆలోచించక తన కన్నుగుడ్డును తన బాణంతో క్షణంలో పీకేసి స్వామి కన్నుకు అమర్చాడు. అది చూడ్డానికి ఎంతో బాగుందనిపించింది తిన్నడికి. ఎంతో పులకించిపోయాడు. కానీ,రెండోకంటినుండికూడా రక్తం కారసాగింది. అది చూచి ఏమీ భయపడకుండా తన రెండవకంటిని కూడా పీకి స్వామికి అమర్చాలని తన పాదపు బొటనవ్రేలిని ఒక కన్నుమీద గుర్తుపెట్టుకున్నాడు. ఇక కన్నుగుడ్డును పీకుతుండగా స్వామి ప్రత్యక్షమై తిన్నడిని తనలో ఐక్యం చేసుకొని 'భక్తకన్నప్ప' అన్న పేరుతో ప్రసిద్ధికెక్కేలా వరమిచ్చి ముక్తిని ప్రసాదించాడు.

## 3) మార్కండేయుడు

మృకండుడు అనే మహర్షికి చాలాకాలంవరకు సంతానం కలగలేదు. ఎలాగైనా పుత్రుణ్ణికని పున్నామనరకం నుండి తప్పించుకోవాలని పుత్రునికోసం శివునికై తపస్సు చేశాడు. అందుకు శివుడు ప్రత్యక్షమై, మహర్షీ! నీకు సంతాన యోగం లేదు. అయినా తపస్సుచే నన్ను మెప్పించావు కాబట్టి నీకు ఒక కుమారుణ్ణి ప్రసాదిస్తాను. కానీ, అతని ఆయుష్షు పదహారేళ్లు మాత్రమే అని చెప్పి అంతర్ధానమై పోయాడు. ఆ వరప్రభావంతో ఒక మగపిల్లాడు కల్గాడు. ఆ పిల్లాడికి మార్కండేయుడు అని పేరుపెట్టారు. కానీ, పిల్లాడు ఆయుష్షు తక్కువ కదా అని అనుక్షణం దిగులుతో తల్లడిల్లిపోతున్నాడు మృకండు మహాముని. ఆ సమయంలో అక్కడికి నారదు డొచ్చాడు. ఓ మృకండుమహామునీ! పిల్లాడి ఆయుర్దాయం స్వల్పమని బాధపడకు. ఆ బిడ్డడు పరమేశ్వరుని తపస్సు గావించి పూర్ణాయుర్దాయుడౌతాడు అని చెప్పాడు. అప్పుడు మార్కండేయుడు తన తల్లిదండ్రుల ఆశీర్వాదంతో అడవుల కెళ్లి శివుని గురించి ఘోరంగా తపస్సు చేస్తున్నాడు. అతని ఆయుర్దాయం పూర్తైందని యముడు శివపూజ చేస్తుండగా మార్కండేయుని వద్దకు వచ్చాడు. ఓ బాలకా! నీ ఆయు ర్దాయం తీరిపోయింది, బయటకు రా అంటూ గద్దించాడు. శివపూజలో ఉన్నాను రానన్నాడు బాలకుడు. అయినా యముడు తన పట్టువదలక కాలపాశాన్ని గుడిలోకి విసి రేశాడు. అప్పుడు మార్కండేయుడు శివలింగాన్ని గట్టిగా కౌగలించుకొని ఉన్నాడు. ఆ యమపాశం మార్కండేయుడితో పాటు శివలింగాన్ని కూడా చుట్టుకుంది. శివుడికి కోపమొచ్చి యముణ్ణి నేలకూల్చాడు. ఆ తర్వాత దేవతల మొర



ఆలకించి తిరిగి యముణ్ణి బ్రతికించి శివభక్తుల జోలికి పోకూడదంటూ యముణ్ణి ఆజ్ఞాపించాడు. తర్వాత మార్కండేయుని తలనిమిరి నీవు చిరంజీవివై చిరకీర్తిని పొందుమని ఆశీర్వదించాడు.

### 4) గొడగూచి

'భోగాపురం' అనే గ్రామంలో ఓ శివాలయం ఉంది. అందులో ఉన్న శివలింగానికి 'భోగలింగము' అనీ, 'భోగలింగేశ్వరుడు' అనీ పేర్లు. ఆ గ్రామంలో ధర్మరతుడు, సుశీలమ్మ అనే దంపతులు ఈ లింగానికి నిత్యార్చనలు చేస్తూండేవారు. ఆ క్రమంలో ప్రతిరోజూ క్రమం తప్పక స్వామికి కుంచెడుపాలు మాత్రం తప్పక సమర్పించేవారు. వీరికి ఒక కొడుకు కలిగాడు. అతడిపేరు శివదేవుడు. ఇతని భార్య సర్వమంగళ. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిగారు. ఆ కుమార్తెకే గొడగూచి అని పేరుపెట్టారు. ఆ బిడ్డకు కూడా శివపూజను నేర్పించారు. ఓ రోజు వీరు శ్రీశైలమల్లన దర్శనానికి వెళ్తూ, శివార్చనకై ప్రతిరోజూ శివలింగానికి పాలుమాత్రం నైవేద్యంగా పెట్టడం మరచిపోవద్దని తమ కుమార్తెకు చెప్పి వెళ్లారు. ఆ విధంగానే పాలుతీసుకొని బయలుదేరింది. పాలు స్వామిముందు పెట్టి ఎంతగానో బ్రతిమాలగా, బ్రతిమాలగా చివరికి స్వామి స్వీకరించాడు. అలా స్వామి పాలు తాగుతున్నాడంటూ తమ బిడ్డ చెప్పగా విన్న ఆ తండ్రి కుమార్తె అబద్ధం చెప్తోందంటూ తిట్టాడు. నిజం చూపిద్దువు రమ్మంటూ గుడికి తీసుకెళ్లగా ఆ రోజే స్వామి పాలను స్వీకరించలేదు. అందుకు కోపించి ఆమె తండ్రి ఆమె జుట్టుపట్టుకొని ఈడ్వబోగా శివలింగాన్ని పట్టుకొని గట్టిగా కౌగలించుకొంది. అప్పుడు స్వామి ప్రత్యక్షమై తనలో ఐక్యం చేసుకొన్నాడు.



### 5) బెజ్జమహాదేవి

ఈమె ఓనాడు ఓ హరికథాకాలక్షేపానికి వెళ్లింది. అందులో శివుడు ఒక అనాథ అనీ, అమ్మనాన్నలు లేరనీ, ఒళ్లంతా బూడిదనే పూసుకుంటాడనీ, స్మశానంలోనే ఉంటాడనీ ఇలా... ఏవేవో విన్నది శివుడి గురించి. అలా విన్న ఆమెకు ఎంతగానో దుఃఖం ఆవహించింది. అయ్యో! పాపం. శివునికి ఎవరూ లేరంటనే. పాపం ఆ బిడ్డకు భోజనం ఎవరు పెడ్తారు? అతని ఆలనాపాలనా ఎవరు చూస్తారు? అంటూ బాధపడ్తూ! ఆ దారిలో ఉన్న ఒక చిన్న శివలింగాన్ని తీసుకొని ఇంటికెళ్లింది. ఇక రోజూ ఆ శివలింగానికి ఒక బిడ్డకు చేసినట్లు అన్నీ సపర్యలు చేస్తోంది. చేస్తూ... చేస్తూ... ఎంతో తన్మయత్వాన్ని పొందేది. ఓసారి శివుడు ఆమెను పరీక్షింపదలచి ఏ సపర్యలూ స్వీకరించక మౌనం దాల్చాడు. ఆమెకు ఏమీ పాలుపోలేదు. ఎంతగానో బ్రతిమలాడింది. ఐనా, శివుడు కనికరించలేదు. చివరికి ప్రాణ త్యాగానికి సిద్ధపడింది. అప్పుడు శివుడు ప్రత్యక్షమై ముల్లోకాలకు తండ్రినైన నాకే తల్లివయ్యావు కనుక నువ్వు ముత్తవ్వగా, అమ్మవ్వగా ప్రసిద్ధి పొందుతావంటూ వరమిచ్చి తనలో ఐక్యం చేసుకొన్నాడు.



## 6) సిరియాళుడు

శివభక్తితత్పరుడు చిరుతొండనంబి కుమారుడు సిరియాళుడు. ఈ పిల్లాడు తండ్రికన్న అమిత భక్తివిశ్వాసాలు శివునిపై ఉండేవి. ఇతని తండ్రి ప్రతిరోజూ శివభక్తులకు అన్నసంతర్పణ చేయకుండా ఏనాడూ తానూ భోజనం చేసేవాడు కాదు. అలా ఓ రోజు శివభక్తులకోసం ఎదురు చూస్తూండగా శివుడు మాయాజంగమవేషంలో వారింటికి ఆతిథ్యానికి వచ్చాడు. వచ్చినవాడు వచ్చినట్లుండక తాను ఏడాదినుంచి నిరాహారవ్రతం జరుపుతున్నానని ఈ రోజు ఉద్యాపన చేయాలి కాబట్టి, వడుగైన చిన్నబాలుణ్ణి, అదీ



కొడుకునే వండాలి. దానినే శివుడికి నైవేద్యంగా పెట్టాలి. ఆ తర్వాతనే నేను భుజిస్తాను నాతోపాటు నీవూ, నీ కొడుకూ కలిసి తినాలి. అది నీ కిష్టమైతే వస్తాను అన్నాడు. అందుకు చిరుతొండనంబి ఒప్పుకొని ఇంటికి తీసుకెళ్లాడు. ఈవిషయాన్ని కొడుకు సిరియాళునికి చెప్పి ఎక్కడికైనా పారిపొమ్మన్నాడు. అందుకు అంగీకరించలేదు సిరియాళుడు. పైగా నా తండ్రి ఏమి చేసినా నాకు సమ్మతమేనని శివుడితో అన్నాడు. తమ కుమారుణ్ణి వండి భోజనానికి సిద్ధం చేశారు. ఐనా శివుడు పుత్రులు లేని ఇంట్లో నేనెట్లా తింటాను? ఏదీ మీ బిడ్డను పిలవండి అని చెప్పగా, వారు ఎంతో దుఃఖంతో తమ కుమారుణ్ణి ఎలుగెత్తి పిలిచారు. ఆ పిలుపుకు వెంటనే సిరియాళుడు అమ్మా! అంటూ పరుగెత్తుకొచ్చాడు. వారి భక్తి నిష్ఠకు మెచ్చి ఈశ్వరుడు వారి ముగ్గురికీ కైలాసవాసాన్ని ప్రసాదించాడు.

## 7) కళియార్

ఇతను శివునికి గొప్పభక్తుడు. నిత్యమూ ఈశ్వరునికి దీపోత్సవం నిర్వహించేవాడు. ఆ క్రమంలో తన ఆస్తులన్నీ కోల్పోయాడు. ఐనా, వదలలేదు దీపారాధనను ఇతడు. ఇతను ఓ రోజు వ్యాపారనిమిత్తమై దూరప్రాంతానికి బయలుదేరాడు. చీకటైపోయింది. ఆ సమయంలో ఎటు పోవాలో తెలీక ఒక పాడుబడ్డ శివాలయంలోకి వెళ్లాడు. అక్కడ శివలింగం దగ్గర కూర్చొన్నాడు. కంటికి ఏమీ కనిపించడం లేదని, సాయంసంధ్యవేళ దీపారాధన చేయాలని నూనెకోసం, వత్తికోసం అంతా వెదికాడు. ఇక లాభం లేదని తైలంతో నిండి ఉన్న తన జుట్టునే దీపపువత్తిగా చేసి



వెలిగించాడు. భక్తితో వెలిగించిన ఆ దీపశిఖ కైలాసంలో ఉన్న పరమేశ్వరుణ్ణి మెప్పించింది. అందుకు పరమేశ్వరుడు ప్రత్యక్షమై అతనికి స్వర్గప్రాప్తి కల్గించాడు. అలా దీపం వెల్గించినందువల్ల కళియార్ దీపకళియార్‌గా సార్థకమై ప్రసిద్ధిని పొందాడు.

## 8) రుద్రపశుపతి

ఇతను ఒక గొప్ప అమాయక భక్తుడు. ప్రతిరోజూ శివాలయానికి వెళ్తూంటాడు. అక్కడ ఆ కథలూ, ఈ కథలూ పుక్కిటిపురాణాలు వింటూండేవాడు. కానీ, ఎవరే కథ చెప్పినా అదంతా నిజమేనని అమాయకంగా నమ్మేవాడు. ఓ రోజు అలాగే గుడిలో హరికథా కాలక్షేపం జరుగుతోంది. ఆ కథలో శివుడు క్షీరసాగరమథనసమయంలో హాలాహలం రాగా ఆ విషాన్ని లోకకల్యాణంకోసం ఒక గుళిక లాగా మింగేశాడు. అది స్వామి కంఠంలోనే ఉండిపోయింది. అందుకే ఆయనకు గరళకంఠుడు అనే పేరొచ్చింది అని చెప్పుకుంటూపోతున్నాడు. ఆ కథ విని ఆ భక్తుడు అయ్యో!



ఎంతపని జరిగింది. అంతమంది దేవతలుండగా శివుడే ఎందుకు దాన్ని మింగాడు. పాపం ఆ విషం కంఠంలో ఉంచుకొని ఎంత బాధపడ్తున్నాడో కదా అంటూ వేగంగా శివాలయానికి వెళ్లాడు. అక్కడ ఉన్న స్వామివద్దకు వెళ్లి స్వామీ! నువ్వు విషం మింగావట గదా! ఆ విషాన్ని ఉమ్మెయ్యి. ఉమ్ముతావా? లేదా? అంటూ హఠం వేసుకొని స్వామిఒడిలో కూర్చున్నాడు. కూర్చున్నవాడు ఊరకే ఉండక ఒక పదునైన కత్తి తీసుకొని తన కంఠానికి అనించుకొని, నువ్వు ఆ విషాన్ని గనుక ఉమ్మెయ్యకపోతే నేనిక్కడే నా కంఠాన్ని ఈ కత్తితో నరుక్కుంటాను అని స్వామిని బెదిరించాడు. ఆ అమాయక భక్తుడు అంతపనీ చేసేలాగున్నాడని శివుడు అతని భక్తికి ప్రత్యక్షమై అతణ్ణి తనలో ఐక్యం చేసుకొన్నాడు.

ఇలా ఒకరూ, ఇద్దరూ కాదు... ఎందరో అమాయక భక్తులు స్వామిని నిష్కల్మషభక్తితో సేవించి, తరించారు.

పాఠం-01

# సంస్కృతం నేర్చుకుందాం..!!

నిర్వహణ - మహామహోపాధ్యాయ సముద్రాల లక్ష్మణయ్య & కిరణ్ భట్

## स्वरवर्णाः (స్వరవర్ణాః)

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| अ | आ | इ | ई | उ | ऊ | ऋ | ॠ | ऌ | ए | ऐ | ओ | औ | अं | अः |
| అ | ఆ | ఇ | ఈ | ఉ | ఊ | ఋ | ౠ | ఌ | ఏ | ఐ | ఓ | ఔ | అం | అః |

## व्यञ्जनवर्णाः (వ్యంజనవర్ణాః)

| | | | | |
|---|---|---|---|---|
| क క | ख ఖ | ग గ | घ ఘ | ङ ఙ |
| च చ | छ ఛ | ज జ | झ ఝ | ञ ఞ |
| ट ట | ठ ఠ | ड డ | ढ ఢ | ण ణ |
| त త | थ థ | द ద | ध ధ | न న |
| प ప | फ ఫ | ब బ | भ భ | म మ |

| | | | | |
|---|---|---|---|---|
| य య | र ర | ल ల | व వ | श శ |
| ष ష | स స | ह హ | क्ष క్ష | ज्ञ జ్ఞ |



# మాంగల్యం తంతునానేన...

- శ్రీమతి టి. విజయరాణి,
95500 43545

మాఘమాసంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా పదినాళ్లపాటు జరిగే శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవంలో విశేషంగా కల్యాణోత్సవం జరుగుతుంది. ఇది మహాశివరాత్రి మరునాడు సాయంకాలం జరుగుతుంది.

ఇందులో ముందుగా ఉత్సవప్రతిమామండపం నుండి శ్రీసోమాస్కందమూర్తిస్వామిని (ఉమాదేవితో, స్కందునితో కలసిఉన్న పరమశివుని ఉత్సవమూర్తి) ఒక పీఠం మీద, శ్రీకామాక్షీదేవిని మరొక పీఠంమీద ఊరేగింపుగా ధ్వజస్తంభమండపానికి ముందుభాగంలో ఉన్న కల్యాణోత్సవ మండపానికి విజయం చేస్తారు.

ముందుగా అర్చకస్వాములు శైవాగమశాస్త్రోక్తంగా పుణ్యాహవాచనం నిర్వహించి గణపతిపూజ చేస్తారు. పిదప రెండు కలశాలను స్థాపించి అందులో శ్రీకపిలేశ్వరస్వామి వారిని, శ్రీకామాక్షీదేవిని ఆవాహనం చేసి, అష్టోత్తర శత నామాలతో అర్చించి ధూపదీపనైవేద్య హారతులిస్తారు. తర్వాత కొబ్బరికాయలపై పసుపు పూసిన కల్యాణకంకణదారాలను ప్రతిష్ఠిస్తారు. తర్వాత స్వామికి, దేవికి నూతన వస్త్రసమర్పణ చేసి తర్వాత కల్యాణకంకణాలను ధరింపజేసి కర్పూర హారతిని ఇస్తారు. ఆ తర్వాత స్వామికి యజ్ఞోపవీతధారణం చేసిన పిదప ఆ నూతన వధూవరులకు మధుపర్కసమర్పణ చేస్తారు. ఆ తర్వాత వధూవరుల 'గోత్రప్రవరలు' చదువుతూ మహాసంకల్పం చేసి కన్యాదానం చేస్తారు. అనంతరం స్వామికి అమ్మవారికి పరస్పరం పూలమాలలను మూడుసార్లు మారుస్తారు. కన్యాదానమైన తర్వాత వేదపండితులు శ్రీసూక్తాన్ని పఠిస్తుండగా మాంగళ్యాన్ని భక్తులందరికీ.. చూపించి... శ్రీకపిలేశ్వరస్వామివారి చేతులకు తాకించి, శ్రీస్వామిపక్షాన శ్రీకామాక్షిఅమ్మవారికి మాంగల్య సూత్రధారణ చేస్తారు. ఆ తర్వాత తలంబ్రాల కార్యక్రమం జరిపి మంగళహారతి ఇస్తారు. పిదప లాజహోమం చేయబడుతుంది. హోమం పూర్తైన తర్వాత హోమభస్మాన్ని రక్ష (భస్మరక్ష)గా స్వామికి అమ్మవారికి ధరింపజేస్తారు. పిదప, టెంకాయలు కొట్టి ఫలాలు, లడ్డూలు, పులిహోర, చక్కెర పొంగలి మొదలైన ప్రసాదాలను మహానివేదన కావించిన పిదప మంగళహారతి ఇస్తారు. పిదప శ్రీసోమాస్కందమూర్తి, శ్రీకామాక్షిఅమ్మవారు ఆలయంలో ప్రవేశిస్తారు. పైవిధంగా జరిగే కల్యాణోత్సవాన్ని మనమూ దర్శించి శివపార్వతుల ఆశీర్వాదాన్ని పొందుదాం.



22-02-2020న
తిరుపతి శ్రీకపిలేశ్వరస్వామి కల్యాణోత్సవం
సందర్భంగా...

భాగవత కథాసాగరం

# ఇంద్రుని గర్వభంగం

- డా॥ వైష్ణవాంఘ్రి సేవకదాస్,
98219 14642

ఈ చరిత్ర శ్రీమద్భాగవతంలోని షష్ఠస్కంధములో వస్తుంది. ముల్లోకాధిపత్యం కారణంగా ఒకసారి ఇంద్రుడు అమిత గర్వితుడయ్యాడు. సభలో ఒకసారి విలాసంగా ఆసీనుడైయున్న అతనికి దేవతలు చక్కగా సేవలు చేస్తున్నారు, కీర్తిస్తున్నారు. అప్సరసలు నాట్యం చేస్తున్నారు, గంధర్వులు గానం చేస్తున్నారు. ఇంద్రునిపైన పట్టియున్నట్టి శ్వేత ఛత్రము పూర్ణచంద్రునిలాగా దేదీప్యమానంగా వెలుగుతోంది. ఆ సమయంలో ఇంద్రుడు శచీదేవిసమేతుడై ఆసనంలో కూర్చొనియున్నాడు. అపుడు దేవగురువైన బృహస్పతి సభలో ప్రవేశించాడు. ఋషిశ్రేష్ఠుడైన బృహస్పతి దేవతలందరికీ గురువు. ఆయన దేవదానవులకు సమానంగా గౌరవనీయుడు. గురువును చూసినప్పటికీ ఇంద్రుడు తన సింహాసనంనుండి లేచి నిలబడలేదు. ఆయనను ఆహ్వానించడముగాని, ఆసనాన్ని అర్పించడముగాని చేయలేదు. ఆ విధంగా అతడు వేదమర్యాదను అతిక్రమించాడు. ఇంద్రుడు ఐశ్వర్యమత్తులో ఉన్నాడని బృహస్పతి గమనించాడు. అతని మత్తును వదిలించడానికి తీవ్రంగా శపించగలిగేవాడే అయినప్పటికీ ఆయన ఓర్పును వహించి మౌనంగా సభనుండి వెనుకకు తిరిగి వెళ్ళిపోయాడు.

ఆ విధంగా బృహస్పతి వెనుదిరిగి వెళ్ళిపోగానే ఇంద్రునికి బుద్ధి వచ్చింది. భగవత్సమానుడైన గురువును నిర్లక్ష్యపరచినందుకు అతడు చింతించాడు. తాను చేసిన తప్పుకు ఇంద్రుడు అందరిముందే తనను ధిక్కరించుకున్నాడు. వెంటనే గురుదేవునిదగ్గరకు వెళ్ళి పాదాలకు నమస్కరించి ఆయనను ప్రసన్నుని చేయడానికి ప్రయత్నిస్తానని పలికి ఇంద్రుడు పరుగులతో బృహస్పతి మందిరానికి చేరుకున్నాడు.

ఇంద్రుడు సభాసదుల మధ్య పశ్చాత్తప్తుడు కావడం బృహస్పతికి అర్థమైంది. శిష్యునికన్నను అధికశక్తి సంపన్నుడైన బృహస్పతి తనను ఇంద్రుడు చేరే లోపల అచటనుండి అదృశ్యమయ్యాడు. ఇంద్రుడు వచ్చి గురుమందిరంలో అంతా వెదికాడు. గురువుజాడ కనిపించలేదు. ఇక తనకు అశుభమే కలుగనున్నదని అతనికి అర్థమైంది. చుట్టూ దేవతలే ఉన్నప్పటికీ అతని మనస్సు చింతాక్రాంతమైంది. గురువు ప్రసన్నుడైతే సాక్షాత్తుగా భగవంతుడే ప్రసన్నుడైనట్లు భావం. ఇక గురువు ప్రసన్నుడు కాకపోతే శిష్యునిగతి అధోగతే అవుతుంది. తనకు కలుగబోయే దుర్గతి ఏమిటోయని ఇంద్రుడు వికలమనస్కుడయ్యాడు.

ఇంద్రుని దయనీయస్థితిని వినిన దానవులు తమ గురువైన శుక్రాచార్యుని ఆదేశంమేరకు వెంటనే దేవతలపై దండెత్తారు. యథావిధిగా దేవతలు దానవులతో పోరాడినప్పటికీ గురు ఆశీర్వాదం లోపించిన కారణంగా తీవ్రమైన నష్టాన్ని చవిచూశారు. దానితో వారు రణరంగమునుండి బయటకు వచ్చి శిరములు వంచుకొని బ్రహ్మను సమీపించారు. సర్వజ్ఞుడైన బ్రహ్మ దేవతల దీనస్థితిని చూసి వారితో ఇలా అన్నాడు :

“దేవతలారా! ఐశ్వర్యమత్తులో మీరు గురువును అవమానించారు. ఆయన సభలో ప్రవేశించినపుడు మీరు మర్యాదగా లేచి నిలబడలేదు. ఆయనను ఆహ్వానించలేదు. గురువుపట్ల మీరు చూపిన దుష్ప్రవర్తన కారణంగానే మీరు దానవులచేతిలో పరాజితులయ్యారు. ఇంద్రా! దానవులు తమ గురువైన శుక్రాచార్యునికి సముచితస్థానం ఇచ్చి చక్కగా ఆదరించుచున్న కారణంగానే ఇపుడు బలవంతులయ్యారు. బ్రాహ్మణులను, గోవులను, గోవిందుని భక్తితో అర్చించేవారు తమ తమ స్థానాలలో సుస్థిరులై ఉంటారు. ఇదే ఎల్లరకు విజయరహస్యమని తెలిసికో. మీరిపుడు త్వష్ట తనయుడైన విశ్వరూపునిదగ్గరకు వెళ్ళి అతనిని గురువుగా స్వీకరించండి. అతడు తపోమయుడైన బ్రాహ్మణుడు. అతనికి దానవ పక్షపాతం ఉంది. అయినా మీరు దానిని సహించగలిగితే మీపట్ల అతడు ప్రసన్నుడై మీ అభీష్టాలను నెరవేరుస్తాడు.”

దేవమాత అదితికి, కశ్యపునికి పుట్టిన సంతానంలో త్వష్టప్రజాపతి ఒకడు. దానవుల కుమార్తెయైన రచన త్వష్ట ప్రజాపతికి భార్య అయింది. వారికి పుట్టిన తనయులే సన్నివేశుడు, విశ్వరూపుడు అనే వారలు. అంటే విశ్వరూపుడు

దేవతల నిత్యవైరులగు దానవుల కుమార్తెకు జన్మించినట్టి వాడు. అయినా కూడ అతనినే ఆశ్రయించమని బ్రహ్మదేవుడు దేవతలకు ఆదేశమిచ్చాడు. తల్లిపక్షమువారైన దానవుల పట్ల విశ్వరూపునికి నిశ్చయంగా పక్షపాతం ఉంటుంది. అయినా దేవతలు దానిని సహించగలిగితే అద్భుతమైన ఫలితాలు వస్తాయని బ్రహ్మదేవుడు చెప్పగానే దేవతలు దానికి అంగీకరించారు.

బ్రహ్మ ఆదేశంమేరకు దేవతలు నిర్మలమైన మనస్సుతో త్వష్ట తనయుడైన విశ్వరూపునిచెంతకు వెళ్ళి వినమ్రంగా ప్రార్థించారు.

"విశ్వరూపా! నీకు శుభమగుగాక! మేమందరము నీ ఆశ్రమానికి అతిథులుగా వచ్చాము. మేము నీకు పితృ సమానులము. కాబట్టి మా కోరికను తీర్చవలసినదిగా కోరుతున్నాము. నీవు మాకంటే చిన్నవాడివని ఆలోచించకు. వేదమంత్ర నిపుణుడైనవాడు వయస్సులో చిన్నవాడైనప్పటికిని



వందనము చేయవచ్చును. కాబట్టి నిస్సంకోచంగా మాకు పురోహితుడవు కావలసినది."

ఆ విధంగా దేవతలు ప్రార్థించినపుడు విశ్వరూపుడు సంతోషించాడు. వినమ్రచిత్తంతో అతడు వారితో "దేవత లారా! విశ్వపాలకులైన మీ అభ్యర్థనను ఎవ్వడు నిరాకరి స్తాడు. నిజానికి పౌరోహిత్యము బ్రహ్మవర్చస్సును తగ్గిస్తుంది. అయినా నేను తప్పకుండా మీకు పౌరోహిత్యము చేయవలసి ఉంటుంది. మీరందరు నాకు గురుతుల్యులు. కాబట్టి ధనప్రాణములనైనా ఇచ్చి నేను మీ కోరికను తీరుస్తాను" అని పలికి దేవతలకు హితమైన పౌరోహిత్యకార్యాన్ని ఆరంభించాడు.

సురద్వేషులైన దానవుల ఐశ్వర్యము శుక్రాచార్యుని విద్యచే రక్షింపబడునట్టిది. అందువలన శ్రీవిశ్వరూపుడు దేవతలకు పరమరక్షణ కవచమైన నారాయణ కవచమును ప్రసాదించుటకు సంకల్పించాడు. నారాయణమంత్ర కవచాన్ని ఉపాసించేవిధానాన్ని అపుడు అతడు ఇంద్రునికి తెలియజేశాడు. ఈ విధంగా నారాయణకవచ మంత్రో పాసనను ఇంద్రునికి తెలియజేసిన విశ్వరూపుడు ఇలా అన్నాడు–

"ఇంద్రా! అద్భుతమైన నారాయణకవచాన్ని నీకు ఉపదేశించాను. దీనితో నీవు శక్తిమంతుడవై అసుర నాయ కులను జయిస్తావు. ఈ మంత్రకవచాన్ని ధరించిన వ్యక్తి ఎవ్వనిని చూస్తాడో లేదా ఎవ్వనిని తన పాదంతో స్పృశిస్తాడో అతడు కూడ అన్ని ఆపత్తులనుండి బయటపడతాడు. ఈ కవచప్రభావంతో మనిషి అన్ని భయాలనుండి బయట పడి సర్వులచే పూజితుడౌతాడు."

విశ్వరూపుని అనుగ్రహంతో నారాయణకవచ మంత్రాన్ని పొందిన ఇంద్రుడు భక్తిశ్రద్ధలతో దానిని ఉపా సించి గొప్ప బలసంపన్నుడై తిరిగి దానవులపై విజయాన్ని సాధించాడు. తన సమస్తసంపత్తులను ఆ విధంగా అతడు తిరిగి పొందాడు. గురువును నిర్లక్ష్యపరచిన కారణంగా అన్నింటిని కోల్పోయిన ఇంద్రుడు బ్రహ్మోపదేశంతో గురు తుల్యుడైన విశ్వరూపుని ఆశ్రయించడముద్వారా పూర్వ వైభవాన్ని పొందగలిగాడు.

ఆయుర్వేదం

# ఆరోగ్యానికి మెంతులు

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

**"ప్రాణాః ప్రాణభృతామన్నం మన్నం లోకోభిధావతి"** అంటుంది చరకసంహిత అనే ప్రామాణిక ఆయుర్వేద గ్రంథం. ప్రాణం ఉన్న ప్రతిపాణికి అన్నం అంటే ఆహారం కావాలి అని స్థూలంగా దీని అర్థం. ఆహారంవలన ఈ శరీరం ఉద్భవిస్తుందని ఆహారంవల్లనే ఈ శరీరానికి రోగాలు వస్తాయని హితకర ఆహారం ఆరోగ్యానికి, అహితకర ఆహారం అనారోగ్యానికి దారి తీస్తాయని కూడా **"ఆహార సంభవం వస్తుః రోగశ్చాహార సంభవః హితా హిత విశేషశ్చ విశేషః సుఖదుఃఖయోః॥"** అనే శ్లోకంలో చరకమహర్షి తమ చరకసంహితలో తెలియజేశారు.

దైవప్రసాదితమైన అటువంటి ఆహారపదార్థాల, వంటకాలతయారీలో రుచికి, సువాసనకి అత్యంత సర్వ సాధారణంగా మనం ఉపయోగించే వంటింటి ఆహార ఔషధం మెంతులను గురించి ప్రస్తుతం తెలుసుకుందాం.

మెంతులను సంస్కృతంలో మేధికా అని వ్యవహరిస్తారు. **"మేధికా వాతశమని శ్లేష్మఘ్ని జ్వర నాశిని"** అంటాడు భావమిశ్రుడు తన భావప్రకాశ అను ఆయుర్వేదగ్రంథంలో. అంటే మెంతులు వాతాన్ని శమింపచేస్తాయని శ్లేష్మహరంగా పని చేస్తాయని, జ్వరాలను తగ్గిస్తాయని అర్థం చెప్పుకోవచ్చు.

ఆంగ్లంలో ఫెనుగ్రీక్‌గా చెప్పబడే ఈ మెంతుల శాస్త్రీయనామం ట్రైగొనెల్ల ఫోనంగ్రీకం.

మనం దైనందినజీవితంలో ఎదుర్కొనే వివిధ అనారోగ్యసమస్యలకు మెంతులద్వారా ఎలా పరిష్కారం పొందవచ్చో తెలుసుకుందాం.

ఔషధంగా మెంతులను వాడుకొనేటప్పుడు వేయించి వాడుకోవాలి.

**మూత్రవ్యవస్థలో రాళ్లు:** మెంతిపొడి 100 గ్రాములు, నల్ల ఉలువలను వేయించి చేసిన పొడి 100 గ్రాములు కలిపి ఉంచుకొని రోజు రెండు పూటలా పూటకి 50 మి.లీ. ముల్లంగిరసంలో 2-3 గ్రాముల చూర్ణాన్ని కలిపి సేవిస్తు ఉంటే మూత్రపిండాలు (కిడ్నీలు), మూత్రనాళాలు మొదలగు మూత్రవ్యవస్థలో ఏర్పడే రాళ్లు కరిగిపోతాయి.

**మధుమేహం (షుగర్) నియంత్రణకు:** రోజు రాత్రి పూట 200 మి.లీ. నీటిలో 10 గ్రాముల మెంతులు వేసి నానించి ఉదయం పరగడుపున నానిన మెంతులను నమిలి మింగి మిగిలిన నీరు తాగాలి.


ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ మరియు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషియన్ వారు మెంతులపై జరిపిన సమగ్ర పరిశోధనల్లో మధుమేహంలో చాలా చక్కటి ఫలితాలు ఇచ్చినట్లు కనుగొన్నారు.

**నోట్లో పుండ్లకు:** రాత్రిపూట 200 మి.లీ. నీటిలో 10-15 గ్రాముల మెంతులను వేసి ఉదయం నీటిని వడగట్టి ఆ నీటిని పుక్కిలించి ఉమ్మేయటంవల్ల ఈ సమస్య త్వరగా తగ్గుతుంది.

**తల్లిపాలు సమృద్ధిగా ఉండేందుకు:** మెంతులను నేతితో వేయించి చేసిన చూర్ణం 100 గ్రాములు, గోధుమపిండి 100 గ్రాములు, పంచదార 200 గ్రాములు కలిపి ఉంచుకొని రోజు ఒకసారి 200 మి.లీ. పాలలో ఈ పొడి 10 గ్రాములు, 2 టీస్పూన్ల నెయ్యి వేసి ఉడికించి ఆ పాలను తల్లి సేవిస్తు ఉంటే శిశువుకు తగినంత స్తన్యం ఉత్పత్తి అవటంతో పాటు శిశువుకు కూడ ఎలాంటి చిన్న చితక, చీటికి మాటికి అనారోగ్యాలు దరిచేరకుండా ఆరోగ్యవంతమైన పెరుగుదల కనిపిస్తుంది.

**అధికంగా వచ్చే తుమ్ములకు :** మెంతులు, వాము, మిరియాలు విడివిడిగా వేయించి, చూర్ణించి ఒక్కొక్కటి 25 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని రోజు ఉదయం ఒక తమలపాకులో ఒకగ్రాము చూర్ణం, అర టీస్పూను తేనె కలిపి ఆకుని చుట్టి మొత్తం నమిలి మింగాలి. ఇందువల్ల

వ్యాధినిరోధకశక్తి పెరిగి అలర్జీతత్వం తగ్గి సమస్యకు చక్కటి పరిష్కారం కలుగుతుంది.



**శిరోజాలు బాగా పెరిగేందుకు :** మెంతులు, మినుములు, ఉసిరిక పెచ్చుల చూర్ణాలను ఒక్కొక్కటి 100 గ్రాముల చొప్పున తీసుకొని అన్నింటిని కలిపి సీసాలో నిల్వ ఉంచుకొని వారంలో రెండుసార్లు రాత్రిపూట తగినంత పొడిని తీసుకొని అది బాగా మునిగేటట్లు నిమ్మరసం పోసి ఉదయం వరకు నానించి పదార్థాన్నంతా బాగా కలిపి తలకు పట్టించి రెండుగంటలు ఆగి కుంకుడు లేదా శీకాయ పొడితో తలస్నానం చేస్తుండాలి.

గర్భస్రావం కలుగజేసే గుణం ఉన్నందు వల్ల గర్భవతులు మెంతులను వాడకపోవడం మంచిది.

**కొలెస్ట్రాల్ సమస్యకు:** 150 గ్రాముల మెంతిపొడి, 50 గ్రాముల శొంఠిపొడి కలిపి ఉంచుకొని రోజు ఉదయం, సాయంత్రం పూటకు 2-3 గ్రాములు పొడిని తగినంత తేనెతో సేవిస్తు ఉంటే మంచి కొలెస్ట్రాల్ పెరిగి, చెడు కొలెస్ట్రాల్ తగ్గి చక్కటి ఆరోగ్యానికి దోహదపడుతుంది. అంతే కాక ఈ ఔషధసేవనంవల్ల కీళ్ళనొప్పులు, కండరాల నొప్పులు కూడా తగ్గుతాయి.

**అధికచెమటకు:** మెంతులు, నల్లఉలవలు, కచోరాలు, కరక్కాయపెచ్చులచూర్ణాలను ఒక్కొక్కటి 100 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకొని రోజు ఒకసారి తగినంత పొడిలో తగినన్ని నీళ్ళు చేర్చి పేస్టులా చేసి లేపనం చేసుకొని రెండు గంటలాగి స్నానం చేస్తుంటే అధికచెమటసమస్యతో పాటు శరీరదుర్గంధసమస్య కూడా తగ్గుతుంది.



# భువనేశ్వరం - భాస్కరతేజం

– శ్రీమతి దొడ్డపనేని ఉదయతేజ

కడలి అంచున పరచుకున్న కాంతికిరణాలలో
అంబరానికి అద్దిన వర్ణసోయగంలో
ఎగిసిన అలలలో మెరిసిన నీటినక్షత్రాలలో
ఇసుకతిన్నెలకు అలుముకున్న బంగారురంగులో...
అన్నింటా "ఆదిత్యుడి" అందమే.

ఆకుల అంచున మంచుబిందువులు
ముత్యాలసరాలై మురిపించినా...
పడతి పాపిట సింధూరంలా
పండినగోరింటలా అనిపించినా...
దివినున్న పగడపుదీవిలా
కుంకుమపూల తోటలా కనిపించినా...
దివినున్న పగడపు దీవిలా
కుంకుమపూల తోటలా కనిపించినా...
అది "భానుడి" పై భావుకతే.

"భోగి" తేరు ఎక్కి లోకాన విహరించినా
మకర సంక్రమణంతో సంబరాన్ని తెచ్చినా
రథసప్తమి పర్వదినాన జగతిని అనుగ్రహించినా
అరసవెల్లి ఆలయంలో అద్భుతమై దీవించినా
భక్తవరదుడై కోణార్క్‌లో కొలువైనా...
భువిలో "దినకరుడి" దివ్యరూపమే అది

# మృత్యోర్మా అమృతంగమయ

**రచయిత్రి - శ్రీమతి లక్ష్మీకృష్ణమూర్తి**
**ఆకృతి- 1/8 డెమ్మి, పుటలు- 245,**
**వెల-రూ.216/- (పోస్టేజి అదనం),**
**ప్రతులకు - దిట్టకవి శ్రీరామశర్మ**
**ఎం.ఐ.జి. ఏ-104, ఏ.ఎస్.రావు నగర్,**
**హైదరాబాదు - 500 062.**
**ఇతర వివరాలకు - 85001 21599**

మహాభారతం అంటేనే ధర్మసూక్ష్మాల నిలయం. అటువంటి మహాభారత ఇతివృత్తాన్ని నవలారూపంలో సంగ్రహంగా రచించటమేకాక, ధర్మసూక్ష్మాల్ని సామాన్యులకు కూడా అర్థమయ్యేరీతిలో సరళసుందర వాడుక తెలుగుభాషలో సులభశైలిలో రచించారు.


విధివంచితుడైన మహావీరుడు కర్ణుని ఈ నవల్లో ప్రధాననాయకునిగా ఎంచుకొని, మూలభారతంలోని కర్ణునిపాత్రను ఏ మాత్రం మార్చక, కర్ణునిహృదయంలో చెలరేగిన భావాల్ని అతని తప్పొప్పుల వెనుక దాగి ఉన్న ఆంతర్యాన్ని సమగ్రంగా వివరించి, కర్ణునియొక్క ఔన్నత్యాన్ని, మహోన్నతవ్యక్తిత్వాన్ని పాఠక లోకానికి తెలియజేశారు. తుదివరకు తాను చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడి, అర్జునునితో వీరోచితంగా పోరాడి తుదకు అతనిచేతిలో చనిపోయి కూడా అమృతతుల్యుడై మృత్యువును జయించి 'మృత్యోర్మా అమృతంగమయ' అన్న అద్వైతానందసిద్ధిని పొందిన మహాధర్మ- కర్మ నైష్ఠికయోగి కర్ణుడు.

"ప్రాణం ఇవ్వడం సులభంకాని, ఆత్మాభిమానాన్ని వదులుకోవడం చావడంకంటే సహించలేనిది. దానిని కాపాడిన నా మిత్రుని కోసం నన్ను నేను సమర్పించుకుంటున్నాను. అది ముళ్లబాట అయినా, మృత్యుబాటయినా" - ఇవి కర్ణుని మాటలు.

కర్ణునిలో సచ్చరిత్ర, దానశీలత, శూరత ప్రధాన లక్షణాలు. మూలభారతంలోని కర్ణునిజీవితాన్ని యథాతథంగా ఆవిష్కరిస్తూనే కర్ణుని ప్రత్యేకతల్ని ఆవిష్కరించే సన్నివేశాల్ని అదనంగా చేర్చి అభివర్ణించారు. పాఠకుల మనస్సుల్ని రంజింపచేసి, ఉద్రూతలూగించింది.

ఇది తర్వాత తరాలవారికి మార్గదర్శకమౌతుందనుట అతిశయోక్తి కాదు. ఈ నవల రచయిత్రి ప్రతిభకు ప్రతీక.

*- ఆచార్య కోగంటి అప్పలాచార్యులు.*




# శ్రీవేంకటేశ్వర శుభోదయం

**రచయిత - అభినవ ప్రబంధ కవిచంద్ర బాలన్న**
**ఆకృతి- 1/8 డెమ్మి, పుటలు- 64,**
**వెల- అమూల్యం,**
**ప్రాప్తిస్థానం - బాలన్న కవి, ఇ.నెం.80-63ఎ,**
**కృష్ణానగర్, కర్నూలు- 518 002**
**చరవాణి - 94918 53800**

భక్తి మూలకందం భగవంతుడు. ఈ కలియుగంలో ఏడుకొండలపై వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి యావద్భారతీయుల ఆరాధ్యదైవం. ఆ దేవదేవుణ్ణి ప్రతిరోజు ఉదయం సుప్రభాతంతో మేల్కొలపడం, స్తోత్రం చేయడం, ప్రపత్తితో కీర్తించడం, మంగళాశాసనం పలకడం చాలా నిష్ఠగా సాగుతున్నది. ఇవన్నీ సంస్కృతంలో ఉన్నాయి. వీటిని భక్తులు పఠిస్తున్నారేగాని వాటి అర్థం చాలామందికి తెలియదు. ఈ లోటును తీర్చారు అభినవప్రబంధ కవిచంద్ర బాలన్నగారు.

శ్రీబాలన్న శ్రీవేంకటేశ్వర సుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనాలను సంస్కృత మూలంతో యథాతథంగా ఇచ్చారు. వాటిని సరళశైలిలో పద్యరూపంతో ఇచ్చారు. ఆ పద్యాలకు భావం చేర్చారు. అందువల్ల భక్తులందరికి ఆ శ్లోకాలభావం తెలుసుకునే వీలు కలుగుతున్నది. ఈ గ్రంథం ప్రతి ఇంట ఉండదగింది.

*- డా॥ ఎం.నరసింహులు.*

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** కార్యసిద్ధి, ధనలాభం, ఉద్యోగులకు ప్రమోషన్లు, గృహమున శుభకార్యాలు కలసి వస్తాయి. విద్యార్థులు ఉన్నతమైన ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు చేస్తారు.



**వృషభం–**రహదారి ప్రయాణాల్లో జాగ్రత్త వహించుట మంచిది. వేగంకన్నా ప్రాణం మిన్న అన్న విషయం గుర్తుంచుకోండి. విద్యార్థులు వక్తృత్వపుపోటీల్లో వాగ్ధాటి ప్రదర్శించి అందరి మన్ననలు పొంది బహుమతులు గెలుచుకుంటారు.



**మిథునం–**సూర్యనమస్కారాలు చేయటంవల్ల దేహారోగ్యం, శరీరపుష్టి, ధర్మసిద్ధి, కార్యసాధకులవుతారు. భార్యకు అనారోగ్యం, వైద్యులను సంప్రదించాల్సిరావటం, ఔషధసేవనం మొ॥వి కల్గుతాయి.



**కర్కాటకం–** విధినిర్వహణను బాధ్యతగా స్వీకరించి ముందుకు సాగిపోతారు. క్రమశిక్షణ పాటించి అందరికీ ఆదర్శప్రాయులౌతారు. అంటువ్యాధులబారిన పడకుండా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం అవసరం.



**సింహం–** భూ గృహలాభాలు పొందుతారు. దూరప్రాంతాల్లో భూమి కొనుగోలు చేస్తారు. ఇళ్ళు నిర్మించి అధికధరలకు విక్రయించడం వల్ల లాభాలు పొందుతారు. అన్నింటా చాకచక్యంగా వ్యవహరించి జయం సాధిస్తారు.



**కన్య–**మనస్సున ఆనందం, విద్యావినోదసౌఖ్యం, వక్తృత్వపుపోటీల్లో బహుమతులు గెల్చుకొనుట, సభాగౌరవం, గృహసౌఖ్యం, ప్రయత్నించిన కార్యాలు సత్వరంగా పూర్తగుట, వృత్తిఉద్యోగాలు కలసి వస్తాయి.



**తుల–**ప్రయాణంలో విఘ్నాలు, మాసాంతంలో పోయిన వస్తువులు దొరుకుట, చొరవ, ధైర్యంచేత కార్యసాధనం చేయుట, గృహమున మంగళాచరణములు, శరీర ఆరోగ్యం సిద్ధించుట, ఆనందం కల్గుతాయి.



**వృశ్చికం–**ధైర్యసాహసాలు ప్రదర్శించి కార్యోన్ముఖులు అవుతారు. వ్యవహారజయం సిద్ధిస్తుంది. అంటువ్యాధులకు గురయ్యే అవకాశముంది. ఇతరుల వ్యవహారాలలో అనవసరపు జోక్యం మానుట మంచిది.



**ధనుస్సు–** పనులఒత్తిడి, ప్రయాణంలో ఇక్కట్లు సంప్రాప్తిస్తాయి. మాసాంతంలో నిలదొక్కుకొని ఇబ్బందులనుంచి బయటపడతారు. ఆర్థికంగా ముందంజ వేస్తారు.



**మకరం–** ఆర్థిక లావాదేవీలు సక్రమంగా నిర్వర్తిస్తారు. దుర్వార్తాశ్రవణం చేయవలసి వస్తుంది. పంటపైరులు లాభిస్తాయి. అధిక దిగుబడులవల్ల లాభం కల్గుతుంది.



**కుంభం–** క్రీడల్లో గుర్తింపు పొంది పతకాలు సాధిస్తారు. వాగ్ధాటి ప్రదర్శించి సభలో పది మందిని మెప్పిస్తారు. వాలంటరీసంస్థలకు మీ వంతు సహకారం అందిస్తారు.



**మీనం–** అన్ని రంగములవారికి వృత్తులవిషయంలో అధికఆదాయం కలుగుతుంది. భోగభాగ్యాలు అనుభవిస్తారు. దూరపుచుట్టాల నుండి శుభవార్తలొస్తాయి. కల్యాణాది శుభకార్యాల్లో విరివిగా పాల్గొంటారు.

ఆశల్ని తగ్గించుకోవడంవల్ల మాత్రమే శాంతి లభిస్తుంది

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక మాసపత్రిక)



## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :
(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

(పిన్‌కోడ్ తప్పని సరి)

సెల్ నెం.

**2.** కావలసిన భాష :
తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐
హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం (సంవత్సరచందా మాత్రమే) ☐

**3.** సంవత్సర/జీవిత చందా :
రూ.60/- ☐ రూ.500/- ☐

**4.** చందా పునరుద్ధరణ :
(అ) చందా నెంబరు :
(ఆ) భాష :

**5.** చెల్లించిన మొత్తం :
డి.డి.నెం. :
తేది :
(చెక్కులు స్వీకరించబడవు)

ప్రదేశం :
తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.60/-, జీవితచందా రూ.500/-లు; డి.డి. / ఎం.ఓ.ను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి', తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులో గానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి, పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప-మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకుడు, సప్తగిరి కార్యాలయం, టి.టి.డి. ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# 50 వైకుంఠపాళి




**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు

### అడ్డం

2)శ్రీరాముని సోదరుడైన శత్రుఘ్నుని సుతుడు(5); 6)సహజంగా ఇనుముకిది పడతుంది(2); 7)మండోదరి తండ్రి(3); 8)కరెంటును ముట్టుకుంటే(2); 11)మన్మథునిబాణాల్లో ఒకటి(3); 12)ఆడ ఏనుగు(3); 16)ద్వేషము(2); 17)యాగము మరొకపేరు(3); 18)ధ్వని(2); 21)కంసుని ఏనుగు పేరు(7)

### నిలువు

1)ఇంద్రుని పెద్దకొడుకు(4); 2)మెఋపుకు మరోపేరు(2); 3)శిబిచక్రవర్తి కొడుకు(4); 4)విదుల్చు అను అర్థాన్నిచ్చేది(2); 5)వసుదేవుని తమ్ముడు(3); 9)వాయువు(3); 10)జమదగ్ని తల్లి(3); 13)రావణ కుంభకర్ణ విభీషణుల తల్లి(3); 14)సూర్య పత్నులలో ఒకతె(4); 15)విష్ణుని ఖడ్గం పేరు(4); 19)చెట్లకు ఇవి ఉంటాయి(2); 20)పోలీసుల నెత్తిపై ఇది ఉంటుంది(2).

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.


- ప్రధాన సంపాదకుడు

# భక్తుల సేవలో....





తిరుమల, 19 డిసెంబరు 2019 గురువారం: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన విశాఖ శారదాపీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్రస్వామివారిని తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, కార్యనిర్వహణాధికారి శ్రీ అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ ఎ.వి.ధర్మారెడ్డి గురువారం భక్తిపూర్వకంగా కలిశారు. అధ్యక్షులవారు మీడియాతో మాట్లాడుతూ సనాతన ధర్మప్రచారంలో భాగంగా ప్రతినెలా తిరుమల లేదా తిరుపతిలో పీఠాధిపతులతో ధార్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు.





డిసెంబరు 2019, తిరుపతి 27 శుక్రవారం: తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు తిరుపతిలో వసతి సౌకర్యాలు కల్పించడంలో భాగంగా అలిపిరివద్ద తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ అలిపిరిలో భక్తులకు వసతి ఏర్పాటు చేస్తే తిరుమలలో రద్దీ అధికంగా ఉన్న సమయంలో టైంస్లాట్ కేటాయించి తిరుపతిలోనే వసతి కల్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇందులో భాగంగా అలిపిరిలో నిర్మించ తలపెట్టనున్న వసతిసముదాయాలలో అన్నప్రసాదాలు, ధార్మికకార్యక్రమాలు, భజనలు, ధ్యానం, భక్తిసంగీతకార్యక్రమాల ఏర్పాట్లు చేయనున్నట్లు వివరించారు.



డిసెంబరు 2019, తిరుమల 27 శుక్రవారం: తిరుమలలోని జలాశయాల్లో రాబోవు రెండు సంవత్సరాలు భక్తులకు సరిపడా నీరు అందుబాటులో ఉందని తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి వెల్లడించారు. తిరుమలలోని కుమారధార, పసుపుధార జలాశయాలను శుక్రవారంనాడు వారు అధికారులతో కలిసి పరిశీలించారు.

ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గత 10 సంవత్సరాలలో తొలిసారిగా తిరుమలలోని డ్యామ్‌లు పూర్తిస్థాయిలో నిండాయన్నారు. శ్రీవారి ఆశీస్సులతో ఈ సంవత్సరం జూలైనుండి విస్తారంగా వర్షాలు కురిశాయన్నారు. తద్వారా తిరుమలలోని కుమారధార, పసుపుధార, ఆకాశగంగ, పాపావినాశనం, తిరుపతిలోని కల్యాణిడ్యామ్ జలాశయాల్లో పూర్తిస్థాయిలో నీటినిల్వలు ఉన్నాయన్నారు. వీటితోపాటు తిరుమలకు శాశ్వతంగా నీటి అవసరాలు తీర్చేందుకు రూ. 400 కోట్లతో బాలాజి రిజర్వాయర్ నీటిని వినియోగించుకునేందుకు తి.తి.దే. పాలకమండలి తీర్మానించిందని తెలిపారు. తిరుమలకు విచ్చేసే భక్తులు జలప్రసాదం నీటిని స్వీకరించేందుకు మరింత సురక్షితమైన త్రాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తిరుమలలో ప్లాస్టిక్‌బాటిళ్ళు, బ్యాగులు నిషేధించనున్నట్లు తెలిపారు.

హిందూధర్మప్రచారపరిషత్ సమావేశంలో సనాతన ధర్మప్రచారానికి వేదపాఠశాలలను, వేదపారాయణంలో ఉపయోగించుకోనున్నట్లు తెలిపారు. శ్రీవాణిట్రస్టుద్వారా దళితవాడలలో ఆలయాలు నిర్మించడంతో పాటు, శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ఆంధ్ర, తెలంగాణరాష్ట్రాలలో ఉన్న గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాల విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఎన్‌జివోల సహకారంతో తక్కువఖర్చుతో ఆధ్యాత్మికపుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. తద్వారా చిన్నతనం నుండి విద్యార్థులకు సనాతన హైందవధర్మాన్ని తెలియజేయవచ్చన్నారు. శ్రీవారి వైభవోత్సవాలు దేశవ్యాప్తంగా ఉన్న నగరాలు, జిల్లా కేంద్రాలు, పుణ్యక్షేత్రాలు, తి.తి.దే. ఆలయాలు ఉన్న ప్రాంతాలలో నిర్వహించేందుకు పాలకమండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు.



డిసెంబరు 2019, తిరుమల 28 శనివారం: వేంకటాచలమాహత్మ్యంలోని శ్రీనివాసుని వృత్తాంతాన్ని తెలిపేలా రూపొందించిన పెయింటింగ్ చిత్రాలను తి.తి.దే. పాలకమండలి అధ్యక్షులు శ్రీ వై.వి.సుబ్బారెడ్డి శనివారం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఆవిష్కరించారు.



Edited and published on behalf of T.T.Devasthanams by **Dr. K.Radha Ramana,** M.A., M.Phil., Ph.D., Chief Editor, T.T.D. and printed at T.T.D. Press by **Sri R.V.Vijaya Kumar,** B.A., B.Ed., Dy. E.O., (Publications & Press), T.T.D. Press, Tirupati - 517507.

# తిరుపతి
# శ్రీకపిలేశ్వరస్వామి వారి
# వార్షిక బ్రహ్మోత్సవం

**14-02-2020 నుండి**
**23-02-2020 వరకు**





**14-02-2020 శుక్రవారం**
పగలు: ధ్వజారోహణం
రాత్రి: హంసవాహనం

**15-02-2020 శనివారం**
పగలు: సూర్యప్రభవాహనం
రాత్రి: చంద్రప్రభవాహనం

**16-02-2020 ఆదివారం**
పగలు: భూతవాహనం
రాత్రి: సింహవాహనం

**17-02-2020 సోమవారం**
పగలు: మకరవాహనం
రాత్రి: శేషవాహనం

**18-02-2020 మంగళవారం**
పగలు: తిరుచ్చిలో ఉత్సవం
రాత్రి: అధికారనంది వాహనం

**19-02-2020 బుధవారం**
పగలు: వ్యాఘ్రవాహనం
రాత్రి: గజవాహనం

**20-02-2020 గురువారం**
పగలు: కల్పవృక్షవాహనం
రాత్రి: అశ్వవాహనం

**21-02-2020 శుక్రవారం**
పగలు: రథోత్సవం
రాత్రి: నందివాహనం (మహాశివరాత్రి)

**22-02-2020 శనివారం**
పగలు: పురుషామృగ వాహనం
రాత్రి: (కల్యాణోత్సవం) తిరుచ్చి ఉత్సవం

**23-02-2020 ఆదివారం**
పగలు:
సూర్యప్రభ వాహనంలో నటరాజస్వామి
త్రిశూలస్నానం
రాత్రి: ధ్వజావరోహణం,
రావణాసుర వాహనం



SAPTHAGIRI (TELUGU) ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthanams
printing on 25-01-2020. Regd. with the Registrar of Newspapers under "RNI" No.10742, Postal Regd.No.TRP/10 - 2018-2020
Licensed to post without prepayment No.PMGK/RNP/WPP-04/2018-2020

